


ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-8-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 188 పేజీలు: 10+4 వెల: 6.50




## చేనేత ఓ కళాకారుని సృష్టి

చేనేత వస్త్రధారణ ఫ్యాషన్ మాత్రమే కాదు.. వోకల్ ఫర్ లోకల్ స్ఫూర్తికి నిదర్శనం: ప్రధాని మోడీ

2

# అన్ని రోడ్ నెట్‌వర్క్‌లు ఒకే సిస్టంలోకి

### భూ సేకరణ, రుణాలు, రోడ్ల నిర్వహణ ఈ సిస్టంలోనే ఉండాలి

### ఓఆర్ఆర్‌పై వాహనాలు నిలిపితే భారీ ప్రమాదాలు

### టిడిఆర్‌పై ప్రత్యేక కమిటీ ఏర్పాటు

### హెచ్ఎండిఏ, హెచ్ఆర్‌డిసిఎల్ అధికారులతో సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష



గురువారం హైదరాబాద్‌లో సమీక్ష చేస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు6:** అన్నీ రోడ్ నెట్వర్క్ ను ఒకే సిస్టమ్‌లో తీసుకు రావాలి, రోడ్డులకు సంబందించిన అన్ని విషయాల్ని ఈ సిస్టమ్ లోకి తీసుకోవాలి, భూసేకరణ,రుణాలు,రోడ్ల నిర్వహణతో అన్ని అంశాలు ఈ సిస్టంలోకి తీసుకురావాలి అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి ఎంసిఆర్ హెచ్ఆర్‌డి బోధి పెవిలియన్‌లో హెచ్ఎండిఏ/హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు.ఈ సమీక్షలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (మున్సిపల్ పరిపాలన,పట్టణాభివృద్ధి) జయేశ్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మణిక్ రాజ్, హెచ్ఆర్‌డిసిఎల్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి,ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు,రీజినల్ రింగ్ రోడ్డులు,నగరం లోని ఫ్లై ఓవర్లు, అండర్ పాస్ లు,ఇతర రోడ్లు ఈ వ్యవస్థ పరిధిలోకి రావాలని సిఎం స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణ సరిగా లేదు, ఔటర్ రింగ్ రోడ్డు పైన ఎక్కడిక్కడ వాహనాలను నిలపడం వల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ కాంట్రాక్టర్ నిరక్ష ్యంగా ఉన్నాడు, ఔటర్ రింగ్ రోడ్డు నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చెయ్యాలని చెప్పారు. టిడీఆర్ పైన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రభుత్వం సేకరించిన భూములకు మాత్రమే టీడీఆర్ చేయాలని ఆదేశించారు. టీడీఆర్ ప్రక్రియను మొత్తం ఆన్లైన్ చెయ్యాలి, టీడీఆర్‌లో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా వ్యవస్థ ను రూపొందించాలని చెప్పారు. రేడియల్ రోడ్డు ల నిర్మాణం వేగవంతం చేయాలని పేర్కొన్నారు. కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు రేడియల్ రోడ్ 1 ను డిసెంబర్ 9 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణంలో అడ్డంకులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. రోడ్డు నిర్మాణం నాణ్యతలో రాజీ లేదు. భవిష్యత్ లో ఇబ్బంది రాకుండా రోడ్డు నిర్మాణంలో వాడే మట్టి పైన జాగ్రతలు తీసుకోవాలని చెప్పారు. రోడ్‌లకు ఇరువైపులా పచ్చదనం ఉండేలా చూసుకోవాలని దిశానిర్దేశం చేశారు. బద్వేల్ ఇంటర్చేంజ్ ట్రంపెట్ అత్యంత కీలకం, ఎలేవేటెడ్ కారిడార్స్ >>2

# 15 నుంచి కొత్త రేషన్ కార్డులు

### సంగారెడ్డి జిల్లాలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్

### మొత్తం 119 సెగ్మెంట్లలో లామినేటెడ్ కార్డులిస్తాం: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక సంక్షేమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 1.05 కోట్ల కొత్తగా మంజూరైన లామినేటెడ్ ప్రజాపంపిణీ వ్యవస్థ రేషన్ కార్డులను ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం నుంచి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారిక మెమో జారీ చేశారు. ఈ విషయమై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విడుదల చేసిన ఒక ప్రకటనలో రేషన్ కార్డుల పంపిణీని తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా >>2

## నకిలీ ఫైర్ ఎన్‌ఒసిల కేసు

### మరో 176 కాలేజీలపై విచారణ

### 48 కాలేజీల చిట్టాను పోలీసులకు ఇచ్చిన హైడ్రా

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** ఇంటర్ కాలేజీలు నకిలీ ఫైర్ ఎన్ఓసిల అంశం మరింత ముదురు తుంది. ఇప్పటికే 56 కాలేజిలు అక్రమాలకు పాల్పడినట్లు తేలగా తాజాగా మరో 176 కాలేజీలపై అనుమానాలు రావడంతో వాటి పైనాపోలీసులు విచారణ చేబట్టారు. ఇదే సమయంలో హైడ్రా అధికారులు 48 కాలేజీల గోల్ మాల్ భాగోతాన్ని రట్టు చేస్తూవాటి అక్రమాలను >>2



## అమెరికా వీసా మరింత కఠినం

### ఎయిర్‌పోర్టుల్లోనే అదుపులోకి తీసుకుంటున్న యుఎస్ఐసి అధికారులు

**వాషింగ్టన్, ఆగస్టు 6:** అమెరికాలో నివసిస్తున్న భారతీయులు, ముఖ్యంగా ఉద్యోగాలు చేసే హెచ్1బీ వీసాదారులు, చదువుకునే ఎఫ్1 వీసా విద్యార్థులు ఇప్పుడు దేశీయంగా ప్రయాణించాలన్నా హడలిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. యుఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎయిర్‌పోర్టులలో సోదాలు తీవ్రతరం చేశారు. వీసా గడువు >>2



## తెహెల్కా మాజీ ఎడిటర్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు

### బాంబే హైకోర్టు

5

# సింగరేణికి 'నైనీ' సిరులు

### ఒడిశా నుంచి రాష్ట్రానికి నల్లబంగారం

### తెలంగాణ ఇంధన భద్రతలో చారిత్రక ఘట్టం

### ఫలించిన డిప్యూటీ సిఎం విక్రమార్క కృషి





**హైదరాబాద్, అగస్టు 6, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చే దిశగా సింగరేణి చరిత్రలో అత్యంత అద్భుతమైన, చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైన ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో, పాలకుల చిత్తశుద్ధితో ఎట్టకేలకు కార్యరూపం దాల్చింది. రాష్ట్ర ప్రజల విద్యుత్ అవసరాలను తీర్చడమే లక్ష్యంగా, ఒడిశా రాష్ట్రంలోని సింగరేణి నైనీ బొగ్గు గని నుంచి లోడ్ చేసిన తొలి బొగ్గు రైల్వే రేకు సుమారు 1,131 కిలోమీటర్ల ప్రయాణం పూర్తి చేసి గురువారం ఉదయం మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్టీపీపీ) కి చేరుకుంది. ఇతర రాష్ట్రంలోని సింగరేణి గని నుంచి తెలంగాణ రాష్ట్రానికి బొగ్గు సరఫరా కావడం సంస్థ చరిత్రలో ఇదే తొలిసారి కావడంతో ఎస్టీపీపీలో పండుగ వాతావరణం నెలకొంది. కేంద్ర బొగ్గు శాఖ 2015లో సింగరేణికి నైనీ బొగ్గు బ్లాక్‌ను కేటాయించింది. అయితే అధికారంలో ఉన్న తొమ్మిది సంవత్సరాలు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ బ్లాక్‌ను గాలికి వదిలేసింది. దీంతో అనుమతులు రాక ప్రాజెక్టు పడకేసింది. కానీ, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. అనుమతుల సాధనలో ఎదురైన ఎన్నో అడ్డంకులను పటాపంచలు చేస్తూ రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కూడా అయిన భట్టి విక్రమార్క అలుపెరగని కృషి చేశారు. స్వయంగా రెండుసార్లు ఒడిశా పర్యటనకు >>2




# మా మధ్య దూరం లేదు..

### సిఎం, నేను రోజూ ఫోన్‌లో మాట్లాడుకొంటాం: పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 6,ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేను రోజు ఫోన్‌లో మాట్లాడుకొంటాం మా మధ్య ఎలాంటి దూరంలేదని టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో గురువారం మీడియా తో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలకు కో ఆర్డినేషన్ కమిటీలో చర్చిస్తే బాగుంటుందనీ,అందరం చర్చిస్తే >>2

## సిఎం ఢిల్లీ ప్రదక్షిణలతో తెలంగాణకు

# ఏం ఒరిగింది?



జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కెటిఆర్

### సామంతులు కాదు.. స్వతంత్రులు కావాలని జయశంకర్ చెప్పేవారు: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు6:** తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీ ముందు తాకట్టు పెట్టే రాజకీయాలు రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. గురువారం తెలంగాణ భవన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడిన ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరచూ ఢిల్లీ పర్యటనలు చేయడంపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్ రెడ్డి 32 నెలల్లో 75 సార్లు ఢిల్లీకి వెళ్లారని, దాదాపు ప్రతి 13 రోజులకు ఒకసారి ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. "ఢిల్లీకి సామంతులు కాకుండా స్వతంత్రులు కావాలి" అని జయశంకర్ సార్ చెప్పేవారని గుర్తు చేశారు. స్వీయ రాజకీయ అస్తిత్వమే తెలంగాణకు శ్రీరామరక్ష అని ఆయన ఎప్పుడూ చెప్పేవారని పేర్కొన్నారు. తెలంగాణ నీటి హక్కుల విషయంలో ఏపీ ప్రభుత్వం తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను రద్దు చేయాలని >>2




## 20 నెలల్లో 150 జిసిసిలు

### 1.5 లక్షల ఉద్యోగాలు: మంత్రి శ్రీధర్ బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు6:** గత 20 నెలల కాలంలో తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన 150 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు (జీసీసీలు) ద్వారా 1.5 లక్షల మందికి ఉపాధి లభించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జేఎల్ఎల్ (జెఎల్ఎల్) సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ >>2



ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లా హెలాంగ్ సమీపంలో గురువారం బద్రీనాథ్ హైవేపై విరిగిపడిన కొండచరియలు

# దూరం లేదు..

>> మంచి నిర్ణయాలు తీసుకోగలమని అనుకున్నామనీ వివరణ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కో ఆర్డినేషన్ కమిటీకి అన్ని చెప్పాల్సిన అవసరం లేదు మేం ముఖ్యమంత్రిని గౌరవిస్తాం అని తెలిపారు. పార్టీ, ప్రభుత్వం వేరు వేరు కాదు రేవంత్ రెడ్డి మా కాంగ్రెస్ ముఖ్యమంత్రి మాత్రమే అని ఆయన చెప్పారు. నాకు, సిఎం కి మధ్య గ్యాప్ లేదు, ఆయన నేను రోజూ ఫోన్లో మాట్లాడుకుంటాం, నిన్న కూడా సిఎం తో ఫోన్ మాట్లాడాను అని తెలిపారు. నా ఆడియోలు వీడియోలు ఉన్నాయని ప్రచారం చేస్తున్నారు దమ్ముంటే నా ఆడియోలు, వీడియోలు బయట పెట్టండి అని సవాల్ విసిరారు. సిఎంకు, నాకు మంచి సఖ్యత ఉంది దొంగ చాటున ఫిర్యాదులు చేసుకునే అవకాశం కాంగ్రెస్ లో లేదు అని అన్నారు. ఏమున్నా మేం మొహంపైనే మాట్లాడుకుంటాం అని చెప్పారు.

" బయట జరుగుతున్న విషయాలను చర్చించుకుంటాం కో ఆర్డినేషన్ కమిటీలో కీలక చర్చ జరిగింది అందరం ఓపెన్ గానే మాట్లాడుకున్నాం కో ఆర్డినేషన్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశం మీరు ఫోటోలో చూస్తే వంశీ మధ్యలో కూర్చున్నట్టు అనిపిస్తోంది ప్రోటోకాల్ ప్రకారం మీనాక్షీ నటరాజన్ సమీక్ష నిర్వహించారు టేబుల్ ఓవెల్ షేప్ లో ఉంది కాబట్టి అందరూ పొరబడుతున్నారు" అని ఢిల్లీలో వంశీచంద్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరగలేదని వివరించారు.

నిజామాబాద్ ఎంపి అరవింద్ మాటలు నీటి మూటలు అని కొట్టివేశారు. నా ముందు అరవింద్, సంజయ్ పిల్లలు అని అన్నారు. లాల్ బహదూర్‌శాస్త్రీ పొట్టిగాఉన్నా దేశాన్ని ఏలలేదాఅని ప్రశ్నించారు.



గురువారం గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్

## గద్దర్ చిత్రపటానికి నివాళులు అర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు6:** ప్రజాకవి గద్దర్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. గద్దర్ ఆటాపాటా తెలంగాణ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. తన పాటల ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని నింపారని కొనియాడారు. అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం తన గళాన్ని వినిపించిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాటలు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించాయని అన్నారు. పాటను ప్రజా ఉద్యమానికి ఆయుధంగా మార్చిన అరుదైన వ్యక్తిత్వం గద్దర్ ది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు.

## 15 నుంచి కొత్త రేషన్ కార్డులు

>> చేపడుతోందని తెలిపారు. కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు.సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ప్రారంభోత్సవం నిర్వహించనుండగా, అదే సమయంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ప్రతి నియోజకవర్గంలో రెవెన్యూ డివిజనల్ అధికారి సమన్వయంతో జిల్లా యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ఆదేశించారు.

స్వాతంత్ర్య దినోత్సవ అధికారిక కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రేషన్ కార్డుల పంపిణీ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.

లబ్ధిదారుల జాబితాల ఖరారు నుంచి కార్డుల ముద్రణ, రవాణా, పంపిణీ కేంద్రాల ఏర్పాట్లు, ప్రజా సౌకర్యాలు, మీడియా ప్రచారం, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ వరకు అన్ని ఏర్పాట్లను సమగ్రంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. పేద కుటుంబాల ఆహార భద్రతను మరింత బలోపేతం చేస్తూ, ప్రజాపంపిణీ వ్యవస్థ ప్రయోజనాలను కొత్తగా అర్హత పొందిన ప్రతి కుటుంబానికి చేరవేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమ పాలనలో ఇది మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు.

## అన్ని రోడ్ నెట్‌వర్క్‌లు ఒకే సిస్టంలోకి

>> 1,3 పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ఎలేవేటెడ్ కారిడార్- 111 బంజారా హిల్స్ నుంచి శిల్పా లేఅవుట్ రోడ్ పనులను త్వరగా మొదలు పెట్టాలని చెప్పారు. హైదరాబాద్ నగర భవిష్యత్ రోడ్ల అభివృద్ధి పైనే ఆధారపడి ఉందన్నారు. భూ సేకరణ వేగవంతం చేయాలి..అధికారులు అలసత్వం చూపించొద్దు అని చెప్పారు. రోడ్ల ప్లానింగ్,నిర్మాణంలో ట్రాఫిక్ విభాగాన్ని ఇన్వాల్ చేయాలి, ల్యాండ్ పూలింగ్‌లో మధ్యవర్తుల జోక్యాన్ని సహించవద్దు అని అధికారులకు స్పష్టం చేశారు.

## అమెరికా వీసా మరింత కఠినం

>> ముగిసిన వారిని, ఇతర ఇమ్మిగ్రేషన్ స్టేటస్ దరఖాస్తులు పరిశీలనలో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని విమానాశ్రయాల్లోనే అదుపులోకి తీసుకుంటుండటంతో భయాలు పెరిగాయి. ప్రెసిడెంట్ ట్రంప్ సర్కార్ నిర్దేశించిన నగరాల నుంచి వెళ్లగొట్టే లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు ఈ తరహా ఆకస్మిక దాడులకు దిగుతుండటంతో భారతీయ నిపుణులు, విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గతంలో కేవలం క్రిమినల్ రికార్డులు ఉండి, కోర్టు ద్వారా డిపోర్టేషన్ ఆర్డర్లు వచ్చిన వారిని మాత్రమే అధికారులు టార్గెట్ చేసేవారు. కానీ ఇప్పుడు రూట్ మార్చి దేశవ్యాప్తంగా దాదాపు 15కి పైగా కీలక విమానాశ్రయాల్లో నిఘా పెంచారు. సీఐఎస్ రిపోర్ట్ శాన్ ఫ్రాన్సిస్కో, లాస్ ఏంజెల్స్, డెన్వర్, లాస్ వేగాస్, నాష్‌విల్లె వంటి బిజీ ఎయిర్‌పోర్టుల్లో చెకిన్ కౌంటర్లు, బోర్డింగ్ గేట్ల వద్దే ప్రయాణికులను ఆపి తనిఖీ చేస్తున్నారు. వీసా గడువు తీరినవారు, ఐ94 రికార్డు కాలపరిమితి పూర్తయినవారు, అలాగే అమెరికా పౌరులను పెళ్లి చేసుకుని ఇంకా గ్రీన్ కార్డ్ రాని వారిని కూడా విచారించి కస్టడీలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్లు ముఖ్యంగా విమానాల్లో తరచూ ప్రయాణించే మన భారతీయులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఉద్యోగ రీత్యా లేదా యూనివర్సిటీ పనులపై అంతర్గతంగా ప్రయాణించే వారు తమ వద్ద వీసా పొడిగింపు , లేదా స్టేటస్ మార్పు కోసం పెట్టుకున్న దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లయితే చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం దరఖాస్తు పెండింగ్‌లో ఉందని చెబితే సరిపోదని, తమ దగ్గర చట్టబద్ధంగా ఉండేందుకు కావాల్సిన సరైన ఆధార పత్రాలు చూపిస్తే తప్ప ఇమ్మిగ్రేషన్ అధికారులు వదలడం లేదని న్యాయవాదులు స్పష్టం చేస్తున్నారు. అధికారుల తీరుపై విమానయాన సంస్థల ఆగ్రహం! మరోవైపు ఎయిర్‌పోర్టులు, విమానాల్లోకి ప్రవేశించి తనిఖీలు చేపట్టడంపై వివిధ ఎయిర్‌లైన్స్ కంపెనీలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ప్రయాణికులను అరెస్ట్ చేయడానికి సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ విమానంలోకి ఎక్కడానికి ప్రయత్నించిన ఐసీఈ అధికారిని విమానయాన సిబ్బంది అడ్డుకోవడం అక్కడ తీవ్ర కలకలానికి దారితీసింది. అంతేకాకుండా విమానయాన సంస్థల్లో పనిచేసే సిబ్బంది వీసా గడువు పూర్తయితే వారిని కూడా వదలకుండా విధి నిర్వహణలోనే అరెస్ట్ చేయడం విశేషం. ఏది ఏమైనా అమెరికాలో ఉంటున్న విదేశీయులు ప్రస్తుత పరిస్థితుల్లో విమాన ప్రయాణాలు చేసేటప్పుడు అన్ని పత్రాలు దగ్గర ఉంచుకోవడం చాలా అవసరమని విదేశాంగశాఖ హెచ్చరికలు జారీచేసింది.

### వారం - వర్జ్యం

07-08-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె
తి.నవమి సా.4.34 న.కృత్తిక సా.6.40
వ.ఉ.7.25-ఉ.8.55
దు.1. ఉ.8.23-ఉ.9.14
దు.2. మ.12.38-మ.1.29
రాహు. ఉ.10.30-మ.12.00 శుభ లేదు

### వార్తాఫలం

- **మేషం :** రావలసిన మొత్తాలు, క్లైములు చెల్లించ వలసిన పద్దులు పరిష్కారమవుతాయి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.
- **వృషభం :** మీ కృషి ఫలిస్తుంది. ఆత్మీయులతో విహారయాత్రలు చేస్తారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.
- **మిథునం :** పిల్లల విద్య, వివాహ, ఉద్యోగ విషయాలలో శుభ పరిణామాలు కనిపిస్తాయి. విందు వినోదాలలో పాల్గొంటారు.
- **కర్కాటకం :** మీ ప్రవర్తనలో గానీ, వ్యవహారాలలో గాని దాపరికం, ఏకాంతత అవసరం. శుభవార్తలు వింటారు.
- **సింహం :** ఒక వ్యవహారంలో మర్మంగా వ్యవహరిస్తారు. ఋణాలు ఇవ్వటం తీసుకోవటం వంటి లావాదేవీలు జరుపకండి.
- **కన్య :** సంతానం విషయంలో కొంత మానసిక ఆందోళనకు గురవుతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.
- **తుల :** మీ కుటుంబ వ్యవహారాలలో అతిగా జోక్యం చేసుకునే వారిని ఆదిలోనే తుంచి వేయండి.
- **వృశ్చికం :** తామరాకు మీద నీటి బిందువులా ఉండటం వలన లాభ పడతారు. వస్తులాభం. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.
- **ధనుస్సు :** కారణం లేని చికాకులు మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తాయి. సోదరుల కలయిక. స్వల్ప ధనలాభం పొందుతారు.
- **మకరం :** ముఖ్యమైన పనుల విషయములో ఓర్పు వహించుట చాలా అవసరము. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.
- **కుంభం :** విదేశీ వస్తువుల ఆకర్షణ నుండి బయట పడుటకు జాగ్రత్తను వహించండి. జీవిత భాగస్వామి నుండి ధనలాభం.
- **మీనం :** వినోదమును సౌకర్యమును కలిగించే వస్తువులకు, పూజలకు దాన ధర్మములకు కాలమును వెచ్చిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఢిల్లీ ప్రదక్షిణలతో తెలంగాణకు ఏం ఒరిగింది?

>> ప్రయత్నిస్తోందని, జీఆర్ఎంబీ ద్వారా జరుగుతున్న అన్యాయాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు ఇప్పటికే ఆధారాలతో వివరించారని చెప్పారు. ఢిల్లీ పార్టీల చేతుల్లో తెలంగాణ మళ్లీ తల్లడిల్లుతోందని, తెలంగాణ కోసం పుట్టిన నిఖార్సయిన పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ఒక బీజేపీ ఎంపీ తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్‌తో పోల్చినా, బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎవరూ స్పందించలేదని విమర్శించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ, అప్పులు, అభివృద్ధి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మిగులు రాష్ట్రమని బీపీఆర్ విఠల్ అధ్యయనాలు నిరూపించాయని, నీళ్లు, నిధులు పుష్కలంగా ఉన్నా ప్రభుత్వం వాటిని వినియోగించలేకపోతోందన్నారు. కాంగ్రెస్ తెలంగాణకు శాశ్వత శత్రువని జయశంకర్ సార్ చెప్పేవారని గుర్తు చేస్తూ, తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కె.జయశంకర్ సార్ ఆశయాల సాధనే ఆయనకు అందించే నిజమైన నివాళి కేటీఆర్ అన్నారు. జయశంకర్ సార్‌తో పదేళ్ల పాటు కలిసి పనిచేసే అదృష్టం తనకు దక్కిందని కేటీఆర్ తెలిపారు. ఆయన ఒక ఎన్‌సైక్లోపీడియా, గొప్ప ఉపాధ్యాయుడని కొనియాడారు. కేసీఆర్‌ను తెలంగాణ జాతిపితగా భావించిన జయశంకర్ సార్, ఆయనకు గాడ్ ఫాదర్‌లా మార్గనిర్దేశనం చేశారని చెప్పారు. స్వయం సమృద్ధి, ఆత్మగౌరవం, స్వయం పాలన అనే మూడు దశల ద్వారా తెలంగాణ సమాజాన్ని జయశంకర్ సార్ విశ్లేషించారని, పాలమూరు వెనుకబాటుతనాన్ని కూడా అదే కోణంలో వివరించారని అన్నారు. 2006, 2008 ఉప ఎన్నికల సమయంలో ఉద్యమానికి భావజాల వ్యాప్తి, ఆందోళన, డెమోక్రటైజేషన్ అనే మూడు పార్శ్వాలు ఉన్నాయని జయశంకర్ సార్ చెప్పారని గుర్తు చేశారు. "యాచించి కాదు.. శాసించి తెలంగాణ సాధించాలి" అనే ఆలోచనను కేసీఆర్‌లో నూరిపోసిన వ్యక్తి ఆయనేనన్నారు. 2009 నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించిన రోజు జరిగిన సంఘటనలను కేటీఆర్ గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ అరెస్టు, హన్మకొండలో ధర్నా, జయశంకర్ సార్ ఇంటికి వెళ్లిన ఘటనలు తన జీవితంలో భావోద్వేగ క్షణాలని చెప్పారు. "ఉద్యమం భాస్వరంలా మండుతుంది.. తెలంగాణ తప్పక వస్తుంది" అని జయశంకర్ సార్ తమకు ధైర్యం చెప్పారని, శ్రీకాంతాచారి వంటి అమరవీరుల త్యాగాలతో ఉద్యమం విజయవంతమైందన్నారు.

## నకిలీ ఫైర్ ఎన్‌ఒసిల కేసు

>> పోలీసులకు అందజేశారు. ఇంటర్ కాలేజీలు అక్రమంగా ఫైర్ ఎన్‌ఓసిలు పొందిన వైనం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపడం తెలిసిందే. హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసి మరీ కొన్ని కాలేజీలు ఫైర్ సర్వీస్ ఎన్‌ఓసి పొందిన విషయాన్ని హైడ్రా బుధవారం నాడు రట్టు చేయడం విదితమే. దీనిపై సదరు కాలేజీలపై చర్యలు తీసుకోవాలని హైడ్రా అధికారులు ఇంటర్ బోర్డును కోరారు. ఈ మేరకు లేఖ అందజేశారు. హైడ్రా అందజే సిన లేఖను ఇంటర్‌బోర్డు పరిశీలించి చర్యలకు ఉపక్రమించింది. ఇందులో ఎనిమిది కాలేజీలకు గుర్తింపు రద్దు చేయగా మిగతా కాలేజీలకు నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారంపై ఇంటర్ బోర్డు ఓవైపు విచారణ చేస్తుండగానే హైడ్రా మరింత వేగంగా స్పందించింది. నకిలీ ఫైర్ ఎన్‌ఓసిలు పొందిన కాలేసీలు మరో 176 వరకు వున్నాయని హైడ్రాకు సమాచారం అందగా దీనిపై ఆ విభాగం అధికారులు విచారణ చేబట్టారు. ఇదే విషయమై అనుమానిత కాలేజీల వివరాలను హైడ్రా అధికారులు ఇంటర్ బోర్డుకు అందజేశారు. ఎన్‌ఓసిల కోసం హైడ్రాకు దరఖాస్తు చేసుకోకుండానే అనేక కాలేజీలు నకిలీ పత్రాలను పొందినట్లు హైడ్రా గుర్తించింది. ఇందుకోసం ఆయా కాలేజీలు పది లక్షల రూపాయల నుంచి 25 లక్షల రూపాయల వరకు ఖర్చు చేసినట్లు హైడ్రా గుర్తించింది. ఈ వ్యవహారంలో ఇంటర్ బోర్డు అధికారుల పాత్ర కూడా వుందని హైడ్రా గుర్తించింది. నకిలీ ఎన్‌ఓసిల కోసం హైడ్రాతో పాటు బల్దియా, ఫైర్ సర్వీస్ విభాగాల ఉన్నతాధికారుల సం తకాలను ఫోర్జరీ చేసినట్లు హైడ్రా గుర్తించింది.

# చేనేత ఓ కళాకారుని సృష్టి

### చేనేత వస్త్రధారణ ఫ్యాషన్ మాత్రమే కాదు.. వోకల్‌ఫర్‌లోకల్ స్ఫూర్తికి నిదర్శనం

### నేటి చేనేత దినోత్సవం సందర్భంగా మోడీ ప్రత్యేక విడియో!

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** ప్రతి చేనేత ఉత్పత్తి వెనుక ఓ కళాకారుడి కృషి, నైపుణ్యం, అంకితభావం దాగి ఉంటుందని మోడీ చెప్పారు. తరతరాలుగా భారతీయ సంప్రదాయ నేత కళలను సజీవంగా ఉంచుతున్న చేనేత కార్మికుల సేవలను కొనియాడారు. చేనేత వస్త్రాలను ఎంచుకోవడంకోసం కేవలం ఫ్యాషన్ మాత్రమే కాదని దేశీయ కళాకారులకు మద్దతు ఇవ్వడమే కాకుండా వోకల్‌ఫర్‌లోకల్ స్ఫూర్తిని బలోపేతంచేసే చర్య అని అన్నారు. కాగా, జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమ ప్రారంభాన్ని స్మరించుకుంటూ నిర్వహిస్తున్నారు. ఫ్రెండ్‌షిప్ డేను ఎలా ఆనందంగా జరుపుకున్నారో, అదే ఉత్సాహంతో హ్యాండ్లూమ్ డేను కూడా జరుపుకోండి. చేనేతను కేవలం ఒక రోజు మాత్రమే గుర్తు చేసుకునే అంశంగా కాకుండా, రోజువారీ జీవితంలో భాగంగా చేసుకోండి" అని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో ప్రస్తుతం విస్తృతంగా ప్రాచుర్యం పొందిన గెట్ రెడీ విత్ మీ ట్రెండ్‌ను ప్రస్తావించిన ప్రధాని, చేనేత దుస్తులు ధరించి వాటితో వీడియోలు రూపొందించి ప్రపంచంతో పంచుకోవాలని యువతను కోరారు."నాకు ఒక చిన్న విజ్ఞప్తి ఉంది. చేనేత దుస్తులతో గెట్ రెడీ విత్ మీ వీడియో రూపొందించి సోషల్ మీడియాలో పంచుకోండి. మరెందరికో స్ఫూర్తినివ్వండి. మన చేనేతను ఆదరించండి.. మన కళాకారులకు అండగా నిలవండి" అని మోడీ అన్నారు.ఆగస్టు 7వ తేదీకి ఉన్న చారిత్రక ప్రాధాన్యాన్ని కూడా ప్రధాని గుర్తు చేశారు. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమానికి నాంది పలికిందని, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఐక్యంగా ఉద్యమించిన రోజు ఇదేనని పేర్కొన్నారు.ప్రతి చేనేత ఉత్పత్తి వెనుక ఓ కళాకారుడి కృషి, నైపుణ్యం, అంకితభావం దాగి ఉంటుందని మోడీ చెప్పారు. తరతరాలుగా భారతీయ సంప్రదాయ నేత కళలను సజీవంగా ఉంచుతున్న చేనేత కార్మికుల సేవలను కొనియాడారు. చేనేత వస్త్రాలను ఎంచుకోవడం కేవలం ఫ్యాషన్ మాత్రమే కాదని దేశీ కళాకారులకు మద్దతివ్వడమే కాకుండా వోకల్‌ఫర్‌లోకల్ స్ఫూర్తిని బలోపేతం చేసే కార్యాచరణ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రతిసంవత్సరం ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమ ప్రారంభాన్ని స్మరించుకుంటూ నిర్వహిస్తున్నారు. కేంద్రం 2015నుంచి ఈ దినోత్సవం పురస్కరించుకుని పలు కార్యక్రమాలుచేపడుతూ స్వదేశీ వస్త్రాల వినియోగంప్రోత్సహించడం స్థానిక చేనేత కార్మికులకు మద్దతు పెంపొందించే దిశగా చర్యలు కొనసాగిస్తోంది.



గురువారం పార్లమెంటు వద్ద వర్షంలో ఆందోళనల్లో పాల్గొన్న రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ



వర్షంలో గొడుగుతో పార్లమెంటుకు వెళ్తున్న ఎంపి, సినీ నటి కంగనా రనౌత్

# సింగరేణికి 'నైనీ' సిరులు

>> వెళ్లారు. 2024 జులైలో తొలిసారిగా ఒడిశా వెళ్లి అక్కడి ప్రభుత్వంతో, అధికారులతో జరిపిన సానుకూల చర్చలు సత్ఫలితాలను ఇచ్చాయి. అడ్డంకులన్నీ తొలగిపోవడంతో 2025 ఏప్రిల్ 16న నైనీ గనిలో బొగ్గు ఉత్పత్తిని డిప్యూటీ సీఎం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఆరుగాలం శ్రమించిన ఫలితంగా, నేడు నైనీ నుంచి తొలి బొగ్గు రేకు తెలంగాణ గడ్డపైకి చేరుకుంది. ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు గని నుంచి తెలంగాణలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గు తరలింపు ఒక చారిత్రక అవసరం. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తిలో కీలకమైన ఈ థర్మల్ కేంద్రానికి నాణ్యమైన బొగ్గును అందించేందుకు తొలి రైలు రేకు ఏకంగా 1,131 కిలోమీటర్లు ప్రయాణించింది. 59 బాక్స్ వ్యాగన్ల ద్వారా 4 వేల టన్నుల అత్యుత్తమ జీ10 (బి10) గ్రేడ్ బొగ్గు సింగరేణికి చేరుకొని రాష్ట్ర ఇంధన రంగానికి కొత్త కళను తీసుకొచ్చింది. ఈ గని రాష్ట్ర విద్యుత్ రంగానికి రాబోయే దశాబ్దాల పాటు వెన్నెముకగా నిలవనుంది. సింగరేణి కీర్తి కిరీటంలో ఇది మరో వజ్రంగా మిగిలిపోనుంది. బొగ్గు నిల్వల సామర్థ్యం 340.78 మిలియన్ టన్నులు కాగా, వార్షిక ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి కోటి టన్నులు (10 మిలియన్ టన్నులు) గా ఉంది.అలాగే గనిజీవితకాలం 36 సంవత్సరాలు కాగా, బొగ్గు నాణ్యత అత్యుత్తమ జీ10 (బి10) గ్రేడ్‌గా ఉంది.

**అమెరికా నుంచి డిప్యూటీ సీఎం విక్రమార్క వీడియో సందేశం**

నైనీ బొగ్గు రాక సందర్భంగా ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అక్కడి నుంచే సింగరేణి యాజమాన్యానికి, కార్మికులకు వీడియో సందేశం ద్వారా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. "సింగరేణికి ఇది ఒక చారిత్రాత్మక సందర్భం. రాష్ట్ర అవసరాలు తీర్చడమే కాకుండా దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా సింగరేణి బొగ్గును సరఫరా చేస్తోంది. పెరుగుతున్న రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తిని పెంచే ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే మనం తాడిచర్ల2 బ్లాక్‌ను పొందాం. ఇటీవల వేలంలో మనుగూరు బ్లాక్ ను దక్కించుకున్నాం. భవిష్యత్తులో మరిన్ని బ్లాకులను పొందటానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది. రాబోయే వందేళ్లలో సింగరేణి కేవలం బొగ్గు గనులకే పరిమితం కాకుండా, క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ మినరల్స్ తవ్వకాల్లోకి కూడా అడుగుపెట్టాలి. ప్రపంచంలోనే అత్యుత్తమ మైనింగ్ సంస్థలతో పోటీపడే స్థాయికి సింగరేణి ఎదగాలి. అందుకోసం ప్రపంచంలో ఎక్కడ అందుబాటులో ఉన్న అత్యాధునిక మైనింగ్ యంత్రాలనైనా తెచ్చేందుకు సిద్ధం. ఇందులో భాగంగానే క్యాటర్‌పిల్లర్ కంపెనీకి చెందిన ఆధునిక మైనింగ్ పరికరాలను పరిశీలిస్తున్నాం. భవిష్యత్ తరాలకు ఉజ్వలమైన భవిష్యత్తును అందించే ఈ నూతన ప్రక్రియ మొదలైన నేటి రోజు ఒక చారిత్రాత్మక దినంగా నిలిచిపోతుందన్ని పేర్కొన్నారు.

## ఫేక్ ఫైర్ ఎన్‌ఒసిలపై అంతర్గత విచారణ ప్రారంభించాం

### పరిశీలన అనంతరం చర్యలు..

### అసత్య ప్రచారాలు, వదంతులను విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మవద్దు

### ప్రకటన జారీ చేసిన ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, ప్రభాతవార్త, ఆగస్టు 06:** ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు కోసం ప్రైవేటు జూనియర్ కాలేజీలు సమర్పించిన ఫైర్ ఎన్వోసీలపై అంతర్గత విచారణకు ఆదేశించినట్టు ఇంటర్ బోర్డు గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. కొన్ని ప్రైవేట్ జూనియర్ కాలేజీలు బోర్డు నుండి అనుబంధ గుర్తింపు కొరకు నకిలీ ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికేట్లను (ఫైర్ ఎన్‌ఓసి) సమర్పించాయని, సంబంధిత అధికారులు ఆయా యాజమాన్యాలపై చర్యలు ప్రారంభించారని విషయం వివిధ మీడియా నివేదికల ద్వారా తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యా బోర్డు దృష్టికి వచ్చిందని బోర్డు ప్రకటనలో తెలిపింది. ఈ విషయం ప్రస్తుతం బోర్డు పరిశీలనలో ఉందని, సంస్థలు సమర్పించిన ఫైర్ ఎన్‌ఓసీల ప్రామాణికతను ధృవీకరించడానికి ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభించబడిందని బోర్డు ప్రకటనలో తెలిపింది. విచారణ పూర్తయిన తర్వాత బోర్డు నిబంధనలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తేలిన ఏ సంస్థపైనైనా, బోర్డు నియమ నిబంధనలకు అనుగుణంగా తగిన కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపింది. ఈ విషయానికి సంబంధించి బోర్డు ఇతర సంబంధిత అధికారులందరితో పూర్తి సమన్వయంతో పనిచేస్తుందని, ఏదైనా సంస్థ చెల్లుబాటు అయ్యే అనుబంధ గుర్తింపు లేకుండా పనిచేస్తున్నట్లు తేలినా, బోర్డు నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలినా బోర్డు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపింది. ఇంటర్ బోర్డు ఈ విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణిస్తూ వాస్తవాలను క్షుణ్ణంగా ధృవీకరించి, తగిన చర్యలు తీసుకునేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటోందని స్పష్టం చేసింది. ధృవీకరించని వార్తలు, వదంతులను నమ్మవదనదని తల్లిదండ్రులకు, విద్యార్థులకు, యాజమాన్యాలకు ఇంటర్ బోర్డు విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపింది.

## 20 నెలల్లో 150 జిసిసిలు

>> కెపబిలిటీ సెంటర్‌ను గురువారం నాడు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన ప్రాంతాలను గుర్తించి సిఫారసు చేసే సంస్థగా జేఎల్‌ఎల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాంటి సంస్థ హైదరాబాద్‌ను తన జీసీసీ కేంద్రంగా ఎంచుకోవడం తెలంగాణ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ ఐటీ కార్యకలాపాలు మార్పులకు లోనవుతున్న తరుణంలో, ఇన్నోవేషన్ ఆధారిత జీసీసీలు భవిష్యత్ ఉపాధికి ప్రధాన కేంద్రాలుగా అవతరిస్తున్నాయని చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ), ఆటోమేషన్ ప్రభావంతో సాంకేతిక రంగంలో మార్పులు వచ్చినా, జీసీసీల ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు. తెలంగాణలో జీసీసీల వేగవంతమైన విస్తరణకు అత్యుత్తమ మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పరిశ్రమలకు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ప్రధాన కారణాలన్నారు.

హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఔటర్ రింగ్ రోడ్ ఎంత కీలక పాత్ర పోషించిందో, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్, ఏఐ సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు భవిష్యత్ పెట్టుబడులకు బలమైన పునాది వేస్తున్నాయని చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ, ఏఐ, డీప్‌టెక్, అధునాతన సాంకేతిక రంగాలకు అవసరమైన మానవ వనరులను రాష్ట్రం సిద్ధం చేస్తోందన్నారు. జేఎల్ఎల్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే వచ్చే రెండేళ్లలో సుమారు 1,600 మందికి ఉపాధి లభించనుంది. ఫైనాన్స్, మానవ వనరులు, ప్రాజెక్టు నిర్వహణ, లీజ్ అడ్మినిస్ట్రేషన్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, టెక్నాలజీ ఆధారిత సేవలను ప్రపంచవ్యాప్తంగా జేఎల్ఎల్ కార్యకలాపాలకు ఈ కేంద్రం సేవలను అందిస్తుంది. కార్యక్రమంలో జేఎల్ఎల్ ఇండియా సీఈఓ రాధా ధిర్, హైదరాబాద్ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పట్నాయక్, గ్లోబల్ సర్వీస్ సెంటర్ హెడ్ ధీరజ్ పోప్లీ, ఐటీ శాఖ సలహాదారు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తెరుచుకున్న జయక్వాడ్ 18 గేట్లు

### ఎస్సారెస్పీవైపు 9500 క్యూసెక్కుల వరద

### శ్రీశైలంలో 142 టిఎంసిల నీరు

**హైదరాబాద్,ఆగస్టు 6,ప్రభాతవార్త:** గోదావరిపై మహారాష్ట్రనదిపై ఉన్న జయక్వాడ్ ప్రాజెక్టు గేట్లు గురువారం తెరుచుకొన్నాయి. జయక్వాడ్ ప్రాజెక్టుకు చెందిన 18 గేట్లు ఒక అడుగుమేరకు ఎత్తి కిందికి 9500క్యూసెక్కుల నీరు వదిలిపెడతున్నారు. జయక్వాడ్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి 45వేల క్యూసెక్కుల వరద వస్తోంది. జయక్వాడ్ పూర్తి నీటి నిలుపుకొనే సామర్థ్యం 217930మిలియన్ లీటర్లు కాగా అందులోకి 98.67శాతం నీరు వచ్చి చేరింది,గత సంవత్సరం ఇదే సమయంలో 34.42శాతం నీరు మాత్రమే ఉండేది. ఔరంగాబాద్,జాల్నా ప్రాంతంలోని రెండున్నరలక్షల హెక్టార్లకు సాగునీటిని, తాగునీటిని భారీ పరిశ్రమలకు నీరు అందించే అతి కీలకమైన నీటిప్రాజెక్టు ఇది నిండటంతో కిందికి గోదావరి దిగువకు ఎస్సారెస్పీ వైపు నీటిని వదులుతున్నారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 38.97టిఎంసిలు నీరు ఉండగా 14446క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. జయక్వాడ్ వరద వచ్చిచేరితే మరింత రెట్టింపు అవుతోంది. ఎస్సారెస్పీ 121 టిఎంసిల నీటినిలుపుకొనే సామర్థ్యం ఉండేది కానీ పూడిక చేరడంతో ప్రస్తుతం 79.653 టిఎంసిలు మాత్రమే నీరు నిలుపుకొనే సామర్థ్యంకు పడిపోయింది.ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులకు వరద కొనసాగుతుంది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం వస్తుంది. ప్రాజెక్టుకు 2,32,939 క్యూసెక్కుల నీరు వస్తుండగా 7,493 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ 215.80 టిఎంసి లకు గాను ప్రస్తుతం 142 టిఎంసిల నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు. తుంగభద్ర జలాశయం పూర్తి నీటి నిల్వ 105.78 టిఎంసి లకు గాను ప్రస్తుతం 64.82 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఈ జలాశయానికి 60,751 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 1,750 క్యూసెక్కుల నీరును దిగువకు విడుదల చేస్తున్నారు.



# ప్రధాని మోడీతో నెట్‌ఫ్లిక్స్ సిఇఒ భేటీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** నెట్‌ఫ్లిక్స్ సీఈవో టెడ్ సారండోస్ భారత ప్రధాని నరేంద్ర మోడీని ఢిల్లీలో కలిశారు. ఆ ఇద్దరూ విస్తృత స్థాయిలో చర్చించుకున్నారు. భారతీయుల స్టోరీటెల్లింగ్ సామర్థ్యాన్ని కూడా డిస్కస్ చేసుకున్నారు. సృజనాత్మకత కలిగిన భారతీయులకు నెట్‌ఫ్లిక్స్ సీఈవో సారండోస్ ఆహ్వానం పలికారు. తమ ఫ్లాట్‌ఫామ్‌ను వినియోగించి అద్భుతమైన కథలను చెప్పాలన్నారు. భారతీయులు ఎటువంటి కథలను చెప్పబోతారో అన్న ఆసక్తితో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోకి నెట్‌ఫ్లిక్స్ ప్రవేశించి పదేళ్లు అవుతోంది. సీఈవో టెడ్ సారండోస్ ఇవాళ ప్రధాని మోడీని కలవడం సంతోషంగా ఉన్నట్లు నెట్‌ఫ్లిక్స్ కంపెనీ తన స్టేట్మెంట్‌లో తెలిపింది. భారతీయ మీడియా, ఎంటర్‌టైన్మెంట్ పరిశ్రమను విశ్వస్థాయికి తీసుకెళ్లే అంశాన్ని చర్చించినట్లు చెప్పారు. నెట్‌ఫ్లిక్స్ ఇండియా స్టోరీటెల్లింగ్ ఇనీషియేటివ్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. ఐఐసీటీ, ఎన్‌ఎఫ్‌డీసీతో కలిసి భవిష్యత్తు తరాలకు చెందిన భారత క్రియేటివ్ టాలెం ట్‌ను ప్రోత్స హించనున్నారు. ఇండియా తన రాబోయే రోజుల్లో ఎటువంటి సృజనాత్మకను ప్రదర్శిస్తుందో చూసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది. భారత మీడియా, ఎంటర్‌టైన్మెంట్ రంగానికి చెందిన సామర్థ్యాన్ని డిస్కస్ చేసినట్లు ప్రధాని మోడీ తెలిపారు. స్టోరీటెల్లింగ్ అంశంలో భారత్‌కు సుసంపన్న సంప్రదాయం ఉందని, అసాధారణ రీతిలో క్రియేటివ్ ట్యాలెంట్ ఉందన్నారు. కాంటెంట్ క్రియేషన్‌లో ఇండియా బలోపతంగా ఉన్నట్లు చెప్పారు.

# ప్రతికూల పరిస్థితుల్లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ

## నాబార్డు సర్వేలో వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:న**గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్ర ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొం టోందని జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంక్ (నాబార్డ్) వెల్లడించింది. జూన్, జూలై నెలలకు సంబంధించి గ్రామీణ పరిస్థితులపై సర్వే చేసింది. ఈ నివేదిక ప్రకారాం దేశ వ్యాప్తంగా 53 శాతం మేర గ్రామీణ కుటుంబాల ఆదాయంలో ఎటువంటి పెరుగుదల లేదని స్పష్టం చేసింది. మరోపక్క ఇంకో 20 శాతం కుటుంబాల ఆదాయం గతంలో పోల్చితే క్షీణించిందని తెలిపింది. అయితే 28 శాతం కుటుంబాలు మాత్రం తమ ఆదాయాన్ని పెంచుకున్నాయని వెల్లడించింది. కాగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం గ్రామీణ ప్రజలను తీవ్రంగా వేధిస్తోందని పేర్కొంది. అలాగే గ్రామీణులకు ఉపశమనాన్ని ఇచ్చే ప్రభుత్వ సబ్సిడీలు, సంక్షేమ పథకాల వాటా కూడా పడిపోయిందని నివేదికలో పేర్కొంది.

# 'సురక్షా కా తిరంగా'

## సైబర్ భద్రతపై టిజిసిఎస్‌బి ప్రచారం

## పోస్టర్ ఆవిష్కరించిన డిజిపి ఆనంద్

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం దేశవ్యాప్తంగా ప్రతీనెల మొదటి వారంలో ఏర్పాటు చేసే 'సురక్షా కా తిరంగా' ప్రచార కార్యక్రమం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఆధ్వర్యంలో ఘనంగా మొదలైంది. నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ ప్రచార కార్యక్రమాన్ని కమాండ్ కంట్రోల్‌లోని టిజిసిఎస్‌బి ప్రధాన కార్యాలయంలో డిజిపి సివి ఆనంద్ పోస్టర్ ఆవిష్కరించి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ సైబర్ జాగ్రూకా్త దివస్ పురస్కరించుకుని ఈ ప్రచారాన్ని చేబట్టినట్లు తెలిపారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా వుండేందుకు ఈ కార్యక్రమం దోహదం చే స్తుందని ఆయన అన్నారు. ప్రారంభోత్స వ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో 722 సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, ఇందులో లక్ష మందికి పైగా ప్రజలు పాల్గొని సైబర్‌నేరాల పట్ల ఎలా అప్రమత్తంగా వుండాలనే విషయాలను తెలుసుకున్నారని డిజిపి తెలిపారు. సైబర్ నేరగాళ్ల ఆగడాల విష యంలో ప్రతీ ఒక్కరు జాగ్రత్తగా వుండాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకూడదని ఆయన తెలిపారు. డిజిటల్ ప్లాట్‌ఫాం వాడుతున్న వారు సురక్షితమైన వాటినే ఎంచుకోవాలని, ఆన్‌లైన్ ప్రకటనల విషయంలో జాగ్రత్తగా వుండాలని ఆయన హెచ్చరించారు. దేశ వ్యాప్తంగా పెరుగుతున్న స్టాక్ ట్రేడింగ్, బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలను ప్రజలకు వివరించడం ఈ ప్రచార కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని డిజిపి ఆనంద్ తెలిపారు. దీంతో పాటు డిజిటల్ అరెస్టు సహా ఇతర కొత్త మోసాలపైనా ప్రజలకు అవగాహన కల్పి ంచడం లక్ష్యంగా దీనిని నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు, టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం కమాండ్ కంట్రోల్‌లోని టిజిసిఎస్‌బి ప్రధాన కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించిన డిజిపి సివి ఆనంద్ తదితర పోలీసు ఉన్నతాధికారులు

# జొన్న రైతులకు రూ.994 కోట్లు జమ

## కేంద్ర ఫెర్టిలైజర్స్ యాప్ అమలు

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:న** యాసంగి సీజన్‌లో కొనుగోలు చేసిన జొన్నలకు సంబంధించి రూ.994 కోట్లను విడుదల చేస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు చెప్పారు. ఈ సొమ్మును 1,01,376 మంది రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కనీస మద్దతు ధరతో జొన్న కొనుగోలు చేసిందన్నారు. మార్కెట్‌లో ధరల హెచ్చుతగ్గుల వల్ల రైతులు నష్టపోకుండా ప్రభుత్వం పూర్తి బాధ్యతతో కొనుగోళ్లు చేపట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి సాగు నుంచి విక్రయం వరకు సంపూర్ణ భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పంటకు గిట్టుబాటు ధరతో పాటు, సకాలంలో చెల్లింపులు అందే విధంగా నిరంతరం చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కాగా రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.


తెలంగాణ ప్రభుత్వం

**పురపాలక సంఘ కార్యాలయము-సూర్యాపేట, జిల్లా : సూర్యాపేట**

**బహిరంగ వేలం ప్రకటన**

నెం. ఎ1/1162/2026 తేది: 05.08.2026

ఇందుమూలముగా పట్టణ ప్రజలకు మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా, పురపాలక సంఘం, సూర్యాపేటనకు సంబంధించిన స్వామి వివేకానంద షాపింగ్ కాంప్లెక్స్, కూరగాయల మార్కెట్, అలంకార్ టాకీస్ ఎదురుగా మరియు పాత మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ యందు గల దుకాణములను నెలసరి అద్దె ప్రాతిపదికపైన మూడు (3) సంవత్సరముల కాలమునకు కేటాయించుటకు షరతులకు లోబడి పురపాలక సంఘ కార్యాలయ సమావేశ మందిరము యందు బహిరంగ వేలం నిర్వహించుటకు నిర్ణయించడమైనది. బహిరంగ వేలములో పాల్గొనేందుకు దరఖాస్తు సమర్పించుటకు చివరి తేది: 18-08-2026 సా.5.00గం.ల వరకు రూ.10,000/-ల డి.డి కమిషనర్, సూర్యాపేట మున్సిపాలిటీ పేర జతపరిచి దరఖాస్తు చేయవలెను. బహిరంగ వేలము తేది: 19-08-2026 ఉ.11.00గం.లకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించబడును. షాపులకు సంబంధించిన పూర్తి వివరములు మరియు రిజర్వ్ కాబడిన షాపులు, అన్ రిజర్వ్‌డ్ షాపుల వివరములు పురపాలక సంఘం నిర్ణయించిన నెలసరి అద్దె వివరములు కార్యాలయములోని నోటీస్ బోర్డుపై, శ్రీయుత ఆర్‌డిఒ/తహశీల్దార్/యం.పి.డి.ఒ/రిజిస్ట్రేషన్ కార్యాలయ నోటీస్ బోర్డులపై ఉంచడమైనది. ఇతర వివరముల కొరకు పురపాలక సంఘ కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/-.కమిషనర్, పురపాలక సంఘం, సూర్యాపేట.

DIPR.NO. 7457-PP/CL/ADVT/1/2026-27 తేది: 06.08.2026


# భారీగా పెరిగిన బియ్యం ధరలు

## రూ.500 నుండి రూ. వెయ్యి వరకూ పెరుగుదల

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** బియ్యం ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు విలవిలలాడుతున్నారు. భారీగా పెరిగిన రేట్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వరి సాగు అంతంతే ఉండే అవకాశాలు ఉంటాయని చెప్పడంతో మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. నెల రోజులుగా ధరలు ఊహించని రీతిలో రూ.500 నుండి రూ.వెయ్యి వరకూ పెరిగాయి. దీంతో మధ్య తరగతి, పేదలు ఎలా బతకాలో అర్థం కాకా సతమతమవుతున్నారు. సాధారణ ప్రజలు ఎక్కువగా వినియోగించే హంస రకం బియ్యం ధర క్వింటాల్‌కు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు చేరింది. హెచ్‌ఎంటీ బియ్యం రూ.6,500 నుంచి రూ.7 వేలకు, సోనా మసూరి రూ.5,200 నుంచి రూ.5,800లకు, జైశ్రీరాం సన్న రకం బియ్యం రూ.7వేల నుంచి రూ.7,500లకు పెరిగాయి.

మరోపక్క రాష్ట్రంలో సన్నరకం బియ్యం దిగుబడి గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో వ్యాపారులు ముందుగానే ధరలు పెంచినట్లు తెలుస్తోంది. రేషన్ దుకాణాల ద్వారా పొందిన బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సన్నబియ్యం వైపు ప్రజలు మొగ్గు చూపడం కూడా డిమాండ్ పెరగడానికి తెలుస్తోంది. కాగా బియ్యంతో పాటు ఇతర నిత్యావసరాల ధరలు కూడా అదే రీతిలో పయనిస్తున్నాయి.

నాణ్యమైన తెల్ల జొన్నలు క్వింటాల్‌కు రూ.7.500లకు, డయాబెటిక్ బాధితులు ఎక్కువగా వాడే పచ్చ జొన్నలు రూ.6వేల నుంచి రూ.8వేలకు పెరిగాయి. కందిపప్పు కిలోకు రూ.120, పెసరపప్పు రూ.110, మినపప్పు రూ.115, ఎర్ర పప్పు రూ.90కి చేరింది. గోదుమల ధర సైతం క్వింటాల్‌కు రూ.300 పెరిగింది.

ఈ ఏడాది ఎల్‌నినోతో పంటలు పండని పక్షాన నిత్యావసరాల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. హోల్‌సేల్ సరఫరాదారులు ధరలు పెంచడం వల్ల సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపుతోంది.


**తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు**

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది) తేది: 30-07-2026

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి ఆంధ్రుల భాగ్య నగర్ సమితి (పార్టీపేరు) అధ్యక్షులు అయిన శ్రీ పెనగంటి వెంకట సత్యనారాయణగారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ పి. వెంకట సత్యనారాయణగారు, అధ్యక్షులు, (2) శ్రీ ఎస్.జగన్నాథరావుగారు, జనరల్ సెక్రెటరీ, (3) శ్రీ పి. సూర్యనంశిగారు, ట్రెజరర్ ప్రధాన కార్యవర్గ సభ్యులు, మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము ఓ-51, రోడ్ నెం. 72, ఐడిఎ జీడిమెట్ల, హైదరాబాద్-55 సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, టిటిసిపి భవనము, ఎ.సి. గార్డ్స్, హైదరాబాద్-500004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు ఆంధ్రుల భాగ్య నగర్ సమితి (పార్టీపేరు)ను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

అధ్యక్షులు

ఆంధ్రుల భాగ్య నగర్ సమితి



తెలంగాణ ప్రభుత్వం

రెవిన్యూ (భూ సేకరణ) శాఖ

**ఫారం - 7**

(చట్టం - 30/2013లోని సెక్షన్ 19(1) సబ్ రూల్-1 రూల్ 25 ప్రకారం) మరియు (ఆక్ట్ నెం. 21 ఆఫ్ 2017 తెలంగాణ ప్రభుత్వం గెజిట్ పబ్లికేషన్ నెం. 22 తేది 17-05-2017 ప్రకారం) కలెక్టర్, అదనపు కలెక్టర్, స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ), రాజస్వ మండలాధికారి.

**రూఢీ ప్రకటన**

ఇ1/2097/2026 తేది: 22.07.2026

ఫైల్ నెం. F/1329/2026, తేది : 10.07.2026

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా చింతపల్లి గ్రామం మరియు చింతపల్లి మండలం విస్తీర్ణం ఎ.1.10గుం.ల భూమి ప్రజా ప్రయోజనార్థ నిమిత్తం డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులోని కిష్టరాయునిపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ క్రింద ముంపునకు గురైన మర్రిగూడ మండలములోని నర్సిరెడ్డిగూడెం గ్రామ పునరావాస మరియు పునరుద్ధరణ కొరకు భూసేకరణ నిమిత్తం ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నదని భావించబడును భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013లోని సెక్షన్ 19(1) అనుసరించి రూఢీ ప్రకటన జారీచేయనైనది.

తెలంగాణ ప్రభుత్వం వారు జి.ఓ.యం.యస్.నం.39 ఇరిగేషన్ & కాడ్ (ఎల్.ఎ.ఆర్ & ఆర్/ఎ2) డిపార్ట్‌మెంట్ తేది: 30.06.2017 జారీ చేసినారు. అట్టి జి.ఓ.నందు సెక్షన్ 10ఎ చట్టం నెంబర్ 21/2017, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని చాప్టర్-II మరియు చాప్టర్-III లను మినహాయించనైనది.

కావున పునరావాస మరియు పునర్నిర్మాణం కొరకు నల్లగొండ జిల్లా, చింతపల్లి గ్రామము మరియు మండలము, విస్తీర్ణం ఎ.1.10 గుంటల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన జారీచేయనైనది.

మండలం : చింతపల్లి — గ్రామము : చింతపల్లి

| క్రమ సంఖ్య | సర్వే నెం./ భూమి స్వభావం హక్కు స్వభావము | విస్తీర్ణం (ఎ.గుం.లు) | భూమిని కోల్పోయే రైతు పేరు తండ్రి / భర్త పేరు | భూమి పై చెట్లు /పైపులైన్/ బావి/బోరు/ ఇతరములు |
|---|---|---|---|---|
| 1 | | | సరికొండ ఈశ్వరమ్మ భర్త : శంకరయ్య | |
| 2 | | | మాధరి ఇందిర భర్త : సంజయ్ | |
| 3 | | | రమావత్ చంద్రశేఖర్ తండ్రి: కె.కె.శ్రీరాములు | |
| 4 | 154 మెట్ట/ప్రభుత్వ అసైన్డ్ భూమి ఎ.1.10 గుం.లు | 1.10 | [illegible] భర్త: నర్సింగ్‌రావు | తాటిచెట్లు-4 సమాధులు-3 |
| 5 | | | మాచిక్లి సత్యనారాయణ తండ్రి: కె.కె.శ్రీరాములు | |
| 6 | | | ఎం.శోభ భర్త: రామకృష్ణ | |
| 7 | | | శెట్టి ఇందు భర్త : మల్లప్ప | |
| 8 | | | మాచిక్లి కృష్ణయ్య తండ్రి: కె.కె. శ్రీరాములు | |
| | మొత్తం | 1.10 | | |

భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం, 2013లోని సెక్షన్ 15 ప్రకారం వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి రూఢీ ప్రకటన జారీచేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించుటకు విస్తీర్ణం శూన్యం.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్ట్ నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా రాజస్వమండలాధికారి, దేవరకొండ నందు కార్యాలయపు పని వేళల నందు చూసుకోవచ్చును.

సం/-.రాజస్వమండలాధికారి/ భూసేకరణ అధికారి, దేవరకొండ — సం/- అదనపు కలెక్టరు, నల్లగొండ — సం/-. జిల్లా కలెక్టర్ నల్లగొండ

DIPR RO.NO: 606/LA/PP/Advt/Pub/2026-27


# కెటిఆర్‌ను కలిసిన ప్రకాశ్ అంబేద్కర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు6:** బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో వంచిత్ బహుజన్ అగాడీ అధినేత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాష్ అంబేద్కర్ హైదరాబాద్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. గురువారం బంజారాహిల్స్‌లోని కేటీఆర్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో పలు రాజకీయ, సామాజిక అంశాలపై వీరిద్దరూ సుదీర్ఘంగా చర్చించారు. ఈ సంద ర్భంగా బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, నిరంజన్‌రెడ్డి, శాసనమండలిలో విపక్ష నేత మధుసూదనాచారి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, బాల్కసుమన్‌లతో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులను ప్రకాష్ అంబేద్కర్‌కు కేటీఆర్ పరిచయం చేశారు. భేటీ అనంతరం ప్రకాష్ అంబేద్కర్‌ను కేటీఆర్ శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు.



# రైసుమిల్లులపై వేగం పెంచిన విజిలెన్స్ దాడులు

## అజ్ఞాతంలోకి వెళ్లిన రైసు మిల్లర్లపై లుకౌట్ నోటీసులకు సన్నాహాలు

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా కస్టమ్ మిల్లింగ్ ధాన్యం పక్కదారి పట్టించిన రైసుమిల్లులపై మిల్లుల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు మెరుపుదాడి చేసి తనిఖీలు చేయడం జులై 20 నుంచి నిరంతరంగా కొనసాగిస్తూనే మరోవైపు అజ్ఞాతంలోకి వెళ్ళిన కొంత మంది రైసు మిల్లర్లపై లుకౌట్ నోటిసులకు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం కోదాడలోని భువనేశ్వరి, జెపి మిల్లుల్లో రైసు మిల్లుల్లో విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ తనిఖీలు చేపట్టారు. భువనేశ్వరి మిల్లులో సిఎంఆర్ కోసం ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం స్టాకు లేకపోవడం రికార్డులలో అవకతవకలున్నట్లు గుర్తించారు. సరిగ్గా వారం రోజుల క్రితం గత గురువారం రాత్రి వరగంల్, మహబూబ్‌నగర్,జగిత్యాల, నల్లగొండ,సూర్యపేట మెదక్ రైసుమిల్లుపై దాడి చేసి 154 కోట్ల రూపా యల ధాన్యం రైసుమిల్లులు పక్కదారి పట్టిం చినట్లు గుర్తించి కేసులు పెట్టారు. రెండవ అతి పెద్ద ధాన్యం వ్యత్యాసం మంగళవారం తనిఖీల్లో గుర్తించారు. ఐదు రైస్ మిల్లుల్లో ఏకంగా రూ.106 కోట్ల అక్రమాల్ని గుర్తించారు. ప్రభుత్వం అప్పగిం చిన ధాన్యాన్ని మిల్లర్లు బియ్యంగా చేసి మూడు నెలల్లోగా ఎఫ్‌సిఐ కి అప్పగించాలి. 2014 నుంచి 12 ఏళ్లు గడుస్తున్నా మిల్లర్లు సిఎంఆర్ ధాన్యాన్ని.. సర్కారుకు అప్పగించడం లేదు. విజిలెన్స్ అధికారులు నిజామాబాద్, వరగంల్, మలుగు, హనుమకొండ, మహబూబ్‌నగర్, జగిత్యాల, నల్లగొండ, సూర్యపేట, కరీంనగర్, పెద్దపల్లి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లోని మిల్లు లపై దృష్టి సారిస్తున్నారు. జగిత్యాల జిల్లా తక్కెళ్లపల్లి వద్ద అభయాంజనేయ స్వామి, లక్ష్మీబాలజీ లక్ష్మగణపతి రైసుమిల్లులలో 87.89కోట్ల ధాన్యం గల్లంతుకావడంతో కొండ లక్ష్మణ్, అరుణలపై క్రిమినల్ కేసులు పెట్టడంతో వారు అజ్ఞాతంలోకి వెళ్లారని సివిల్‌సప్లయ్‌శాఖ అధికార వర్గాలు తెలిపాయి. జగిత్యాల రూరల్ పోలీసు స్టేషన్‌లో సివిల్ సప్లయ్ శాఖ ఫిర్యాదు చేయడంతో ఈ మూడు రైసుమిల్లులు ఒకే యాజమాన్యంకు సంబందించినవి కావడంతో ఆ కుటుంబం మొత్తం అజ్ఞాతంలోకి వెళ్ళిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. విజిలెన్స్ కేసు ఉపసంహారణకు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో ముందస్తు బెయిల్ కోర్టును కూడా ఆశ్రయించారు. సిఎంఆర్ ధాన్యంకు సంబందించి గతంలోనే 30కోట్ల మేరకు బకాయి ఉన్న వీరికి తిరిగి ఇంత మొత్తం ఇవ్వడంతో ఇప్పుడు సివిల్‌సప్లయ్‌శాఖ అధికారుల ప్రమేయంపై కూడా విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. మరోవైపు అజ్ఞాతంవెళ్ళిన కొండలక్ష్మణ్ అరుణ దంపతులు విదేశాలకు పారిపోయే అవకాశం ఉందనే అనుమానంతో లుక్ఔట్ నోటిసులు జారీ చేయాలని విజిలెన్స్ అధికారులు స్థానిక పోలీసులకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. రాష్ట్రంలో గత 17రోజులుగా విజిలెన్స్ అధికారులు చేపట్టిన రైస్ మిల్లుల తనిఖీలలో రూ.742కోట్లు ధాన్యం స్టాకు రైసుమిల్లులలోని స్టాక్‌కు సివిల్‌సప్లయ్ కేటాయించిన స్టాక్‌కు వ్యత్యాసం ఉందని గుర్తించారు.


**ప్రజా ప్రకటన**

Timac AGRO India — **టిమాక్ ఆగ్రో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్**

**రాష్ట్ర కార్యాలయం:** డోర్ నెం. 1-862/A/1, సుందరయ్య నగర్, మధిర గ్రామం & మండలం, ఖమ్మం జిల్లా, తెలంగాణ - 507 203.

**రిజిస్టర్డ్ కార్యాలయం:** 32, పలని సెంటర్, టి.నగర్, చెన్నై – 600 017. తమిళనాడు

**ఎస్.ఓ. 2900(ఇ), తేదీ 24.10.2015 ఎరువుల (నియంత్రణ) ఉత్తర్వులు, 1985 క్లాజ్ 13** మరియు **21** ప్రకారం, ఫర్టిలైజర్ (కంట్రోల్) ఆర్డర్ నిబంధనల మేరకు క్రింది **100% నీటిలో పూర్తిగా కరిగే మిశ్రమ ఎరువులు మరియు సూక్ష్మ పోషకాలు** తెలంగాణ రాష్ట్రంలో విక్రయించనున్నట్లు ఈ ప్రకటన ద్వారా తెలియజేయబడుచున్నది.

- KSC I (NPK 14-40-05 )
- KSC II (NPK 23-6-6 + 13.2 S + TE)
- KSC III (NPK 15-05-35)
- KSC IV (NPK 0-32-40 + 4.4 S + 0.1 B + 0.1 Mo + TE)
- KSC V (NPK 08-16-42)
- KSC VI (NPK 14-12-14 + 14 S + 0.1B + TE)
- KSC Plus (NPK 15-0-25 + 7.1Ca)
- Timaspray N (NPK 21-07-07)
- Timaspray K (NPK 08-11-39)
- Timaspray B (Sodium Tetraborate 10.5%)

+91 89258 27085

contact@in.timacagro.com

07th August 2026 తెలంగాణ


# ఎల్‌నినోతో 27.9 కోట్ల మందికి ఆహారభద్రత ముప్పు

## సమితి ఆహారభద్రతా విభాగం కొత్త అంచనాలు

**న్యూయార్కు, ఆగస్టు 6:** అత్యంత శక్తివంతమైన ఎల్‌నినో వాతావరణ సంఘటన వచ్చే ఏడాది చివరి నాటికి ప్రపంచంలోని అత్యంత బలహీనమైన కొన్ని ప్రాంతాలలో అదనంగా దాదాపు 49 మిలియన్ల జనాభాకు ఆహారభద్రత కొరవడే ముప్పు ఉందని ప్రపంచ ఆహారభద్రత పథకం విభాగం వెల్లడించింది.

బలమైన ఎల్ నినో సంభవించడానికి 81 శాతం అవకాశం ఉందని, దీనితో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు కనీసం 1982 నుండి అత్యంత వేడి స్థాయికి చేరుకుంటాయని, 1950 తర్వాత అత్యంత బలమైన సంఘటనగా మారే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి సంస్థ ఒక నివేదికలో తెలిపింది.

పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు కాలానుగుణంగా పెరగడం వల్ల కలిగే ఎల్ నినో, ప్రపంచ వాతావరణ సరళిని మారుస్తుంది మరియు ఇది తరచుగా దక్షిణ ఆఫ్రికాలో కరువు, ఆసియాలోని కొన్ని ప్రాంతాలలో రుతుపవనాల ఆలస్యం మరియు ఇతర చోట్ల అస్తవ్యస్తమైన వర్షపాతంతో ముడిపడి ఉంటుందని తెలిపింది. గతంలో భారీస్థాయిలో ఆకలికి కారణమైన సంఘటనలు ఇవేనని డబ్ల్యూఎఫ్‌పి ఆహార భద్రత మరియు పోషకాహార విశ్లేషణ సేవల డైరెక్టర్ జీన్‌మార్టిన్ బాయర్ మీడియాతో అన్నారు. ఎల్ నినో యొక్క ప్రతికూల ప్రభావాలకు గురయ్యే అవకాశం ఉన్న 45 దేశాలపై జరిపిన విశ్లేషణ ఆధారంగా, తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న ప్రజల సంఖ్య దాదాపు 49 మిలియన్లు పెరిగి మొత్తం 274 మిలియన్లకు చేరుకోవచ్చని డబ్ల్యుఎఫ్‌పి అంచనా వేసింది. ఇప్పటికే సంక్షోభ స్థాయి లేదా అంతకంటే తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న ప్రాథమిక జనాభాతో పోలిస్తే 22 శాతం పెరుగుదల ఉదన్నారు.

మధ్య అమెరికా, దక్షిణ ఆఫ్రికా అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రాంతాలలో ఉంటాయని అంచనా వేయబడింది, మధ్య అమెరికాలో ఆహార అభద్రతతో బాధపడే ప్రజల సంఖ్య 83 శాతం, దక్షిణ ఆఫ్రికాలో దాదాపు 75 శాతం పెరగనుందని డబ్ల్యుఫ్‌పి నివేదిక పేర్కొంది. దక్షిణ ఆఫ్రికాతో పాటు దక్షిణ అమెరికా, కరేబియన్ లలో కూడా ఒక్కో ప్రాంతంలో 12 మిలియన్లకు పైగా అదనపు ప్రజలు తీవ్రమైన ఆహార అభద్రతలోకి జారిపోయే ముప్పు ఉందని ప్రకటించింది.


తెలంగాణ ప్రభుత్వం

**ఫారం-6**

భూసేకరణ అధికారి మరియు సబ్ కలెక్టర్, కల్లూరు వారి ప్రాథమిక ప్రకటన భూసేకరణ పునరుపాధి కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం)-2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 11(1) మరియు సబ్ రూల్ (1) ఆఫ్ రూల్ (19) అనుసరించి)

జిల్లా గెజిట్ నెం.: A3/66/2026 తేది: 30.07.2026

కలెక్టర్, ఖమ్మం ఫైల్ RC.NO. G1/75652/2024 తేది: 29.07.2026

LAOసబ్-కలెక్టర్, కల్లూరు ఫైల్ RC.NO.: A/1153/2025 తేది: 23.07.2026

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, ఖమ్మం గారు దిగువ నిర్దిష్ట పరిచిన ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలములోని ఏరుగట్ల గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ.6.32½గుం. నిమిత్తం అనగా SRLIP (సీతారామ లిఫ్ట్ నీటిపారుదల ప్రాజెక్టు) కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నందున భావించనైనది.

RFCTLA & R&R (తెలంగాణ సవరణ), 2016 (చట్టం నెం. 21 2017)లో III A లోని సెక్షన్ 10A(b) ద్వారా అందించబడిన అధికారాలను అమలు చేస్తూ, తెలంగాణ ప్రభుత్వం G.O.MS.NO.38 నీటిపారుదల & CAD (LA. R&R/A2), తేది: 30.06.2017, భూసేకరణ, పునరావాసం మరియు పునరుపాధి చట్టం, 2013లో న్యాయమైన పరిహారం పారదర్శకత హక్కు యొక్క అధ్యాయం II మరియు III యొక్క నిబంధనల దరఖాస్తు నుండి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మినహాయింపు ఇవ్వబడింది.

ఈ ప్రాజెక్ట్ క్రింద నిర్వాసితులు అయ్యే కుటుంబాల పునరావాసం మరియు పునరుపాధి కొరకు శ్రీ అడిషనల్ కలెక్టర్ (రెవిన్యూ) ఖమ్మం గారిని ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమింపబడియున్నారు.

కావున ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలములోని ఏరుగట్ల గ్రామములో ఉన్న భూమి సుమారు ఎ.6.32½గుం. గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వారి నుండి భూసేకరణ నిమిత్తం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయనైనది.

**షెడ్యూలు**

గ్రామము : ఏరుగట్ల — మండలం : పెనుబల్లి — జిల్లా : ఖమ్మం

| క్ర. సం | సర్వే నెంబరు | భూమి టైటిల్ | భూమి రకం | భూసేకరణలో పోవు చున్న భూమి ఎ.గుం. టలలో | అనుభవదారు/ పట్టేదారు యొక్క పేరు మరియు చిరునామా | హద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు మరియు కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 96/2 | పట్టా | మెట్ట | 0.03 1/4 | బూసి సత్యనారాయణ తండ్రి: లక్ష్మయ్య | 96/2 | 97/2 | 96/1 | 96/3 | |
| | | | మొత్తం | 0.03 1/4 | | | | | | |
| 2 | 97/2 | పట్టా | మెట్ట | 0.06 1/4 | [illegible] | 96/2 | 98/2 | 97/1 | 97/3 | |
| | | | మొత్తం | 0.06 1/4 | | | | | | |
| 3 | 98/2 | పట్టా | మెట్ట | 0.09 | [illegible] | 97/2 | 99/2 | 98/1 | 98/3 | |
| 4 | 98/2 | పట్టా | మెట్ట | 0.14 | [illegible] | 97/2 | 98/2 | 98/1 | 98/3 | |
| 5 | 98/2 | పట్టా | మెట్ట | 0.01 | [illegible] | 97/2 | 98/2 | 98/1 | 98/3 | |
| | | | మొత్తం | 0.24 | | | | | | |
| 6 | 108/2 | పట్టా | మెట్ట | 0.04 1/2 | [illegible] | 98/2 | 109/2 | 108/1 | 107/2 | [illegible] |
| 7 | 108/2 | పట్టా | మెట్ట | 0.01 | [illegible] | 98/2 | 108/2 | 108/1 | 107/2 | |
| 8 | 108/2 | పట్టా | మెట్ట | 0.04 | [illegible] | 98/2 | 108/2 | 108/1 | 107/2 | |
| 9 | 108/2 | పట్టా | మెట్ట | 0.06 | [illegible] | 98/2 | 108/2 | 108/1 | 107/2 | |
| 10 | 108/2 | పట్టా | మెట్ట | 0.01 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | |
| | | | మొత్తం | 0.16 1/2 | | | | | | |
| 11 | 107/2 | పట్టా | మెట్ట | 0.16 | [illegible] | 108/2 | 106/2 | 107/1 | 107/3 | [illegible] |
| | | | మొత్తం | 0.16 | | | | | | |
| 12 | 106/2 | పట్టా | మెట్ట | 0.05 | [illegible] | 107/2 | 106/2 | 106/1 | 106/3 | |
| 13 | 106/2 | పట్టా | మెట్ట | 0.21 | [illegible] | 107/2 | 106/2 | 106/1 | 106/3 | [illegible] |
| 14 | 106/2 | పట్టా | మెట్ట | 0.00 1/2 | [illegible] రామకృష్ణయ్య | 107/2 | 106/2 | 106/1 | 106/3 | |
| 15 | 106/2 | పట్టా | మెట్ట | 0.12 | దాదనబోయిన ప్రకాశ్‌రావు తండ్రి:గోవయ్య | 107/2 | 106/1 | 106/1 | 106/3 | |
| | | | మొత్తం | 0.38 1/2 | | | | | | |
| 16 | 105/2 | పట్టా | మెట్ట | 0.15 | మాలేపేని వెంకటరామయ్య [illegible] | 106/2 | 104/1 | 105/2 | 105/3 | |
| 17 | 105/2 | పట్టా | మెట్ట | 0.00 1/2 | [illegible] | 106/2 | 104/1 | 105/1 | 105/3 | |
| 18 | 105/2 | పట్టా | మెట్ట | 0.03 3/4 | [illegible] | 106/2 | 104/1 | 105/1 | 105/3 | |
| | | | మొత్తం | 0.19 | | | | | | |
| 19 | 104/2 | పట్టా | మెట్ట | 0.10 1/2 | [illegible] | 105/2 | 132/2 | 104/1 | 104/3 | |
| 20 | 104/2 | పట్టా | మెట్ట | 0.06 | [illegible] | 105/2 | 132/2 | 104/1 | 104/3 | [illegible] |
| 21 | 104/2 | పట్టా | మెట్ట | 0.08 | [illegible] | 105/2 | 132/2 | 104/1 | 104/3 | [illegible] |
| 22 | 104/2 | పట్టా | మెట్ట | 0.09 1/2 | [illegible] | 105/2 | 132/2 | 104/1 | 104/3 | |
| 23 | 104/2 | పట్టా | మెట్ట | 0.07 1/2 | [illegible] | 105/2 | 132/2 | 104/1 | 104/3 | |
| | | | మొత్తం | 1.01 1/2 | | | | | | |
| 24 | 132/2 | పట్టా | మెట్ట | 0.00 3/4 | [illegible] | 104/2 | 133/2 | 132/1 | 132/3 | |
| 25 | 132/2 | పట్టా | మెట్ట | 0.00 3/4 | [illegible] | 104/2 | 133/2 | 132/1 | 132/3 | |
| | | | మొత్తం | 0.01 1/4 | | | | | | |
| 26 | 153/2 | పట్టా | మెట్ట | 0.26 | [illegible] | 157/2 | 153/2 | 153/1 | 153/3 | [illegible] |
| | | | మొత్తం | 0.26 | | | | | | |
| 27 | 157/2 | పట్టా | మెట్ట | 0.12 1/2 | [illegible] | 159/2 | 153/2 | 157/1 | 157/3 | [illegible] |
| | | | మొత్తం | 0.12 3/4 | | | | | | |
| 28 | 159/2 | పట్టా | మెట్ట | 0.08 | [illegible] | 158/2 | 157/2 | 159/1 | 159/3 | |
| | | | మొత్తం | 0.08 | | | | | | |
| 29 | 158/2 | పట్టా | మెట్ట | 0.13 | [illegible] | 158/2 | 159/2 | 158/1 | 158/3 | [illegible] |
| 30 | 158/2 | పట్టా | మెట్ట | 0.12 | [illegible] | 158/2 | 159/2 | 158/1 | 158/3 | [illegible] |
| 31 | 158/2 | పట్టా | మెట్ట | 0.28 | [illegible] | 158/2 | 159/2 | 158/1 | 158/3 | [illegible] |
| 32 | 158/2 | పట్టా | మెట్ట | 0.06 1/2 | [illegible] | 158/2 | 159/2 | 158/1 | 158/3 | [illegible] |
| | | | మొత్తం | 1.19 1/2 | | | | | | |
| | | | మొత్తం విస్తీర్ణం | 6.32 1/2 | | | | | | |

[illegible]

సం/-. సబ్ కలెక్టర్, కల్లూరు — సం/-. అదనపు కలెక్టర్, ఖమ్మం జిల్లా — సం/-. కలెక్టర్, ఖమ్మం జిల్లా

DIPR RO.NO: 600/LA/PP/Advt/Pub/2026-27

వార్త

అభిప్రాయాలను మార్చుకోలేని వ్యక్తి తన తప్పుల్ని సరిదిద్దుకోలేడు. నేటి కంటే రేపు ఎక్కువ వివేకం ప్రదర్శించాలనుకుంటే మనిషిలో మార్పు అవసరం.

-తిరుక్కురళ్

# ప్రజారోగ్యాన్ని కాటేస్తున్న కాలుష్యం

కాలుష్య నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణ యోగ్యం కానీ విధానాలతో ప్రయోగాలు చేస్తూ రోజు రోజుకు సమస్యను మరింత జటిలం చేస్తున్నారు. అన్నిటి కంటే ముఖ్యంగా కాలుష్య నివారణకు రూపొందిస్తున్న నిబంధనలను, చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేయక పోవడంతో పర్యావరణం విషతుల్యంగా మారుతున్నది. ఫలితంగా దేశవ్యాప్తంగా కోట్లాది మంది రకరకాల వ్యాధులకు లోనవుతున్నారు.ఇందులో కొందరు దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి మంచానికే పరిమితమై అసువులు బాస్తున్నారు. అంతకంతకు కాలుష్యమేఘాలు కమ్ముకోవడం ఆందోళన కలిగించే అంశం. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉన్నా నగరాల్లో పరిస్థితి మాత్రం దారుణంగా తయారవుతున్నది. వర్షాకాలం ముఖ్యంగా చలికాలంలో పరిస్థితి అదుపు తప్పిపోతున్నదని పర్యావరణ శాస్త్రవేత్తలు ఏనాటి నుంచో హెచ్చరిస్తూనే ఉన్నారు. భారత్‌లో ఢిల్లీతోసహా అనేక నగరాల పరిస్థితి యేడాది యేడాదికి దారుణంగా తయారవుతున్నది. ముఖ్యంగా దీపావళి పండుగ సందర్భంగా పాలకులు విధించే నిబంధనలను కొందరు పాటించకపోవడం, ఇష్టానుసారంగా దీపావళి మందులు కాల్చడంతో కాలుష్యం పరాకాష్ఠకు చేరుతుందనే చెప్పొచ్చు. గత నాలుగైదు ఏళ్లగా ఢిల్లీ లాంటి నగరాల్లో పది రోజులకు పైగా పాఠశాలలకు సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇక కోల్‌కతా, ముంబయి నగరాలతో పాటు దక్షిణాది బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, వాయు నాణ్యత క్షీణిస్తున్నది.ఢిల్లీకి పొరుగునున్న యుపి, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లలో కూడా రోగధూళి విస్తరిస్తున్నాయి. దేశంలో ఆరు మెట్రోనగరాలు బెంగళూరు,చెన్నై, కోల్‌కతా, ముంబాయి, హైదరాబాద్, ఢిల్లీ, తదితర నగరాల్లో జరిపిన సర్వేల్లో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. నీటి, గాలి నాణ్యత వాతావరణ మార్పులు అటవీ విస్తీర్ణం, చెత్త నిర్వహణ, తదితర అంశాలపై జరిపిన ఆ సర్వేలో వాయుకాలుష్యం నగర జీవి ఊపిరితిత్తులకు పొట్లుపొడుస్తున్నదన్న విషయం వెలుగుచూసింది. కొన్ని నగరాల్లో వాయుకాలుష్యం తీవ్రంగా ఉన్నదని వెల్లడయింది. మరికొన్ని ప్రాంతాల్లో పారిశ్రామిక కాలుష్యం అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్ నగరంలో నీటి,వాయు కాలుష్యంతోపాటు నిర్మాణ రంగం వల్ల వెలువడే గాలిలో ధూళికణాలు అధికంగా ఉన్నట్లు బయటపడింది. మరొకపక్క గ్రామాల నుండి నగరాలకు వలసలు పెరిగిపోవడం, ఒక పద్ధతి, ప్రణాళిక లేకుండా కాలనీలు వెలుస్తున్నాయి. మురికివాడల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమం తీసుకుంటున్నా, మరొకపక్క వలసలతో అవి ఎక్కడికక్కడ పెరిగిపోతున్నాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. ఆరేడేళ్ల క్రితం భారత్‌లో ఎంపిక చేసిన 102 నగరాల్లో ధూళికణాల ముప్పును ఇరవై నుండి ముప్ఫైశాతం మేర తగ్గించేందుకు జాతీయ వాయుశుద్ధి కార్యక్రమాన్ని ఆరంభించారు. ఆతర్వాతక్రమేపీ మరో ముప్ఫైనగరాలకు పైగా విస్తరించారు. 2025-26 నాటికి సూక్ష్మకణాలను నలభైశాతానికి నియంత్రిస్తామంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాదాపు ఏడువేల కోట్ల రూపాయల వరకు వెచ్చించినా పరిస్థితుల్లో పెద్దగా మార్పురాలేదు. పశ్చిమ బెంగాల్, పంజాబ్, యుపి, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల్లో నిబంధనలు పట్టించుకోవడం లేదు. అంతర్జాతీయంగా ప్రధానంగా చైనా,అమెరికా లాంటిదేశాలు వాయు కాలుష్యాన్ని నియంత్రించడంలో సఫలీకృతం అవుతున్నట్లు అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కాలుష్యానికి మూలమైన దాదాపు ఐదువందలకుపైగా కారు మోడళ్లను నిషేధించి ప్రజారవాణా వ్యవస్థను కాలుష్యరహితంగా మార్చేందుకు చైనా తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. బొగ్గు ఆధారిత విద్యుత్ కర్మాగారాల నిర్మాణానికి దాదాపు ఆయా దేశాలు ఫుల్‌స్టాప్ పెట్టాయి. కానీ మన దేశంలో నేటికీ వాటిని కొనసాగించడమేకాక కొత్త,కొత్త ప్రాజెక్టుల వైపు అడుగులు వేస్తున్నారు.అడవుల సంరక్షణకు ఎన్నో దేశాలు పటిష్టమైన చర్యలు తీసుకుంటూ కాపాడుకుంటున్నాయి. మనదేశంలో పరిస్థితి అందుకుభిన్నంగా ఉన్నదేమోననిపిస్తున్నది. రోజూ దాదాపు 330 హెక్టార్లకు పైగా అటవీ సంపద హరించుకుపోతున్నది. మరొకపక్క పర్యావరణాన్ని కాలుష్యం చేస్తూమోతాదుకు మించిన పొగను వదులుతున్న వాహనాలు భారత్‌లో కోట్ల సంఖ్యలో ఉండొచ్చు. వాటిని నియంత్రించేందుకు ఎన్నోచట్టాలు తీసుకువచ్చారు. నిబంధనలను విధించారు.జరిమానాలు వేస్తున్నారు. అన్నికాగితాలకే పరిమితమవుతున్నాయి.పెట్రోలు, డీజిల్‌లో జరుగుతున్న కల్తీ ఈకాలుష్యాన్ని మరింతపెంచుతున్నది. వాహన కల్తీని నిరోధించేందుకు అధికారగణం తీసుకుంటున్న చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదు. మొత్తం మీద తీవ్రస్థాయిలో వెలువడుతున్న విషవాయువుల వల్ల పర్యావరణం విషతుల్యంగా మారి ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నది. గతంలో పర్యావరణ పరిశోధన శాస్త్రజ్ఞులు చేసిన అధ్యయనంలో 132దేశాల కంటే భారత్ అట్టడుగునున్నట్లు వెలుగుచూసింది. ధూళికణాలు ఉండాల్సినస్థాయికన్నా ఐదు రెట్లు అధికంగా ఉండి శ్వాసకోశ సమస్యల నుంచి కేన్సర్‌దాకా అనేక వ్యాధులకు కారణమవుతున్నాయని ఆ నివేదిక వెల్లడించింది. ప్రత్యేకించి భావితరంబాలికలబతుకు దీపాలను ఈకాలుష్యం చిదిమేస్తున్న విషయం వెలుగుచూసింది. ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ కాలుష్య భూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమస్య తీవ్రతను గుర్తించి నివారణకు ఆచరణయోగ్యమైన విధానాలు ప్రకటించడమేకాదు,అమలుకు త్రికరణ శుద్ధిగా కృషిచేయాలి.అన్నిటికంటే ముఖ్యంగా పర్యావరణం పట్ల ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి జరగాలి.

పేదరికం కారణంగా ఇంతవరకూ ఏ దేశం సమిసిపోలేదు. అవినీతి కారణంగానే దేశాలు నేలమట్టమయ్యాయి.



నానీ పాల్కీవాలా

ఇతరులు అనుసరించడానికి, తమనే ఉదాహరణగా తీసుకోవాలని తమకు తామే ఎవరైతే అనుకుంటారో వారు అభివృద్ధి చెందలేరు.



గోల్డ్‌స్మిత్

## ప్రజావాక్కు



### జనరిక్ ఔషధాలపై సుంకాలు

అమెరికా దిగుమతి చేసుకునే జనరిక్ ఔషధాలపై భారీగా సుంకాలు విధించే ప్రతిపాదన ఆందోళన కలిగించే పరిణామం. జాతీయ భద్రత పేరుతో ఇలాంటి చర్యలు తీసుకోవడం ఆరోగ్య రంగంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అమెరికాలో ఉపయోగించే ప్రిస్క్రిప్షన్ ఔషధాల్లో పెద్దభాగం జనరిక్ మందులేకావడంతో, వాటి సరఫరాకు ఆటంకం ఏర్పడితే మధుమేహం, క్యాన్సర్, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కోట్లాది మందిరోగులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.ప్రపంచ ఔషధ రంగంలో భారత్‌కు ప్రత్యేక స్థానం ఉంది. తక్కువ ఖర్చుతో నాణ్యమైన జనరిక్ మందులను అందిస్తూభారత్ అనేక దేశాల అవసరాలను తీర్చుతోంది. ఔషధాల సరఫరాను అడ్డుకునే విధానాలు అమలు చేస్తే మందుల కొరతతో పాటువైద్య ఖర్చులుకూడా పెరిగే అవకాశంఉంది.దీని ప్రభావం ముఖ్యంగా సాధారణ ప్రజలు, తక్కువ ఆదాయ వర్గాలపై ఎక్కువగా పడుతుంది.

- హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అసెంబ్లీలో చోటు సంపాదించిన వ్యూహకర్త

ఎన్నికల వ్యూహకర్తగా దశాబ్దం పాటు వెలిగిన ప్రశాంత్ కిశోర్ బీహార్ అసెంబ్లీలోకి తన పార్టీ తరపున ఏకైక సభ్యునిగా అడుగిడుతున్నారు. 2014 ఎన్నికల్లో మొదటి సారిగా బీజేపీ తరపున వ్యూహకర్తగా పనిచేసి అందరి దృష్టిని ఆకర్షించిన ఆయన తరువాత దేశవ్యాప్తంగా పలు పార్టీల ఎన్నికలకు పనిచేశారు. 2024లో బీహార్ లో జనసురాజ్ పార్టీ స్థాపించారు.తన నాయకత్వంలో గత ఎన్నికల్లో ఆ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేసినా విజయం నాస్తి.ఇప్పుడు మళ్లీ అదేబీజేపీ తననూతనజాతీయ అధ్యక్షుని స్థానం ఖాళీచెయ్యగా వచ్చిన ఉప ఎన్నికలో, దానికి ఎదురొడ్డిమొదటిసారిగా పోటీ చేసిన ఆయన విజయాన్ని అందుకున్నారు. ఆ స్థానం బీజేపీకి కంచుకోట.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### సర్ తప్పులకు అవకాశం

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఓటరు ప్రక్షాళన జాబితాలో భాగంగా ఇదివరకే పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారంలో ఏవైనా తప్పులు ఉంటే సవరణలకు 10వతేదీ వరకు అవకాశం ఉంది. కావున ఇంకా ఎవరైనా ఫారాలు బూత్ లెవెల్ అధికారులకు ఇవ్వని వారు ఎవరైనా ఉంటే త్వరగా ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### దొంగబాబాలదే పెత్తనమా!

ఆకివీడు దగ్గర ప్రభుత్వ భూమిలో చర్చి ఉన్నదని ఆభూమిని స్వాధీనం చేసుకుంటున్నారు అక్కడి పోలీసులు. మరి రాష్ట్రంలో దొంగబాబాలు ఆక్రమించిన ప్రభుత్వ భూముల సంగతి ఏమిటి ? శాపాలు పెడతారని ప్రభుత్వానికి భయమా !మీకు ఆ భయంఅవసరం లేదు.హేతువాదులు ఉన్నారు. బాబాలకు విరుగుడు మందు మావద్ద ఉంది.నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో బాబాలు ఎక్కడ కనిపించేవాళ్ళు కాదు.ఒకవేళ ఉన్నా జనం ఉతికి ఆరేస్తారనీ భయం కావచ్చు.ఈరోజు సాక్షాత్తు పార్లమెంటు భవన ప్రారంభానికి వందమంది బేతాళ మాంత్రికులు వచ్చారు.వారికి ప్రధాని సాష్టాంగపడ్డారు. అమరావతి కరకట్ట మీద నదీపరివాహిక సూత్రాలకు విరుద్ధంగా నిర్మించిన ఆశ్రమాల సంగతి ఏమిటి? నీళ్ల తాగితే రోగాలు పోతాయని చెప్పుకునే నీళ్ళరాజు ఆశ్రమం ఇవన్నీ అక్రమనిర్మాణాలే! వీటిని ఎందుకు కూల్చరు? మరి ఆకివీడులో చర్చిని కూలుస్తున్నట్లుగా రాష్ట్రంలో దొంగబాబాలు ఆక్రమించిన భూములను కూడా స్వాధీనం చేసుకోండి. అపుడు రాష్ట్ర ప్రజలు మిమ్మల్ని నమ్ముతారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### యువత జాగ్రత్త

యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాది. సిగరెట్, గుట్కా, మద్యం,మత్తు పదార్థాలు వంటి వ్యసనాలు శారీరక, మానసికఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.సోషల్ మీడియా, మొబైల్ ఆన్‌లైన్ గేమ్‌లను అతిగా ఉపయోగించడం కూడా హానికరమైన అలవాట్లే.ఈవ్యసనాలు చదువు, ఆరోగ్యం, కుటుంబ ఆనందంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి.ప్రతిరోజూ వ్యాయామం,యోగా, ధ్యానం చేయడం మంచిది. పుస్తకాలు చదవడం, కొత్తనైపుణ్యాలు నేర్చుకోవడం అలవాటు చేసుకోవాలి. సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు లేదా ఉపాధ్యాయులతో మాట్లాడాలి.సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యసాధనకు కృషిచేయాలి. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆదర్శ యువతగా సమాజానికి స్ఫూర్తిగా నిలవాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### తెరముందు కథ

తెరలేపారు.తెరదించారు వెనుక విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయంటే అతిశయోక్తికాదు. వెండితెర, బుల్లితెర, బుజ్జితెర పలువిధాలుగా మార్పుచెందింది. ఒకప్పుడు సినిమా హాల్లో, సిల్వర్ స్క్రీన్‌కు రక్షణగా తెరుండడం చాలా మందికి తెలిసే ఉంటుంది.ఇక దోమ తెర ఆరోగ్యానికి చిహ్నం. ప్రేక్షక రారాజులకు పరదాకు అవినాభావ సంబంధం ఉంది.

-ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జీవకళ కోల్పోతున్న 'చేనేత'!

*భారత ప్రభుత్వం చేనేత దినోత్సవాన్ని ప్రకటించి దశాబ్ద కాలం గడిచినా ప్రధానమంత్రి దేశ విదేశాలలో తరచుగా మాట్లాడుతూ విశ్వగురు పాత్ర పోషించే అవకాశం కేవలం చేనేత రంగానికే ఉందని చెబుతున్నా చేనేతకు సంబంధించిన అన్నిరకాల వస్త్ర ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం ఎన్నడు లేని విధంగా టెక్స్‌టైల్స్‌తో సమానంగా చేనేతకు జీఎస్టీని విధించింది. అంగట్లో అన్నీఉన్నా అల్లునినోట్లో శనిఅన్నట్టు బడ్జెట్ కాగితాల్లో వేలకోట్లు కనిపిస్తున్నా చేనేతకు అరకొర నిధులు కేటాయిస్తున్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి నిధుల కొరతతోకొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వాలు మాత్రం వందల కోట్లు ఖర్చుచేస్తూ పర్యటనలు ప్రచారాలతో హంగు ఆర్భాటాలతో వృథాఖర్చు చేస్తున్నారు. పాలకులకు చేనేత సంక్షేమంపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ప్రచారాల ఆర్భాటాల వెనుక ఉన్న వృథా ఖర్చులను తక్షణమే అరికట్టి వందల కోట్లను నేరుగా చేనేత రంగానికి మళ్ళిస్తేనే చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండుతాయి.*



డాక్టర్ చిక్కా దేవదాసు

చేనేత భారతదేశపు సాంస్కృతిక సుసంపన్నమైన వారసత్వానికి ప్రతీక. వేల సంవత్సరాలుగా భారతీయుల జీవన విధానంలో అంతర్భాగంగా బాసిల్లుతూ చేనేతకు ప్రత్యేక స్థానం ఉంది. దీనికి తోడు చేతితో నూలు వడకడం, చేనేత వస్త్ర ఉత్పత్తులలో వృత్తి నైపుణ్యంలో చేనేత కార్మికుడు ఎవరికి తీసిపోడు. స్వాతంత్ర్య పోరాట ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన రాట్నం నేడు రక్షణకు నోచుకోలేక విలవిలలాడుతుంది. విదేశీ వస్త్ర బహిష్కరణ ఆనాటి ఆంగ్లేయుల ప్రభుత్వాన్ని బెంబేలెత్తించింది. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాదిమందికి అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న చేనేత పరిశ్రమ సాటిలేని పనితనం, వారసత్వ అనుభవం గల ఈ ప్రాచీన పరిశ్రమకు మన దేశపు చేనేత వస్త్రాల నైపుణ్యం, కళాత్మకత ప్రపంచమంతటా మన్ననలు పొందాయి. ఒకప్పుడు ఎంతో గర్వంగా దేశానికే ప్రతిష్టతెచ్చే విధంగా మనగలిగిన చేనేతకు, చేనేత కార్మికులకు స్వాతంత్ర్యానంతరం నుండి నేటివరకు వచ్చిన ప్రభుత్వాలు, పాలకులు చేనేత పరిశ్రమను రక్షిస్తామని,చేసేది గోరంత... చెప్పేది కొండంత అన్న చందాన గొప్పగానే చెబుతున్నా ఆచరణకు ఆమడ దూరంలో విధివిధానాలు రూపొందిస్తూ సరైన ప్రోత్సాహకం అందించక చేనేత కార్మికుల బతుకులను భారంగా మారుస్తూ చేనేత పరిశ్రమను నేడు అంతరించే దశకు దిగజారుస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోచేనేత వస్త్ర ఉత్పత్తులకు, ముచ్చట గొలిపే పనితనానికి, కళాత్మకతతో తయారైన వస్త్రాలకు ఆదరణ లభించడానికి అందం ఒకటే ప్రధానం కాదు, నేసిన వస్త్రంలోని ప్రతి అంగుళం యంత్ర సహాయం లేకుండా చేనేత కళాకారుడు చూపగల కళా నైపుణ్యానికి ప్రత్యక్ష నిదర్శనం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో చేనేత కార్మికులు అప్పుల బారిన పడి ఆకలి చావులు, ఆత్మహత్యలతో నిండునూరేళ్ళు బతకాల్సిన నేతన్నలు ప్రభుత్వ చేనేత పథకాలు, విధివిధానాలు వికటించి, పేదరికంతో అనారోగ్యంతో రోగాల బారినపడి,తిండి దొరకక మృత్యులోగిళ్లలోకి వెళుతున్నారు. ప్రభుత్వాల ఉదాసీన వైఖరి నిర్లక్ష్యం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన బతకలేక పూటగడవక బతుకు పోరుబాట పట్టలేక యాచక వృత్తి ఆశించలేక, ప్రభుత్వాన్ని నిలదీసే శక్తి లేక, పని భద్రత లేక, కనీసం వేతనాలు అందక, సౌకర్యాలు కరువై, భవిష్యత్తుపై భరోసా లభించక చేనేత కార్మికులు నేసే మగ్గం దారమే ఉరితాడుగా నిండు ప్రాణాలను బలి తీసుకుంటూ ఆత్మహత్యలకు పాల్ప డుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ ఎన్నికల మేనిఫెస్టోలో చేనేత రంగానికి అనేక హామీలు ఇచ్చి అధికారంలోనికి రాగానే చేనేత కార్మికుల సంక్షేమం కోసం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా 45 మంది చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులకు కొత్త పథకాలు అమలు చేయకపోగా పాత పథకాలకి కోతలు విధిస్తూ నమ్మినచేనేతలను, చేనేత కార్మికులను నిట్ట నిలువునా మోసం చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే. దశాబ్ద కాలంగా తెలంగాణ ప్రభుత్వం చేనేత సహకార సంఘాల వద్ద టెస్కో ద్వారా చేనేత వస్త్ర ఉత్పత్తులను చేనేత కార్మికులకు పని కల్పించాలనే ఉద్దేశంతో జీవో నెంబర్ 1 ద్వారా చేనేత సహకార సంఘాలలో ఉత్పత్తి అయిన వస్త్రాలను టెస్కో ద్వారా కొనుగోలు చేసి వాటిని గురుకుల పాఠశాలలకు షర్టింగ్, షూటింగు, దుప్పట్లు, తువాళ్లు, కార్పెట్లు,ప్రభుత్వ ఆసు



పత్రులు, కారాగారాలు, హాస్టళ్లకు సప్లైజరిగేది.అలా ఇప్పటి వరకు కొనసాగింది. కానీ నేటి తెలంగాణ ప్రభుత్వం దీనికి వ్యతిరేకంగా జీవో నెంబర్ 15 తీసుకొచ్చి టెస్కో ద్వారా కాకుండా బహిరంగ టెండర్ ద్వారా తీసుకోవాలని నిర్ణయించడం వలన నాలుగు నెలలుగా మగ్గాల ద్వారా ఉత్పత్తి అయిన వస్త్రాల కొనకపోవడం వలన మగ్గాలు మూతపడ్డాయి. చేనేత కార్మికులు రోడ్డున పడి అడుక్కుతినే పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమీషన్ల పైనే ఆసక్తి ఉంది తప్ప, చేనేత రంగ సమస్యలు మాత్రం పట్టించుకోకుండా మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందాన కొత్తగా తెచ్చిన టెండర్ విధానం చేనేత రంగానికి, చేనేత కార్మికులకు తీవ్ర నష్టం జరగడమే కాకుండా సహకార సంఘాలను నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం కుట్రచేస్తుంది. చేనేత నూతన టెండర్ విధానం తక్షణమే రద్దుచేసి పాత టెండర్ విధానాన్ని అమలు చేయాలి. చేనేత సహకార సంఘాలకు 13ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా 15 దఫాలుగా చేనేత సహకార సంఘాలకుపర్సన్ ఇంఛార్జిలతో కొనసాగించి సంఘాలను తీవ్ర నష్టానికి గురి చేసిఎట్టకేలకు ఎన్నికలు నిర్వహించింది. కానీ వెంటనే టెస్కోకు పూర్తి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి సహకార సంఘాలకు రక్షణగా నిలవాలి. 30నెలల కాంగ్రెస్‌ప్రభుత్వం సభల ద్వారా చేనేత రుణమాఫీ చేస్తామని పదేపదే చెప్పి అమలు చేయలేదు. కానీ చేనేత కార్మికుల పోరాటాలద్వారా ఎట్టకేలకు ఎంతో కాలంగా ఎదురుచూసిన చేనేత కార్మికుల చేనేతల రుణమాఫీ జరిగింది. చేనేత పొదుపు పథకం ఏప్రిల్ 25 నుండి అమలులో ఉన్నప్పటికీ చేనేత కార్మికులు 16 నెలలుగా క్రమంతప్పకుండా రికవరీ డిపాజిట్ బ్యాంక్ ఖాతాలో జమ చేయగా ప్రభుత్వవాటా మాత్రం కేవలం రెండునెలలు మాత్రమే జమ చేసింది. తక్షణమే ప్రభుత్వ వాటాను చేనేత కార్మికుల ఖాతాలో జమ చేయాలి. చేనేత భరోసా పథకం కార్మికులకు సంవత్సరానికి 18వేలు, అనుబంధ కార్మికునికి 6000 వేలు అందజేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు,వెంటనే అమలు చేయాలి.తెలంగాణ చేనేత సహకార సంఘాలకు ఇచ్చిన క్యాష్ క్రెడిట్ రుణాలు మాఫీచేస్తామని ఇప్పటికీ అమలుజరగలేదు. ఎలాంటి షరతులు లేకుండా చేనేత బీమా పథకంలో 60 సంవత్సరాలు పైబడినవారికి నష్టపరిహారం ప్రభుత్వం వద్ద 16 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి.విడుదల చేయాలి.28 నెలలుగా పావలా వడ్డీ పథకం ద్వారా చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు వెంటనే విడుదల చేయాలి. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన మార్కెటింగ్ ప్రోత్సాహకాలు 20శాతం రిబేట్ విడుదల చేయాలి.నకిలీ ప్రింటెడ్ వస్త్రాల అరికట్టి చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. రైతుల ధాన్యం కొనుగోలు చేసినట్లుగా చేనేత వస్త్రాలు, దేవతామూర్తులకు సమర్పించే వస్త్రాలు, భక్తులకు అందించే ఆశీర్వచన వస్త్రాలు చేనేతలో తయారైతే దైవ సేవతోపాటు సంప్రదాయ సంరక్షణ కూడా సాధ్యమవుతూ దేవాలయాలకు ప్రతి సంవత్సరం లక్షలాది వస్త్రాలు అవసరమవుతాయి కాబట్టి, ఈ అవసరాన్ని చేనేత రంగం ద్వారా తీర్చే విధానాన్ని ప్రభుత్వాలు అమలు చేస్తే వేలాదిమంది చేనేత కార్మికులకు స్థిరమైన ఉపాధిలభిస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతూ అంతరించిపోతున్న సంప్రదాయ చేనేత వృత్తులకు పునర్జీవం లభిస్తుంది. భారత ప్రభుత్వం చేనేత దినోత్సవాన్ని ప్రకటించి దశాబ్ద కాలం గడిచినా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ విదేశాలలో తరచుగా మాట్లాడుతూ విశ్వగురు పాత్ర పోషించే అవకాశం కేవలం చేనేత రంగానికే ఉందని చెబుతున్నా చేనేతకు సంబంధించిన అన్ని రకాల వస్త్ర ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం ఎన్నడు లేని విధంగా టెక్స్‌టైల్స్‌తో సమానంగా చేనేతకు జీఎస్టీని విధించింది. అంగట్లో అన్నీ ఉన్నా అల్లునినోట్లో శని అన్నట్టు బడ్జెట్ కాగితాల్లో వేల కోట్లు కనిపిస్తున్నా చేనేతకు అరకొర నిధులు కేటాయిస్తున్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వాలు మాత్రం వందల కోట్లు ఖర్చు చేస్తూ పర్యటనలు ప్రచారాలతో హంగు ఆర్భాటాలతో వృథా ఖర్చు చేస్తున్నారు. పాలకులకు చేనేత సంక్షేమంపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ప్రచారాల ఆర్భాటాల వెనుక ఉన్న వృథా ఖర్చులను తక్షణమే అరికట్టి వందల కోట్లను నేరుగా చేనేత రంగానికి మళ్ళిస్తేనే చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండుతాయి. ●

# చుక్కలనంటుతున్న ఎరువుల ధరలు

కామిడి సతీష్ రెడ్డి

ఎల్‌నినో ప్రభావంతో సరైన వర్షాలు లేక ఆందోళన చెందుతున్న రైతులకు ఎరువుల ధరలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు ప్రభుత్వం ధరలు పెంచడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సాగు చేసిన పంటలకు యూరియా, సాగు చేయాల్సిన పంటలకు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల అవసరం ఉంది. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు ఎమ్మార్పీ కంటేఎడా, పెడా పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. అన్ని జిల్లాల్లో వర్షాలు అంతంత మాత్రంగానే ఉండడంతో ఇప్పటి వరకు సగం మాత్రమే సాగు చేశారు. వర్షాలు కురిస్తే మిగతా పంటలు సాగు చేయాలని రైతులు ఎదురుచూస్తున్నారు. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు, ఎరువుల తయారీకి అవసరమైన ముడిపదార్థాల దిగుమతి ఖర్చులు పెరగడం, సరఫరా నిలిపిపోయిందని సాకులు చెప్పి మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో పలుచోట్ల డీఏపీ, యూరియా నిల్వలు లేక రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. డీఏపీ ఒక్కో బస్తాకు రూ.1,350 ఎమార్పీ ఉంటే రూ. 1,700 నుంచి రూ.2,000 వరకు విక్రయిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. యూరియా బస్తా రూ.266కు అమ్మాల్సి ఉండగా రూ.400కు విక్రయిస్తున్నారు.కాంప్లెక్స్ ఎరువులు రకాలను బట్టి రూ.1,200 నుంచి రూ.2,000 ల వరకు ధర ఉంది. కొన్ని రోజుల క్రితమే ప్రభుత్వ ధరలను పెంచింది. ఒక్కోబస్తాను రూ.125ల నుంచిరూ.650 ల వరకు పెంచింది. కాంప్లెక్స్ ఎరువులు పెంచకముందు బస్తాకు రూ.400 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. అయితే ధరలు పెంచిన తర్వాత 20:20:0:13 రూ. 3వేలకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. అన్ని జిల్లాల్లో అధిక ఎకరాల్లో పంటలు సాగుచేస్తారని అంచనా. అందుకు అన్ని రకాల ఎరువులు లక్షల టన్నుల ఎరువుల అవసరమని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ఇప్పటి వరకు మార్కెట్‌లో 40శాతం ఎరువులు నిల్వలు కూడా లేవని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. రైతులకు ఎరువులు కావాలంటే ముందు యాప్‌లో నమోదు చేసుకోవాలి. అలా అయితేనే ఎరువులు దొరుకుతున్న పరిస్థితి. ఇందులోనూ రాజకీయ నేతల ప్రభావం ఉన్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకులు చెప్పిన సమయానికి యాప్‌లో నిల్వలు ఉంచి వారు బుకింగ్ చేసుకున్నతర్వాత మూసేస్తున్నారు. అప్పటికే ఆయా దుకాణాలకు కేటాయించిన ఎరువులు ఖాళీ అయిపోతున్నాయి. రైతులు బుక్ చేసుకుందామనే లోపే నిమిషాల వ్యవధిలో ఖాళీ కావడంతో ఎరువుల కోసం నానాఅవస్థలు పడుతున్నారు. సాగులో ఎరువుల వినియోగం ఏటేటా పెరుగుతోంది. ఎరువు బస్తా లేనిదే పంటలు పండవన్న భావనలో రైతులు ఉంటున్నారు. ఎకరాకు గతేడాది మూడు బస్తాలు వేస్తే, ఈసారి నాలుగు బస్తాలకు పెంచుతున్నారు. వానాకాలం ప్రారంభంలో కురిసిన వానలకు రైతులు పత్తి, కంది, మొక్క జొన్న ఇతర పంటలు సాగు చేశారు. తడిలేక మొలకలు ఎండిపోతున్నాయి. పంటలపై యూరియాను నీటిలో కలిపి పిచికారీ చేయాలని అధికారులే సూచిస్తున్నారు. అయితే మార్కెట్‌లో యూరియా దొరకని పరిస్థితి. కాంప్లెక్స్ ధరలు అధికంగా ఉండడంతో యూరియాపై ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. ఒక్క బస్తా అవసరం ఉన్నచోట రెండు బస్తాలను వినియోగిస్తున్నారు. దీంతో యూరియా కొరత ఏర్పడుతోంది. రవాణా జాప్యం వల్ల కూడా కొంత సమస్యకు దారి తీస్తోందని చెబుతున్నారు. ●

# విద్య ఆశయాలు ఘనం, పంపిణీలో విలంబనం!

రామ కిష్టయ్య సంగన భట్ల

పాఠశాల పునఃప్రారంభమై నెలరోజులు దాటిపోతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందాల్సిన విద్యా కిట్లు పూర్తిస్థాయిలో చేరకపోవడం విద్యా పరిపాలనా యంత్రాంగపు ప్రణాళికారాహిత్యానికి, నిరంతర అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. విద్యా సంవత్సరం తొలి రోజునుంచే సమాన అవకాశాలతో, నాణ్యమైన చదువును అందించడంతో పాటు పేద కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలనే ఉన్నతాశయంతో ప్రభుత్వం ఉచితంగా రెండు జతల యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్లు, నోట్ బుక్లు, పాఠశాల బ్యాగు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, టైలతో కూడిన సమగ్ర విద్యా కిట్లను ప్రతి ఏటా పంపిణీ చేస్తోంది. తొలి రోజు నుంచే విద్యార్థులందరూ ఎలాంటి ఆత్మన్యూనతా భావానికి లోనుకాకుండా సమభావనతో, ఆత్మవిశ్వాసంతో తరగతి గదుల్లోకి అడుగు పెట్టాలన్న ఈ శ్రేయోరాజ్య ప్రాథమిక లక్ష్యానికి క్షేత్రస్థాయిలోని నిర్వహణ లోపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. చిరిగిపోయిన, వర్ణం వెలసిన పాత దుస్తులతోనే బడికి వస్తున్న పిల్లల దృశ్యాలు ఒకవైపు కాగా, కొనుగోలు శక్తి లేక తోటి విద్యార్థుల నుంచి కాగితాలు అడిగి తెచ్చుకుని నోట్లు రాసుకుంటున్న దృశ్యాలు మరొకవైపు గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లో కనిపిస్తుండటం విద్యా వ్యవస్థ తీరుపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ విద్యా సంక్షేమ పథకాల విస్తృతిని పరిశీలిస్తే, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీలు, మోడల్ పాఠశాలలు, గురుకులాల్లో అభ్యసిస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసారీ బడ్జెట్‌లో వందల కోట్ల రూపాయలు కేటాయిస్తోంది. నేటి ఆర్థిక పరిస్థితుల్లో ఒక సగటు నిరుపేద శ్రామిక కుటుంబానికి ఇద్దరు పిల్లలు ఉంటే, వారి విద్యా సామగ్రి, నూతన దుస్తుల కొనుగోలుకే బహిరంగ మార్కెట్లో వేలాది రూపాయలు వెచ్చించాల్సివస్తుంది. అటువంటి ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, పాఠశాలల్లో నమోదు శాతాన్ని గరిష్ఠస్థాయికి పెంచడం, మధ్యలోనే బడి మానేసే ప్రవృత్తికి అడ్డుకట్ట వేయడం, ధనికపేద వ్యత్యాసాలు లేని సమ్మిళిత విద్యా వాతావరణాన్ని ప్రోత్సహించడంలో ఈ కిట్ల పంపిణీ కీలకంగా మారింది. అయితే, ఏడాది కేడాది పునరావృతమవుతున్న సరఫరా జాప్యాలు ఈ పథకవిస్తృత ఆశయాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఈ జాప్యానికి అధికారుల వైపు నుంచి అనేక కారణాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్లను ఖరారు చేయడంలో చోటుచేసుకునే సాంకేతిక, పరిపాలనా ఆలస్యాలు,తయారీ సంస్థలకు ఆర్డర్లు ఇవ్వడంలో జాప్యం, మార్కెట్‌లో వస్త్ర ముడిసరుకు ధరల అస్థిరత ప్రధాన అవరోధాలుగా నిలుస్తున్నాయి. దీనికితోడు వస్త్రాల నేత, కుట్టుపనులు,నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు ఎక్కువ సమయం పట్టడం, రవాణా ఇబ్బందులు, జిల్లా స్థాయి గిడ్డంగుల నుండి మారుమూల పాఠశాలలకు సరఫరా చేయడంలో సమన్వయ లోపం ఉండటం సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి. విద్యా



సంవత్సరం ప్రారంభంలో సంభవించే కొత్త చేరికల ఆధారంగా అదనపు అవసరాలను ముందస్తుగా ఖచ్చితంగా అంచనా వేయలేకపోవడం కూడా ఈ లోపానికి తోడవుతోంది. కొన్ని వస్తువుల నాణ్యత ప్రమాణాల విషయంలో అధికారులు తీసుకుంటున్న అదనపు జాగ్రత్తల వల్ల పంపిణీ మరింత ఆలస్యమైందని వివరణ ఇస్తున్నప్పటికీ, సమయపాలన లేని నాణ్యత విద్యార్థుల సమయ నష్టానికి పరిహారం కాలేదు. సంక్షేమ పథకాలు కేవలం నిధుల కేటాయింపుతోనో, ప్రకటనలతోనో సంపూర్ణం కావు. వాటి అమలులోని సమయపాలన మాత్రమే నిజమైన విజయానికి కొలమానంగా నిలుస్తుంది. పాఠశాల తెరిచిన తొలిరోజే విద్యార్థి చేతికి కావలసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్లు అందితేనే బోధనా అభ్యసన ప్రక్రియ నిరంతరాయంగా సాగుతుంది. తరగతి గదిలో విద్యార్థులందరూ ఒకే విధమైన దుస్తులు ధరించడం ద్వారా వారిలో సమానత్వ భావన, క్రమశిక్షణ పెంపొందుతాయి. సామాజిక శ్రేణులు, ఆర్థిక తారతమ్యాలను తుడిచిపెట్టే ఈ సమభావన సూత్రం, సామగ్రి సమయానికి అందకపోవడం వల్ల ఆటంకానికి గురవుతోంది. నెలరోజులు దాటినా నోట్‌బుక్లు, పుస్తకాలు చేతికి రాకపోవడంతో రోజువారీ పాఠ్యాంశాల అభ్యాసన వెనుకబడి, విద్యా సంవత్సరం ఆరంభంలోనే విద్యార్థులలో నిరాసక్తత చోటుచేసుకుంటోంది. ఈ పరిపాలనా అలసత్వం వల్ల అత్యంత ప్రతికూల ప్రభావానికి గురవుతున్నదిగ్రామీణ, గిరిజన ప్రాంతాల నిరుపేద విద్యార్థులే. కొన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు చొరవతీసుకుని తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, అది సంపూర్ణ పరిష్కారం కానేరదు. రాబోయే విద్యా సంవత్సరానికి కావలసిన పంపిణీ ప్రక్రియలను కనీసం మూడునుండి నాలుగు నెలల ముందే, అంటే విద్యా సంవత్సరం ముగిసే సమయానికే ప్రారంభించాలి. మార్చి మాసానికే టెండర్లను పూర్తి చేసి, మే నెలాఖరు నాటికి పంపిణీకి సిద్ధంగా ఉంచేలా కఠినమైన కాల పట్టికను నిర్దేశించుకోవాలి. కొనుగోలు,తయారీ, నాణ్యతా పరిశీలన, రవాణా ప్రక్రియల పర్యవేక్షణ కోసం డిజిటల్ ట్రాకింగ్ విధానాన్ని (జియోటాగింగ్, క్యూఆర్ కోడ్ ఆధారిత పర్యవేక్షణ) ప్రవేశపెట్టాలి. దీని ద్వారా ఏ వస్తువు ఏదశలో ఉందో సెంట్రల్ డాష్‌బోర్డ్ ద్వారా తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. అంతేకాకుండా, కేంద్రీకృత కొనుగోలు వ్యవస్థలపైనే ఆధారపడకుండా వికేంద్రీకరణ పద్ధతులను ప్రోత్సహించాలి.స్థానిక మహిళా స్వయం సహాయక బృందాలు (మెప్మా,సెర్ప్), చేనేత సహకార సంఘాలు,చిన్న తరహా పరిశ్రమలకు యూనిఫారాల కుట్టుపనులు,అనుబంధ విద్యా సామగ్రి తయారీ బాధ్యతలను అప్పగించడం ద్వారా సమయపాలన సాధ్యమవ్వడ మే కాకుండా, స్థానిక గ్రామీణ ఆర్థికవ్యవస్థకు ఊతం లభిస్తుంది. నాణ్యతలో లోపాలు రాకుండా కఠినమైన నిబంధనలు అమలు చేస్తూనే, సరఫరాదారులకు సమయానికిబిల్లుల చెల్లింపులు జరిగేలా పారదర్శకతను నెలకొల్పాలి. అత్యవసరంగా పెరిగే విద్యార్థులసంఖ్యకు ప్రతి జిల్లాస్థాయిలో అదనపునిల్వలను సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి. విద్యారంగానికి ప్రభుత్వం చేసే ఖర్చు కేవలం సంక్షేమవ్యయం మాత్రమే కాదు,అది దేశ భవిష్యత్తు కోసంచేసే అత్యంత ప్రాధాన్యమైన మూలధన పెట్టుబడి. ●

# నీట్‌లో పెన్, పేపర్‌కు స్వస్తి!




## సుప్రీంకోర్టుకు కేంద్రం అఫిడవిట్ దాఖలు

## పేపర్ లీక్‌ల నిర్మూలనకు చర్యలు

## 19వ తేదీకి విచారణ వాయిదా

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** పేపర్ లీక్‌లు, వ్యవస్థాగత వైఫల్యాలను తొలగించేందుకు జాతీయ అర్హతప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహణలో సమగ్ర మార్పులు చేపట్టినట్లు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్ పిఎస్ నరసింహా నేతృత్వంలోని ధర్మాసనం ముందు దాఖలు చేసిన ఒక అఫిడవిట్‌లో, విద్యా మంత్రిత్వ శాఖ ఈ సంస్కరణల లక్ష్యం సంస్థాగత స్మృతిని పరిరక్షించడం, పరీక్ష భద్రతను బలో పేతం చేయడం, భవిష్యత్తులో పేపర్ లీక్‌లు లేదా ఇతర అవకతవకల ఘటనలను నివారించేందుకు ఒక పటిష్టమైన, సంస్థాగతమైన వ్యవస్థను సృష్టించడమేనని పేర్కొంది. భవిష్యత్తులో నీట్ పరీక్షలను ఎలా నిర్వహిస్తారు, రాబోయే సంవత్స రాలలో పరీక్షా ప్రక్రియలను మెరుగుపరచడానికి నియంత్రణ సంస్థలు సంస్థాగత స్మృతిని ఎలా నిర్మించి, నిలుపుకుంటాయో వివరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ మే 29న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశానికి అనుగుణంగా ఈ అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ అఫిడవిట్‌లో ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షా నియమావళి, ఇంకా ఎన్‌టిఏ ప్రవేశపెట్టిన ఇతర భద్రతా చర్యలకు సంబంధించిన వివరాలు ఉన్నట్లు తెలుస్తోంది. విద్యా మంత్రిత్వ శాఖ జాతీయ పరీక్షల ఏజెన్సీని పర్యవేక్షిస్తుండగా, పరీక్షల ఇండెంటింగ్ ఏజెన్సీ అయిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖతరపున ఎన్టీఏ నీట్ పరీక్షను నిర్వహిస్తుందని ప్రభుత్వం తెలిపింది. నీట్‌యుజి 2026 పేపర్ లీక్‌పై కొనసాగుతున్న సిబిఐ దర్యాప్తు యోగ్యతల గురించి అఫిడవిట్‌లో వ్యాఖ్యానించలేదని కూడా పేర్కొంది. ప్రశ్నాపత్రాల లీకులు, నకిలీ గుర్తింపు, కంప్యూటర్ వ్యవస్థలను తారుమారు చేయడం, ఇతర పరీక్షలకు సంబంధించిన నేరాలను నేరంగా పరిగణించిన 2024 చట్టాన్ని విస్తరిస్తూ, పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ చట్టం, 2026 ద్వారా పరీక్షల మోసానికి వ్యతిరేకంగా పార్లమెంట్ చట్టపరమైన వ్యవస్థను మరింత బలోపేతం చేసిందని కేంద్రం తెలిపింది. అనుభవం, డేటా, సమాచారాన్ని క్రమపద్ధతిలో ఉపయోగించడం ద్వారా గత పరీక్షల నుండి నేర్చుకోగల బలమైన సంస్థాగత చట్రాన్ని సృష్టించడం, తద్వారా బలహీనతలను తగ్గించి, పర్యవేక్షణను మెరుగుపరచడం ఈ సంస్కరణల ఉద్దేశ్యమని ప్రభుత్వం తెలిపింది. జులై 27న ఏర్పాటు చేసిన హెచ్‌పిటిఎఫ్‌కు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, ఆధార్ రూపశిల్పి నందన్ నీలేకని నేతృత్వం వహిస్తున్నారని పేర్కొంది. పరీక్షల నిర్వహణను సురక్షితం చేయడానికి ఎఐ, బ్లాక్‌చెయిన్‌ను ఉపయోగించడంపై దృష్టి సారిస్తూ, సమగ్ర సంస్కరణలపై మూడు నెలల్లోగా సిఫార్సులను సమర్పించాలని ఈ టాస్క్ ఫోర్స్‌ను ఆదేశించినట్లు అది పేర్కొంది. గతంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా నిరోధించడానికి, అధికారులు "కోట్ల నమూనాగా అభివర్ణించే 10దశల భద్రతా ప్రోటోకాల్‌ను ఎన్‌టిఏ అమలు చేసిందని అఫిడవిట్ తెలిపింది. అనువాద దశలో లీకేజీలను నివారించడానికి, ప్రభుత్వం ప్రాథమిక ముసాయిదా కోసం 'ఎయిర్‌గ్యాప్డ్ (ఆఫ్‌లైన్) ఎఐ వ్యవస్థలను ఉపయోగిస్తోందని, ఆ తర్వాత పరిమిత మానవ ధ్రువీకరణ జరుగుతుందని అది పేర్కొంది. ప్రస్తుతం ప్రతి ప్రశ్నపత్రం, ఓఎంఆర్ షీట్‌పై ఒక నిర్దిష్ట అభ్యర్థికి సంబంధించిన ప్రత్యేక క్రమ సంఖ్య ఉంటుందని అదితెలిపింది. ప్రశ్నపత్రాలను ఆరు పొరల ట్యాంపర్ ఎవిడెంట్ ప్యాకేజింగ్‌లో ఉంచారు, ఇందులో కేవలం కత్తిరించి మాత్రమే తెరవగల వన్‌టైమ్‌యూజ్ తాళాలతో కూడిన స్టీల్ ట్రంకులుకూడా ఉన్నాయని అది పేర్కొంది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ చట్టం, 2026 ప్రకారం, ఇప్పుడు 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. 1 కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది.

**కేంద్రం అఫిడవిట్‌పై విచారణను 19కి వాయిదా**

జెఇఇ (మెయిన్స్ మరియు అడ్వాన్స్‌డ్) తరహాలో నీట్ యుజి పరీక్షను పెన్‌అండ్‌పేపర్ విధానం నుండి కంప్యూటర్ ఆధారిత విధానానికి మార్చడంపై చురుగ్గా పరిశీలిస్తున్నట్లు కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌పై, డాక్టర్ల సంఘంతో సహా పిటిషనర్లు తమ సమాధానాలను దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ అంశాన్ని ఆగస్టు 19న విచారిస్తామని, కేంద్రం దాఖలు చేసిన కౌంటర్‌అఫిడవిట్‌పై పిటిషనర్లు తమ సమాధానాలను దాఖలు చేయవచ్చని జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్ఎఐఎంఎ) తరపున హాజరైన న్యాయవాది తన్వి దూబే ధర్మాసనానికి ఒక విషయాన్ని వివరించారు.

ఒకవేళ కంప్యూటర్ ఆధారిత విధానానికి మారే ప్రణాళిక ఏదైనా ఉంటే, దానిని వీలైనంత త్వరగా అమలు చేయాలి. ఎందుకంటే ప్రస్తుతం విద్యార్థుల సన్నద్ధత పెన్‌అండ్‌పేపర్ విధానం ఆధారంగానే సాగుతోంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పిన ధర్మాసనం, సంబంధిత పక్షాలను తమ సమాధానాలు, సూచనలను దాఖలు చేయాలని కోరింది.



# అమెరికా మళ్లీ దాడులు చేస్తే పశ్చిమాసియా అగ్నిగుండమే

## - ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్, ఆగస్టు 6:** తమ దేశంలోని విద్యుత్ గ్రిడ్లు, వంతెనలు, పౌర మౌలిక సదుపాయాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభిస్తే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ స్పష్టం చేసింది. మొత్తం పశ్చిమాసియా ప్రాంతాన్ని అగ్నిగుండంగా మార్చేస్తామని హెచ్చరించింది. ఇక హార్ముజ్‌లో సమన్వయంపై ఒమన్‌తో అంగీకారానికి వచ్చినట్లు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ వెల్లడించారు. మూడో పక్షం (అమెరికాను ఉద్దేశిస్తూ) జోక్యం లేకుంటే త్వరలో సంయుక్త ప్రకటన విడుదల చేస్తామని తెలిపారు. దీంతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి తిరిగి పూర్తిగా తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**అణ్వాయుధాలను అనుమతించం: ట్రంప్**

మరోవైపు పశ్చిమాసియాలోని పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఇరాన్‌తో చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే, ఆ దేశం అణ్వాయుధాలు తయారు చేసేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని పునరుద్ఘాటించారు. తమ సైనిక చర్యలతో టెహ్రాన్ బలహీనపడిందన్నారు. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నాయన్నారు. వెనుజులాతో అనుసరించిన విధానాన్నే ఇరాన్ విషయంలోనూ అమలు చేస్తున్నామని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అమెరికాను ఇప్పుడు టెహ్రాన్ గౌరవిస్తోందని.. తమ చర్యలు ఫలించాయని వ్యాఖ్యానించారు.

# పెళ్లైన 7 రోజులకే విడాకులు

## ఇండోర్ ఫ్యామిలీ కోర్టు మంజూరు

**ఇండోర్, ఆగస్టు 6:** మధ్యప్రదేశ్‌లో నూతన వధూవరులు పెళ్ళైన కేవలం ఏడు రోజులకే చట్టబద్ధంగా తమ వివాహ బంధానికి ముగింపు పలికారు. కోర్టు విచారణల ప్రకారం, పెళ్లికి ముందు తాను వేరొకరితో సంబంధంలో ఉన్నానని, తన కుటుంబ సభ్యులే బలవంతంగా ఈ పెళ్లి చేశారని వధువు అత్తగారింటికి చేరిన వెంటనే వెల్లడించడంతో వారి వివాహ బంధం విచ్ఛిన్నమైంది. వరుడి కుటుంబం ఫ్యామిలీ కోర్టులో పరస్పర విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసింది. కౌన్సెలింగ్ సెషన్‌లు, విచారణలు, న్యాయపరమైన ప్రక్రియల కారణంగా విడాకుల కేసులకు సాధారణంగా కనీసం 18 నెలల సమయం పడుతుందని ఫ్యామిలీ కోర్టు న్యాయవాది వర్షా గుప్తా తెలిపారు.

అయితే, వివాహ బంధాన్ని కొనసాగించే అవకాశం లేదని ఇరు పక్షాలు అంగీకరించడంతో, న్యాయస్థానం ఈ కేసును భిన్నంగా పరిగణించింది. "పెళ్లికి ముందు వధువుకు మరో సంబంధం ఉందని, పెళ్లి జరిగిన వెంటనే ఆ విషయాన్ని తన అత్తమామలకు తెలియజేసిందని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. భర్తకు, అతని కుటుంబానికి విడాకులపై ఎలాంటి అభ్యంతరం లేకపోవడంతో, కోర్టు ఏడు రోజుల్లోనే డిక్రీని జారీ చేసింది" అని గుప్తా అన్నారు. సుప్రీంకోర్టు 'వివాహం కోలుకోలేని విధంగా విచ్ఛిన్నమైతే' అనే సూత్రంపై ఆధారపడి, దంపతుల మధ్య రాజీకి ఆస్కారం లేదని ఫ్యామిలీ కోర్టు నిర్ధారించిందని గుప్తా తెలిపారు. కోర్టు తక్షణమే వివాహాన్ని రద్దు చేయాలని నిర్ణయించడంతో, ఇరుపక్షాలు సంవత్సరాల తరబడి ఎడబాటు, సుదీర్ఘ న్యాయ ప్రక్రియల నుండి తప్పించుకున్నారు.

# దక్షిణ ఫిలిప్పీన్స్‌లోభూకంపం

## రిక్టర్ స్కేలుపై 6.3 తీవ్రత నమోదు

**మనీలా, ఆగస్టు 6:** దక్షిణ ఫిలిప్పీన్స్ తీరంలో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించిందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే తెలిపింది. మధ్యాహ్నం 12:14 గంటలకు సరంగాని అనే చిన్న ద్వీపానికి నైరుతి దిశలో 32 కిలోమీటర్ల దూరంలో సంభవించిన ఈ భూకంపం సునామీ హెచ్చరికను జారీ చేయలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు తక్షణ నివేదికలు ఏవీ లేవు. ప్రభుత్వ రాయితీని అందుకోవడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడిన సమయంలో భూకంపం సంభవించిందని సరంగాని ద్వీప రక్షకుడు హర్లీ సారో ఏఎఫ్‌పీకి తెలిపారు. ఈ భూకంపం 62 కిలోమీటర్ల లోతులో సంభవించినట్లు పేర్కొంది. సమీపంలోని మిండనావో ద్వీపంలో జూన్ 8న సంభవించిన శక్తివంతమైన భూకంపం భవనాలను కూల్చివేసి, కొండచరియలు విరిగిపడటానికి కారణమై, కనీసం 76 మంది మరణానికి కారణమైన తర్వాత ఈ భూకంపం సంభవించింది.



# బయో ఎనర్జీ పథకం గోబర్‌ధన్‌కు రూ.23,731కోట్లు

## కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకం గోబర్ ధన్ పథకం కింద సిబిజి పథకాన్ని 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2035-36 వరకు అమలు చేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈమేరకు కీలక తీసుకున్నారు. మొత్తం రూ.23,731 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశ భవిష్యత్ ఇంధన అవసరాల్లో కంప్రెస్డ్ బయోగ్యాస్ కీలక పాత్ర పోషించేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. కేబినెట్ భేటీ తర్వాత కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వివరాలు వెల్లడించారు. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, చెరకు పరిశ్రమల నుంచి వచ్చే ప్రెస్‌మడ్, మున్సిపల్ సేంద్రియ వ్యర్థాలు, ఇతర జీవ పదార్థాలను శుద్ధ ఇంధనం, సేంద్రియ ఎరువు, గ్రామీణ ఆదాయం, ఆర్థిక విలువగా మార్చడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని కేంద్రమంత్రి తెలిపారు. పరిశుభ్రమైన ఇంధన రంగంలో భారత్‌కు ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పథకం కింద కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తికి హామీతో కొనుగోలు, స్థిరమైన ధరలు, మూలధన సబ్సిడీ, పైప్‌లైన్ అనుసంధానం, రుణ సదుపాయాలు, సాంకేతిక అభివృద్ధి వంటి అంశాలను ఒకే వేదికపైకి తీసుకురానున్నారు. దీంతో దేశంలో సిజిబి ఉత్పత్తి దాదాపు పది రెట్లు పెరగడంతో పాటు ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ పథకం ఇప్పటికే అమలులో ఉన్న సతత్, సేంద్రియ ఎరువుల మార్కెట్ అభివృద్ధి పథకం, బయోమాస్ అగ్రిగేషన్ మెషినరీ, పైప్‌లైన్ మౌలిక వసతుల అభివృద్ధి, జాతీయ బయోఎనర్జీ కార్యక్రమం కింద సీబీజీ ప్లాంట్లకు అందిస్తున్న కేంద్ర ఆర్థిక సహాయం వంటి పథకాలకు కొనసాగింపుగా ఈ పథకం అమలు కానుంది. ఈ పథకాల ద్వారా ఇప్పటికే దేశంలో 200కుపైగా సిజిబి ప్లాంట్లు ప్రారంభమయ్యాయని ప్రభుత్వం తెలిపింది. ఉత్పత్తి, కొనుగోలు వ్యవస్థలు, సేంద్రియ ఎరువుల విలువ శ్రేణి బలోపేతం కావడంతో పాటు వివిధ ప్రాంతాల్లో సిజిబి వినియోగ సాధ్యత కూడా నిరూపితమైందని వివరించింది. పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలయ్యే ఈ గోబర్‌ధన్ పథకం ద్వారా సిజిబి ఉత్పత్తి నుంచి పంపిణీ వరకు మొత్తం వ్యవస్థను ఒకే జాతీయ విధానంలోకి తీసుకురానున్నారు. దేశంలో రవాణా, గృహ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో సహజవాయువు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సిజిబి ఆ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందనిమంత్రి తెలిపారు. సహజ వాయువుతో రసాయనికంగా సమాన లక్షణాలు కలిగిన సిజిబిని ప్రస్తుతం ఉన్న గ్యాస్ నెట్‌వర్క్‌లోనే వినియోగించవచ్చని దీంతో దిగుమతి చేసుకునే శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ప్రతి సిజిబి ప్లాంట్ ద్వారా ముడి పదార్థాల సేకరణ, రవాణా, ప్లాంట్ నిర్వహణ, సేంద్రియ ఎరువుల తయారీ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, హరిత గృహ వాయువుల ఉద్గారాల తగ్గింపు వంటి అంశాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్ర మంత్రి వివరించారు.

# 65 దేశాల్లో ప్రధాని మోడీ పర్యటనలు, 316 ఒప్పందాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** ప్రధాని నరేంద్రమోడీ 2021 నుంచి ఇప్పటివరకు 44 విదేశీ పర్యటనలపరంగా 65 దేశాలను సందర్శించినట్లు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ రాజ్యసభలో గురువారం వెల్లడించింది. ఈ పర్యటనల సందర్భంగా మొత్తం 316 ద్వైపాక్షిక, బహుళపాక్షిక ఒప్పందాలు జరిగాయని తెలిపింది.ప్రధాని విదేశీ పర్యటనలు భారత్‌కు ఇతర దేశాలతో ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ పర్యటనల ద్వారా సాంకేతికత, ఆవిష్కరణలు, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇంధన సహకారం, సరఫరా గొలుసుల బలోపేతం వంటి పలు రంగాల్లో భాగస్వామ్యాలు విస్తరిస్తున్నాయని వెల్లడించింది.విదేశాంగ శాఖ పార్లమెంట్‌కు సమర్పించిన వివరాల ప్రకారం, 2021లో ప్రధాని విదేశీ పర్యటనలపై రూ.36.18 కోట్లు ఖర్చు కాగా, 2022లో అది రూ.55.81 కోట్లకు పెరిగింది. 2023లో ఖర్చు గణనీయంగా పెరిగి రూ.102.12 కోట్లకు చేరగా, 2024లో స్వల్పంగా తగ్గి రూ.100.58 కోట్లుగా నమోదైంది. ఆ ఏడాది రష్యా, ఉక్రెయిన్, అమెరికా, బ్రెజిల్ తదితర 16 దేశాలను ప్రధాని సందర్శించారు. 2022 మే నుంచి డిసెంబర్ 2024 మధ్య కాలంలో ప్రధాని మోడీ చేసిన 38 విదేశీ పర్యటనలకు దాదాపు రూ.258 కోట్లు వ్యయ మైనట్లు ప్రభుత్వం తెలిపింది. వీటిలో జూన్2023లో అమెరికా పర్యటన అత్యధికంగా రూ.22.89 కోట్లు ఖర్చు కాగా, 2024 సెప్టెంబర్‌లో అమెరికా పర్యటనకు రూ.15.34 కోట్లు వ్యయమైంది. 2025లో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్య తలు చేపట్టిన అనంతరం జరిగిన ప్రధాని అమెరికా పర్యటనకు రూ.16.54 కోట్లు ఖర్చైనట్లు వెల్లడించింది. అదే ఏడాదిలో విదేశీ పర్యటనలపై మొత్తం రూ.67 కోట్లకు పైగా వ్యయమైనప్పటికీ, కొన్ని పర్యటనలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు ఇంకా పూర్తి కాలేదని, ఈ గణాంకాలు తాత్కాలికమైనవని తెలిపింది.2026లో ఇప్పటివరకు ప్రధాని మోడీ 13 దేశాలను సందర్శించగా, నార్వే పర్యటన అత్యధిక వ్యయంతో నిలిచింది. ఈ పర్యటనకు రూ.12.46 కోట్లకు పైగా ఖర్చైనట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. 2021 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ వరకు భారత్‌కు మొత్తం 381.8 బిలియన్ అమెరికన్ డాలర్ల ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు వచ్చినట్లు విదేశాంగ శాఖ రాజ్యసభకు తెలిపింది.

# క్యా బోల్తీ పబ్లిక్ పేరిట జనంలోకి సిజెపి: దీప్కే

**శంభాజీనగర్, ఆగస్టు 6:** కాక్‌రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కీలక ప్రకటన చేశారు. క్యా బోల్తీ పబ్లిక్ పేరుతో దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ ప్రచారం ద్వారా ప్రజల్ని నేరుగా కలిసి వారి సమస్యలు, దేశ పరిస్థితులపై వారి అభిప్రాయాలను తెలుసుకుంటామని చెప్పారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం అతిపెద్ద సమస్యగా మారిందని, దానిని దేశవ్యాప్తంగా ప్రధాన చర్చనీయాంశంగా తీసుకెళ్తామని ఆయన అన్నారు. విద్యా సంస్కరణలపై కూడా ప్రత్యేక దృష్టిసారిస్తామని చెప్పారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్యా ఖరీదైందిగా మారిందని, విద్యను లాభార్జన మార్గంగా మార్చారని దానిని తాము మార్చాలని అనుకుంటున్నట్లు చెప్పారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్రప్రధాన్ రాజీనామా గురించి మాట్లాడుతూ ఆయన రాజీనామా చేయడం ఉద్యమానికి లభించిన అతి పెద్ద విజయమని, గత 10-12 యేళ్లుగా మోడీ ప్రభుత్వం ప్రజల్ని తొక్కిపెట్టి ఉంచిందని, తమ ఉద్యమంతో ప్రజల్లో భయం పోయిందని, ప్రజలు మరింతగా వీధుల్లోకివచ్చి తమ హక్కులకోసం పోరాడతారని వ్యాఖ్యానించారు. అంబేద్కర్, గాంధీ, నెహ్రూ కలలుగన్న అభివృద్ధి చెందిన భారత నిర్మాణమే తమ లక్ష్యమని దీప్కే అన్నారు.



# తెహాల్కా మాజీ ఎడిటర్ తేజ్‌పాల్‌కు పదేళ్లు జైలు

## బాంబే హైకోర్టు తీర్పు



**ముంబై, ఆగస్టు 6:** తన జూనియర్ సహోద్యోగితో 2013లో జరిగిన లైంగిక దాడి కేసులో మాజీ తెహెల్కా ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు బాంబే హైకోర్టు గురువారం 10యేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. భారత శిక్షా స్మృతి (ఐపిసి) కింద అత్యాచారం, ఇతర నేరాలకు పాల్పడినట్లు నిర్ధారించి, ఆయనకు నిర్దోషిగా విడుదల చేయడాన్ని రద్దు చేసి, శిక్షను ఖరారు చేసింది. జస్టిస్‌లు నీలా గోఖలే, అమిత్ జమ్సందేకర్‌లతో కూడిన ధర్మాసనం ఈ శిక్షను ప్రకటించి, జైలు అధికారుల ఎదుట లొంగిపోవడానికి తేజ్‌పాల్‌కు రెండు వారాల సమయం ఇచ్చింది.

అంతకుముందు, తేజ్‌పాల్‌ను అన్ని ఆరోపణల నుంచి నిర్దోషిగా విడుదల చేసిన మపుసాలోని సెషన్స్ కోర్టు మే 2021 తీర్పుపై గోవా ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను జస్టిస్ గోఖలే నేతృత్వంలోని ధర్మాసనం అనుమతించింది. అప్పీల్ విచారణ సందర్భంగా, నిందితుడికి వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాలను అంచనా వేయకుండా, సెషన్స్ కోర్టు బాధితురాలి సంఘటనానంతర ప్రవర్తన, నేపథ్యంపై దృష్టి సారించిందని ప్రాసిక్యూషన్ వాదించింది. ఫిర్యాదుదారు ఆ పత్రిక అప్పటి మేనేజింగ్ ఎడిటర్‌తో ఆరోపణలు చేసిన తర్వాత తేజ్‌పాల్ పంపినట్లు ఆరోపించబడిన క్షమాపణ ఇమెయిల్‌తో సహా, కీలకమైన సాక్ష్యాలను విచారణ కోర్టు విస్మరించిందని కూడా అది సమర్పించింది. ఇరుపక్షాల వాదనల అనంతరం తీర్పును ప్రకటిస్తూ, బాంబే హైకోర్టు తేజ్‌పాల్‌ను ఐపిసిలోని సెక్షన్లు 376(2)(ఎఫ్), 376(2)(కె) (అత్యాచారం), 354ఎ (లైంగిక వేధింపులు), 354బి (మహిళను వివస్త్రను చేసే ఉద్దేశ్యంతో ఆమెపై దాడి చేయడం లేదా నేరపూరిత బలప్రయోగం చేయడం) కింద దోషిగా నిర్ధారించింది. ఆ తర్వాత, శిక్షను ఖరారు చేసే విషయాన్ని తర్వాతకు వాయిదా వేసింది.

శిక్షకు సంబంధించిన విచారణ సందర్భంగా, తేజ్‌పాల్ తరపు న్యాయవాది, సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు వీలుగా ఎనిమిది వారాల పాటు దోషిగా నిర్ధారించడాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ తీర్పు నిర్దోషిగా విడుదల చేయడాన్ని రద్దు చేసిందని, అతనిపై మరో క్రిమినల్ కేసు ఏదీ లేదని ఆయన వాదించారు. జస్టిస్ గోఖలే నేతృత్వంలోని ధర్మాసనాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, తేజ్‌పాల్ కూడా తాను బాధితుడినని నమ్ముతున్నానని, శిక్షను నిర్ణయించేటప్పుడు హైకోర్టు కరుణతో వ్యవహరించాలని అభ్యర్థిస్తూ, కనికరం చూపాలని కోరారు. అనంతరం ధర్మాసనం తుదితీర్పు వెల్లడించింది.

# సంక్షిప్త వార్తలు

## జెన్ జెడ్ నిరసనలు దేశద్రోహం కాదు: మోహన్ భగవత్



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ జెన్ జెడ్ యువత ఆందోళనలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద యువత ఆధ్వర్యంలోని సదస్సుల్లో ఒకటైన ది రోల్ ఆఫ్ యూత్ ఇన్ యూనైటింగ్ ది వరల్డ్, ది ఇండియన్ వేసదస్సులో పాల్గొన్న ఆయన, జెన్ జెడ్ యువ తను దేశద్రోహులుగా ముద్ర వేయడం సరికాదన్నారు.'జెన్ జెడ్ యువత ఆందోళన చేస్తున్నారంటే వారు దేశవ్యతిరేకులు కారు. వారు మనవాళ్లే మన తదుపరి తరం. వారి సమస్యలను వినాలి, పరిష్కరించాలి' అని భగవత్ పేర్కొన్నారు.

## పాక్ సర్కారుకు సెప్టెంబరు 27 తుదిగడువు

**ఇస్లామాబాద్, ఆగస్టు 6:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పిటిఐ) అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ అరెస్టు అయి మూడేళ్లవుతోంది. ఈ క్రమంలోనే ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. పాక్ వ్యాప్తగా మళ్లీ నిరసనలు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో 100 మందికిపైగా అరెస్టయ్యారు. ఈ నిరసనలు ప్రధానంగా పిటిఐ అధికారంలో ఉన్న ఖైబర్ ఫఖ్తుంఖ్వాలో ప్రారంభమయ్యాయి.ఆయనకు న్యాయం దక్కకపోతే పాక్ ప్రజలు సెప్టెంబరు 27న ఇస్లామాబాద్‌కు మార్చ్‌గా వస్తారని హెచ్చరించారు.

## అతీక్ అహ్మద్ కుమారుడు ప్రమాదంలో మృతి

**ఝాన్సీ, యుపి, ఆగస్టు 6:** దివంగత గ్యాంగ్‌స్టర్, రాజకీయవేత్త అతీక్ అహ్మద్ చిన్న కుమారుడు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతీక్ అహ్మద్ ఐదుగురు కుమారులలో చిన్నవాడైన అబాన్ అహ్మద్, ఝాన్సీకి వెళ్తుండగా అతని కారు హైవేపై డివైడర్‌ను ఢీకొనడంతో మరణించాడు. అబన్ తన స్నేహితులతో కలిసి తెల్లటి క్రెటా కారులో ప్రయాణిస్తుండగా ఆ కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కారులోని సోను అనే మరో వ్యక్తి కూడా మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు.

## అప్రూవర్‌గా మారుతానంటూ దర్శన్ కేసు నిందితుడి పిటిషన్

**బెంగళూరు, ఆగస్టు 6:** కన్నడ సూపర్ స్టార్ దర్శన్, ఇతరులు ప్రమేయం ఉన్న రేణుకాస్వామి (అభిమాని) హత్య కేసులో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో 14వ నిందితుడిగా ఉన్న ప్రదోష్, నేరానికి సంబంధించిన వాస్తవాలను వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొంటూ, 'అప్రూవర్'గా మారడానికి అనుమతి కోరుతూ నగర కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ప్రదోష్ గురువారం తన న్యాయవాది ద్వారా 59వ సిసిహెచ్ కోర్టులో దరఖాస్తు సమర్పించాడు. ఈ కేసులోని అన్ని వాస్తవాలను వెల్లడించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అప్రూవర్‌గా మారి కోర్టు నుండి క్షమాభిక్ష పొందాలని కోరుతున్నట్లు అందులో పేర్కొన్నాడు.

## యుపిలో ఏకైక బిఎస్‌పి ఎమ్మెల్యే కన్నుమూత

**లక్నో, ఆగస్టు 6:** ఉత్తరప్రదేశ్‌లోని బహుజన్ సమాజ్ పార్టీ ఎమ్మెల్యే ఉమాశంకర్ సింగ్ మృతిచెందారు. రస్రా నియోజకవర్గం నుంచి ఆయన ఎమ్మెల్యేగా ఉన్నారు. యూపీ అసెంబ్లీ సామర్థ్యం 403 కాగా, దాంట్లో ఉమాశంకర్ ఒక్కరే బీఎస్పీ పార్టీకి చెందినవారు. బ్రెయిన్ ట్యూమర్‌కు ఆయన చికిత్స తీసుకుంటున్నట్లు తెలిసింది. ఢిల్లీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బుధవారం రాత్రి 8.30 నిమిషాలకు ఆయన ప్రాణాలు విడిచినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఉమాశంకర్ మృతి పట్ల సిఎం యోగి ఆదిత్యనాథ్ సంతాపం వ్యక్తం చేశారు. బీఎస్పీ ప్రెసిడెంట్ మాయావతి కూడా ఎమ్మెల్యే మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు.

## రష్యాపై భారీ సంఖ్యలో డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి

**మాస్కో, ఆగస్టు 6:** ఉక్రెయిన్ భారీ సంఖ్యలో డ్రోన్లతో రష్యాపై దాడి చేసింది. యరోస్లావిల్ సిటీపై జరిగిన దాడిలో ఆయిల్ రిఫైనరీ దెబ్బతిన్నది. ఆ నగరం నుంచి దట్టమైన నల్లటి పొగలు వ్యాపిస్తున్నాయి. తమ నగరంపై అతి పెద్ద అటాక్ జరిగినట్లు గవర్నర్ మైఖస్ట్రల్ ఎవ్రేవ్ తెలిపారు. సుమారు 92 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు ఆయన చెప్పారు. రష్యాలో ఉన్న అతిపెద్ద 5 ఆయిల్ రిఫైనరీల్లో ఇదొకటి. మరో వైపు రష్యా చేసిన దాడిలో బాలక్లియా సిటీలో ముగ్గురు మృతిచెందినట్లు ఉక్రెయిన్ తెలిపింది. 12 మంది గాయపడ్డారు.



గవర్నర్ శివప్రతాప్‌శుక్లాకు జ్ఞాపికను బహూకరిస్తున్న త్రిదండి చినజీయర్‌స్వామి

# సమతామూర్తిని దర్శించిన గవర్నర్ దంపతులు

## త్రిదండి చినజీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకున్న గవర్నర్

**హైదరాబాద్ (శంషాబాద్), ఆగస్టు 6, ప్రభాతవార్త :** శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్ శ్రీరామనగరంలో కొలువుదీరిన సమతామూర్తి (శ్రీ రామానుజాచార్య) కేంద్రాన్ని గురువారం గవర్నర్ శివప్రతాప్ శుక్లా సందర్శించారు. ఆయనతోపాటు ఆయన సతీమణి కూడా ఈ ఆధ్యాత్మిక పర్యటనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు 216 అడుగుల భారీ రామానుజాచార్యుల వారి సువర్ణ విగ్రహాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం త్రిదండి చినజీయర్‌స్వామివారిని కలిసి మర్యాద పూర్వకంగా ఆశీర్వచనాలు తీసుకున్నారు. రామానుజాచార్యులు లోకానికి చాటిన సమతాభావం, ప్రాంగణంలోని 108 దివ్యదేశాల ప్రాముఖ్యత, కేంద్రం ఏర్పాటు వెనుక ఉన్న ఉద్దేశం తదితర విశేషాలను చినజీయర్‌స్వామి గవర్నర్ దంపతులకు వివరించారు. ఈ పర్యటనలో భాగంగా గవర్నర్ మాట్లాడుతూ.. కుల, మత, వర్గభేదాలు లేకుండా మానవులంతా సమానమే అని వెయ్యేళ్ల క్రితమే విశ్వానికి చాటిచెప్పిన భగవద్రామానుజుల బోధనలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఇంతటి బృహత్తరమైన కేంద్రాన్ని నిర్మించి, భావితరాలకు ఆయన స్ఫూర్తిని అందించడం ఎంతో అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధులు, పోలీసు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర తెలంగాణ మోటార్ వాహన అగ్రిగేటర్ పాలసీ

## ప్రయాణికుల భద్రత, డ్రైవర్ల సంక్షేమం ప్రభుత్వ లక్ష్యం

### రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** సమగ్ర తెలంగాణ మోటార్ వాహన అగ్రిగేటర్ పాలసీ రూపకల్పనకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రయాణికుల భద్రత, డ్రైవర్ల సంక్షేమం, పారదర్శక సేవలే ప్రభుత్వ లక్ష్యంగా పాలసీ రూపకల్పన చేయనుంది. రాష్ట్రంలో యాప్ ఆధారిత అగ్రిగేటర్ రవాణా సేవలను మరింత సురక్షితంగా, పారదర్శకంగా, సాంకేతికత ఆధారంగా ప్రయాణికులకు అనుకూలంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర తెలంగాణ మోటార్ వాహన అగ్రిగేటర్ పాలసీ రూపకల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ పాలసీ రూపకల్పన కోసం సంబంధిత శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మంత్రి తెలిపారు. అగ్రిగేటర్ సంస్థలు, డ్రైవర్లు, వాహన యజమానులు, ప్రయాణికుల ప్రతినిధులు, రవాణా ఆపరేటర్లు, సాంకేతిక నిపుణులు, ప్రభుత్వ శాఖలు, భాగస్వాములతో కమిటీ విస్తృతంగా సంప్రదింపులు నిర్వహించి వారి అభిప్రాయాలు, సూచనలను సేకరించిందన్నారు. ప్రధానంగా ప్రయాణికుల భద్రత, డ్రైవర్ల సంక్షేమం, వాహనాల ఫిట్‌నెస్, పర్మిట్, బీమా, భద్రతా ప్రమాణాలు, అగ్రిగేటర్ల రిజిస్ట్రేషన్, అనుమతులు, నియంత్రణ వ్యవస్థ, డిజిటల్ మానిటరింగ్, ఛార్జీలలో పారదర్శకత, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, మహిళా ప్రయాణికులు, మహిళా డ్రైవర్ల భద్రత, వాహనాల పర్యవేక్షణ, ప్రభుత్వ శాఖలతో డేటా సమన్వయం, ఎలక్ట్రిక్, పర్యావరణహిత వాహనాల ప్రోత్సాహం వంటి కీలక అంశాలను పరిశీలించిందని మంత్రి స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రత, డ్రైవర్ల సంక్షేమం, చట్టబద్ధమైన సేవలు, సాంకేతికత వినియోగం, పర్యావరణ పరిరక్షణ మరియు వ్యాపార సౌలభ్యం మధ్య సమతుల్యత సాధించేలా ఈ పాలసీ రూపొందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కమిటీ తన సిఫారసులను తుది రూపంలో సిద్ధం చేస్తోందని, త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. నివేదిక అందిన అనంతరం ప్రభుత్వం సిఫారసులను సమగ్రంగా పరిశీలించి, నిర్దేశిత విధాన ప్రక్రియ ప్రకారం తెలంగాణ మోటార్ వాహన అగ్రిగేటర్ పాలసీని అమలు చేసేందుకు తదుపరి చర్యలు చేపడుతుందని మంత్రి పేర్కొన్నారు.

# 10 శాతం పెరిగిన సాగు విస్తీర్ణం

## ఈసారి పెరిగిన పప్పుధాన్యాల సాగు

## రాష్ట్రంలో 32,93,335 ఎకరాల్లో పంటలు

### వ్యవసాయ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ జానయ్య

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త :** పంటల వైవిధ్యీకరణ నేపథ్యంలోనే రాష్ట్రంలో పంటల సాగులో పెరుగుదల చోటుచేసుకుందని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. ప్రధానంగా ప్రత్యామ్నాయ పంటల విధానాలను అవలంబించేలా ప్రభుత్వం చేపట్టిన అవగాహన ప్రచారాల వల్లే ఈ మార్పు సాధ్యమైందన్నారు. ఉపగ్రహ చిత్రాల విశ్లేషణ ఆధారంగా రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్ పంటల సరళిపై రూపొందించిన తాజా నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంవత్సరం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన డిజిటల్ వ్యవసాయ, సాంకేతిక కేంద్రంలో విత్తనాలు వేయడానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, విశ్లేషించినట్లు తెలిపారు.

ఎల్‌నినో ప్రభావాన్ని సైతం లెక్క చేయకుండా రైతులు ముఖ్యంగా ప్రత్యమ్నాయ పంటల సాగుపై దృష్టి సారించారన్నారు. ఈ నేపథ్యంలో గత ఖరీఫ్ సీజన్ కంటే ఈ సారి రాష్ట్రంలో సాగు విస్తీర్ణం 10 శాతం అధికంగా పెరిగిందన్నారు. గత ఖరీఫ్ సీజన్ మాదిరిగానే, ఈ ఏడాది కూడా ఇప్పటివరకు సాగు విస్తీర్ణంలో అధిక భాగం వరి, పత్తి, మొక్కజొన్నలను సాగు చేయడానికే రైతులు ఆసక్తి చూపించారని వెల్లడించారు. ఇందులో భాగంగానే గత ఏడాదితో పోలిస్తే పప్పుధాన్యాలు, నూనెగింజల పంటల విస్తీర్ణం పెరుగుదల చోటు చేసుకుందని వివరించారు. జూలై 29 నాటికి రాష్ట్రంలోని రైతులు 32,93,335 ఎకరాల్లో పంటలు వేశారని, గత ఏడాది ఇదే తేదీ నాటికి ఈ సంఖ్య 2,465,691 ఎకరాలుగా ఉందని తెలిపారు. సాధారణ విస్తీర్ణం 98,13,628 లక్షల ఎకరాలు కాగా, అందులో సాగైన విస్తీర్ణం 34 శాతంగా ఉందని పేర్కొన్నారు.

జిల్లాల విషయానికి వస్తే విస్తీర్ణంలో 57 శాతం సాగుతో భువనగిరి రైతులు పంట సాగులో అగ్రస్థానంలో నిలవగా, ఆ తర్వాతి స్థానాల్లో మల్కాజిగిరి 54 శాతంతో, జనగాం 51 శాతంతో నిలిచాయని వెల్లడించారు. ప్రస్తుతం అత్యల్ప శాతం సాగు విస్తీర్ణం ఉన్న జిల్లాల్లో సాగు పరిస్థితులను చూస్తే ఖమ్మం 16.5 శాతం మేర, వనపర్తి 17.3 శాతం, వరంగల్ జిల్లాలో 20.1 శాతం చొప్పున ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు చేసినట్లు పేర్కొన్నారు.

# ప్రొ. జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 6:** ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళు లర్పించారు. సిద్ధాంతకర్తగా తెలంగాణ ఉద్యమంలో ప్రొ. జయశంకర్ పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనకోసం జీవితాంతం అహర్నిశలు శ్రమించిన మహనీయుడని ఆయన కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

**అసెంబ్లీలో నివాళులు అర్పించిన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్**

తెలంగాణ సిద్ధాంతకర్త, స్వర్గీయ ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా శాసనసభ భవనం మెంబర్స్ లాంజ్‌లో చిత్రపటానికి పూలమాలలు వేసి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, మంత్రి అజాహరుద్దీన్, శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, కౌన్సిల్ సెక్రటరీ డా. వి.నరసింహాచార్యులు, అసెంబ్లీ సెక్రటరీ రేండ్ల తిరుపతి, అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా జీవించి , తన జీవితాన్ని తెలంగాణ సాధన కోసం త్యాగం చేసిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ అని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనే ఆశగా, శ్వాసగా యావజ్జీవతాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి స్వర్గీయ ఆచార్య జయశంకర్ అని స్పీకర్ ప్రసాద్‌కుమార్ తెలిపారు.

# సచివాలయంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

## ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సిఎస్ సంజయ్‌జాజు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 6: డాక్టర్** బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో గురువారం సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.సచివాలయ ఆవరణలోని నల్ల పోచమ్మ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ప్రధాన కార్యదర్శి పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.

ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించగా, పోతరాజుల విన్యాసాలు, డప్పుల వాయిద్యాలు, వివిధ వేషధారణలతో కళాకారుల ప్రదర్శనలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, అధికారులు ఉత్సవాల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రంలో సుభిక్షం, శాంతి, అభివృద్ధి నెలకొనాలని ఆకాంక్షించారు.

# మక్కలకు ఆల్‌టైమ్ రికార్డు

## టన్నుకు గరిష్ఠంగా రూ.26,500

## టన్నులకు రూ.1,370 లాభం

## మూడు విడతల వేలం టెండర్ల ఖరారు

## మార్క్‌ఫెడ్ చరిత్రలోనే తొలిసారి భారీ ధర

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతుల నుంచి సేకరించిన మక్కల విక్రయాల్లో తెలంగాణ కోపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. సంస్థ చరిత్రలోనే మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే అత్యధిక ధర లభించి రికార్డు స్థాయి లాభాలు నమోదయ్యాయి. ఈవేలం విధానం ద్వారా నిర్వహించిన పారదర్శక టెండర్ల వల్ల వ్యాపారుల సిండికేట్‌కు చెక్ పడటమే కాకుండా మార్క్‌ఫెడ్‌కు భారీగా ఆదాయం సమకూరింది. గతంలో ప్రతి ఏటా టెండర్ల సమయంలోవ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు కొటేషన్లు వేసేవారు. అధికారుల సహకారంతో తక్కువ ధరలకే విక్రయాలు జరగడం వల్ల మార్క్‌ఫెడ్ తీవ్ర నష్టాలను చవిచూసింది. ఇప్పటికే ఈ సంస్థ రూ.1,000 కోట్ల నష్టాల్లో ఉండటంతో పాటు, మరో రూ. 2 వేల కోట్ల అప్పుల భారంతో కూరుకుపోయింది. ఈ నేపథ్యంలో ఈ విధానాన్ని మార్చిన మార్క్‌ఫెడ్ అధికారులు వ్యాపారుల సిండికేట్‌ను అడ్డుకుంటూ ఈ వేలం నిర్వహించారు. దీంతో ఈ వేలంలో టన్నుకు గరిష్ఠంగా రూ.26,500 ధర లభించింది. కొనుగోలు ధర కంటే టన్నుకు సగటున రూ.1,370 లాభం రావడం విశేషం. సిండికేట్లకు ఎలాంటి అవకాశం లేకుండా కేవలం ఈ వేలం ద్వారానే టెండర్లు నిర్వహించాలని మార్క్‌ఫెడ్ అధికారులు నిర్ణయించారు. అంతేకాకుండా క్వింటాలుకు మద్దతు ధర రూ.2,400 చొప్పున, టన్నుకు కనీసం రూ.24 వేల కంటే తక్కువ ధర వస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించకూడదని కఠిన నిబంధన పెట్టారు. దీనికి అనుగుణంగా మార్క్‌ఫెడ్ యాసంగి సీజన్‌లో రైతుల నుంచి సేకరించిన 14.60 లక్షల టన్నుల మొక్కజొన్న విక్రయానికి గాను మూడు విడతలుగా వేలం నిర్వహించారు. ఇందులో 10.98 లక్షల టన్నులకు గాను జులై 31, ఈ నెల 1, 3 తేదీల్లో మూడు విడతలుగా విజయవంతంగా ఈవేలం నిర్వహించారు. ఈ మూడు విడతల వేలంలో మొక్కజొన్నకు ఊహించని విధంగా విశేష స్పందన లభించింది. టన్నుకు గరిష్ఠ ధర రూ.26,500 పలకగా, ఇది వేలం కనీస ధర కంటే రూ.2,500 ఎక్కువ కావడం విశేషం. కనిష్ఠ ధర కూడా మద్దతు ధర కంటే ఎక్కువగా రూ.24,100 గా నమోదైంది. మొత్తంగా ఈ విక్రయాల్లో సగటున టన్నుకు రూ.25,370 ధర లభించింది. దీంతో మార్క్‌ఫెడ్‌కు కొనుగోలు వెచ్చించిన సొమ్ముతో పోలిస్తే టన్నుకు సుమారు రూ.1,370 లాభం సమకూరింది. ఈ విధంగా వేలంలో వచ్చిన టెండర్లను మార్క్‌ఫెడ్ అధికారులు సమగ్రంగా పరిశీలించి తాజాగా ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

# అక్రమాలకు పాల్పడిన యాజమాన్యాలపై ఎసిబి, సిబిఐ విచారణ జరిపించాలి

## కాలేజీలు సమర్పించిన ఎన్‌ఒసిలను ఆన్‌లైన్‌లో పెట్టాలి

### ఇంటర్ బోర్డు సంయుక్త కార్యదర్శికి ఎఐఎస్‌ఎఫ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొన్ని ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు ఫోర్జరీ ద్వారా ఫైర్ నో అబ్జక్షన్ సర్టిఫికెట్(ఎన్‌వోసీ) పత్రాలు సమర్పించిన అంశంపై ఇంటర్ బోర్డు సమగ్ర విచారణ జరిపించాలని అఖిల భారత విద్యార్థి పెడరేషన్(ఏఐఎస్‌ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఫోర్జరీ ఎన్‌వోసీలు పొందడంతో ఇంటర్ విద్యా వ్యవస్థ ప్రమాణాలు దిగజార్చాయని, రాష్ట్రవ్యాప్తంగా 180 కళాశాలలు హైడ్రా కమిషనర్, ఫైర్ సేఫ్టీ కమిషనర్ సంతకాలు ఫోర్జరీ చేసి అనుమతులు పొంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, బాధ్యతగల అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన ఆయా కళాశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని, అన్ని కళాశాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ గురువారం ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ వసుంధరకు వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలు ఇంటర్ బోర్డ్ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, గుర్తింపు లేని కళాశాలలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

# నకిలీ ఫైర్ ఎన్‌ఒసిలు ఇచ్చిన కాలేజీల గుర్తింపు రద్దు చేయాలి

## ఇంటర్ బోర్డు ముందు ఎబివిపి ధర్నా

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** ఇంటర్ బోర్డ్ గుర్తింపు కోసం ఫేక్ ఫైర్ ఎన్‌వోసీలు సమర్పించిన ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఇంటర్ బోర్డు ముట్టడికి ప్రయత్నించింది. ఇంటర్ బోర్డు ముట్టడికి ప్రయత్నించిన ఏబీవీపీ నేతలను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఇంటర్ బోర్డు ముందు ధర్నా సందర్భంగా ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెక్రెటరీ పృథ్వి తేజ మాట్లాడుతూ.. కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలు బోర్డ్ అనుమతి కోసం ఏకంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అంటే ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలు ఇంకా ఎన్ని అక్రమాలకు పాల్పడుతున్నారో ఇంటర్ బోర్డు అధికారులు గుర్తించాలని డిమాండ్ చేశారు. నగరంలో అనేక కళాశాలలో ఎటువంటి ఫైర్‌సేఫ్టీ, ప్లేగ్రౌండ్ లేని, శిథిలావస్థలో ఉన్న భవనాలలో నడుపుతున్నారన్నారు. ఇంటర్ బోర్డు నుంచి అనుమతులు లేకుండానే అడ్మిషన్లు తీసుకొని విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నారన్నారు. వెంటనే ఫోర్జరీకి పాల్పడిన కళాశాలల గుర్తింపు రద్దు చేసి, భారీ జరిమానాలు విధించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలల్లో పటిష్టమైన తనిఖీలు చేపట్టి అక్రమాలను వెలికితీసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోర్డ్ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఏబీవీపీ కార్యకర్తలే అక్రమాలకు పాల్పడిన కళాశాలల భరతం పడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ విభాగ్ కన్వీనర్ హరిప్రసాద్, కోటి జిల్లా కన్వీనర్ రేవంత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్, నగర కార్యదర్శి సురేందర్, రిషింద్ర, మణిదీప్, రాహుల్, సచిన్,సాయికిరణ్, విష్ణు, శివ, జశ్వంత్, రఘు నందన్, రాంప్రసాద్, రాహుల్,శివ ప్రసాద్, పి శివ, కురుమూర్తి పాల్గొన్నారు.

# ప్రభుత్వ స్కూళ్ల ప్రీప్రైమరీలో ఎల్‌కెజికి అనుమతివ్వలేదు

## నేరుగా యుకెజిలోనే అడ్మిషన్లు

### ఎల్‌కెజికి అనుమతి ఇచ్చి, వేళలు మార్చాలంటున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాలు


**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను గత ఏడాది ప్రారంభించారు. గత ఏడాది 1362 స్కూల్స్‌లో ప్రారంభించగా.. ఈ ఏడాది 2769 స్కూల్స్‌లో ప్రీ ప్రైమరీని ప్రారంభించారు. అయితే ప్రీ ప్రైమరీ తరగతుల్లో ఎల్‌కేజీకి అనుమతించ కుండా నేరుగా యుకేజీకి అనుమతించారు. ఎల్‌కేజీలో చేరకుండా నేరుగా యుకేజీలో చేర్పించడానికి అర్బన్ ప్రాంతాల్లోని తల్లిదండ్రులు సుముఖత చూపించలేకపోతున్నారు. ఎల్‌కేజీ ఒక దగ్గర చేర్పించి మరుసటి సంవత్సరం యుకేజీ కోసం ప్రభుత్వ స్కూల్స్‌లో చేర్పించడానికి తల్లిదండ్రులు ఇష్టపడటం లేదు. ఎల్‌కేజీలో ఉన్న పాఠశాలలో తమ పిల్లల పరిస్థితి ఏమిటనేది అక్కడి టీచర్లకు తెలుస్తుంది కాబట్టి అక్కడే కొనసాగించడానికి తల్లిదండ్రులు ఇష్టపడుతున్నారు తప్ప.. వారిని తీసుకొచ్చి యుకేజీలో ప్రభుత్వ స్కూల్స్‌లో చేర్పించడానికి సుముఖత చూపించడం లేదు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో యుకేజీలో చేర్పించడానికి సుముఖంగా ఉన్నప్పటికీ ప్రీ ప్రైమరీ టైమింగ్స్ మధ్యాహ్నం వరకే కావడంతో ఎక్కువ మందిని చేర్పించడానికి తటపటాయిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అందరు విద్యార్థులతోపాటు టైమింగ్స్ ఉంటే ఇబ్బంది లేకుండా తల్లిదండ్రులు పిల్లలను తమ పెద్ద పిల్లలతోపాటు పంపించడానికి ఇష్టపడుతున్నారు. మధ్యాహ్నం వరకే కావడంతో వివిధ పనులకు వెళ్లే వారు తమ పిల్లలను ప్రభుత్వ స్కూల్స్‌లోని ప్రీ ప్రైమరీలో చేర్పించడం కోసం అంత సుముఖత చూపించడం లేదు. రాష్ట్రంలో గత ఏడాది వరకు 1362 ప్రభుత్వ స్కూల్స్‌లో ప్రీ ప్రైమరీ సెక్షన్లకు అనుమతి ఇవ్వగా వాటిల్లో 15,490 మంది విద్యార్థులు చేరారు. ఈ ఏడాది 2026-27 విద్యా సంవత్సరంలో అదనంగా 2769 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ సెక్షన్లకు అనుమతి ఇచ్చారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రీ ప్రైమరీలో 40వేల మంది చేరినట్టు అధికారులు తెలిపారు. ప్రైమరీలో టైమింగ్స్‌పై ఒక కమిటీని నియమించినట్టు పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్ తెలిపారు. ప్రీ ప్రైమరీని మధ్యాహ్నం వరకే కొనసాగిస్తుండటంతో తమకు తల్లిదండ్రులు ఇతర సంఘాల నుంచి విజ్ఞప్తులు అందాయని ఈ నేపథ్యంలోనే ఒక కమిటీని నియమించి నివేదికను ఇవ్వాలని సూచించినట్టు తెలిపారు. అలాగే ప్రస్తుతం ప్రీ ప్రైమరీలో యుకేజీకి అనుమతి ఉందని, ఎల్‌కేజీ కూడా కొనసాగించేలా అనుమతి ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు డైరెక్టర్ తెలిపారు.

# గోపాలపురం పాఠశాల గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరు

## ఉపాధ్యాయినితో మాట్లాడిన సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 6:** గోపాలపురం ప్రాథమిక పాఠశాలలో గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.25 లక్షలు మంజూరు చేసింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోపాలపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గదులు శిథిలమైన తీరుపై మీడియాలో ప్రచురితమైన కథనా నికి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పందించారు. వెంటనే పాఠశాలను సందర్శించి, వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ దివాకరంను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్ ఉపాధ్యాయిని ఇందిరతో మాట్లాడారు. పాఠశాలలో పరిస్థితులను గురించి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో కలెక్టర్ దివాకర గురువారం పాఠశాలను సందర్శించారు. పాఠశాల అభివృద్ధిపై చొరవ చూపిన ఉపాధ్యాయిని నిమ్మతోట ఇందిరను అభినందించారు. పాఠశాలలో గదుల నిర్మాణానికి రూ.25 లక్షలు విడుదల చేస్తున్నట్లు ఆమెకు తెలియజేశారు. ఆ వెంటనే నిధులు మంజూరు చేశారు.

# కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి శాఖలోనూ దోపిడి



గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పార్టీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

## తెలంగాణ వచ్చాక 82,500 కోట్ల కాంట్రాక్టులు ఆంధ్ర గుత్తేదారులకే


## హరీశ్, కెటిఆర్ వద్ద పనిచేసిన వారే సిఎండి, ఎండిలు

### బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 6:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి శాఖలోనూ అడ్డగోలు దోపిడీ జరుగుతోందని, రాష్ట్రంలో దొంగలు పడ్డారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ఎవరికి ఎంత వీలైతే అంత దోచుకోవాలనే ఆలోచనతో మాత్రమే పనిచేస్తున్నారని ఆరోపించారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మహేశ్వర్ రెడ్డితో పాటు బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు అభిషేక్ జిగిని, రవికుమార్ గౌడ్, మీడియా ప్యానెలిస్ట్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి, బిఆర్ఎస్ పార్టీకి మధ్య ఉన్న అనుబంధం ఎంత గట్టిగా ఉందో స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్‌కి అత్యంత ఆప్తుడిగా మెలిగి, ఆయన సిఫార్సుతో కాన్వర్డ్ ఐఏఎస్ సాధించిన నరసింహారెడ్డిని ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్ కార్పొరేషన్ సీఎండీగా నియమించిందని తెలిపారు. అలాగే గతంలో మాజీ మంత్రి హరీష్ రావు దగ్గర తొమ్మిదేళ్ల పాటు పీఏగా పనిచేసి, ఆయన రికమండేషన్‌తో ఐఏఎస్ అయిన అశోక్ రెడ్డిని మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పెట్టారని విమర్శించారు. నేరుగా రిక్రూట్ అయిన సీనియర్ ఐఏఎస్ అధికారులు ఉండగా, వీరిద్దరినీ ఇంపార్టెంట్ పొజిషన్లలో కూర్చోబెట్టి వేల కోట్ల రూపాయలు దోచిపెడుతున్నారని, ఇది కాంగ్రెస్-బిఆర్ఎస్‌ల అండర్‌స్టాండింగ్‌కు నిదర్శనం కాదా అని ప్రశ్నించారు. ప్రజలు పెన్షన్లు, ఇళ్లు, సంక్షేమ పథకాల కోసం ఎదురుచూస్తుంటే, ప్రభుత్వం మూసీ రివర్ ఫ్రంట్‌లో రూ. 10,000 కోట్ల టెండర్లను రెండు ప్యాకేజీలుగా విభజించి తమకు కావాల్సిన కాంట్రాక్టర్లకు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రూ. 92,000 కోట్ల కాంట్రాక్టు ఫ్లోట్ చేస్తే, అందులో రూ. 82,500 కోట్ల టెండర్లను ఆంధ్రా గుత్తేదారులకే అప్పగించారని మండిపడ్డారు. ఆ ఆంధ్రా కాంట్రాక్టర్లు ఏ పనీ చేయకుండా, 30శాతం నుండి 35శాతం కమీషన్లకు తెలంగాణ చిన్న కాంట్రాక్టర్లకు సబ్ కాంట్రాక్ట్ ఇస్తూ ఇంట్లో కూర్చుని వేల కోట్లు సంపాదిస్తున్నారని, దీనికోసమేనా తెలంగాణ బిడ్డలు బలిదానం చేసుకున్నదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా పర్యవేక్షించే విద్యాశాఖలో యంగ్ ఇండియా స్కూల్స్ పేరుతో పెద్ద ఎత్తున ఓవర్ ఎస్టిమేషన్లతో దోపిడీ జరుగుతోందని మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. 20 స్కూళ్లను ఒకే ప్యాకేజీగా చేసి, రూ.500 కోట్ల కాంట్రాక్టులను ఆంధ్రా గుత్తేదారులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. చిన్న కాంట్రాక్టర్లు 30శాతం తక్కువకే పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నా, కావాలని బడా కాంట్రాక్టర్లకే టెండర్లు వచ్చేలా మానిప్యులేట్ చేస్తున్నారని, దీనిపై విచారణ జరిపే ధైర్యం రేవంత్ రెడ్డికి ఉందా అని సవాల్ విసిరారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్రంలో విద్యుత్, ప్రజా సమస్యలను గాలికి వదిలేసి ప్రభుత్వ ధనంతో అమెరికా టూర్లకు వెళ్తున్నారని విమర్శించారు. ఆయన వెంట సింగరేణి సీఎండీ, ట్రాన్స్‌పోర్ట్ సీఎండీలను తీసుకెళ్లడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. ఇది రాష్ట్ర ప్రయోజనాల కోసం చేసిన టూర్ కాదని, కేవలం తాము సంపాదించిన దొంగ సొమ్మును, బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చుకోవడానికి, హవాలా లెక్కలు చూసుకోవడానికి వేసిన విహారయాత్ర అని మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. సింగరేణిలో 466 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో అక్రమాలు, ఏఎంఆర్ (ఏఎంఆర్) కంపెనీ కాంట్రాక్ట్ పొడిగింపు వెనుక రూ.20,000 కోట్ల కుంభకోణం ఉందన్న సొంత కేబినెట్ మంత్రి వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యలపై ఎందుకు ఎంక్వైరీ వేయడం లేదని ప్రశ్నించారు. అలాగే సివిల్ సప్లైస్ శాఖలో స్టీఫెన్ రవీంద్ర కమిషనర్‌గా ఉన్న సమయంలో 9,000 మెట్రిక్ టన్నుల ధాన్యం (ప్యాడీ) మిస్సింగ్ అవ్వడంపై విచారణ ఎందుకు జరపడం లేదని ప్రశ్నించారు.ఈ అక్రమాలన్నింటిపై కేటీఆర్ ఎందుకు మాట్లాడకుండా మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఈ అంశాలపై బిఆర్ఎస్ పార్టీ కూడా మౌనం వీడాలని, ఆరోపణలు అవాస్తవమైతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలోనే ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.



డిజిపి కార్యాలయంలో జరిగిన ప్రొ. జయశంకర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిజిపి ఆనంద్, శాంతిభద్రతల డిజి మహేష్ భగవత్

# డిజిపి కార్యాలయంలో ఘనంగా ప్రొ. జయశంకర్ జయంతి వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు డిజిపి కార్యాలయంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డిజిపి సి.వి.ఆనంద్‌తోపాటు శాంతిభద్రతల డిజి మహేష్ భగవత్, ఐజి నారాయణ్‌నాయక్ తదితరులు జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డిజిపి ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ కోసం అహర్నిషలు శ్రమించిన ప్రొఫెసర్ జయశంకర్‌ను ప్రజలు నిరంతరం స్మరించుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిజిపి కార్యాలయ అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.




# ఫత్వా ఆధారంగా విడాకులు మంజూరు చేయలేం

### మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టీకరణ

### పిటిషన్లు కొట్టివేసిన ధర్మాసనం

**భోపాల్/జబల్పూర్, ఆగస్టు 6 :** ఒక మతపరమైన విద్యాసంస్థ (సెమినరీ) జారీ చేసిన ఫత్వా ఆధారంగా మాత్రమే విడాకులు మంజూరు చేయలేమని మధ్యప్రదేశ్ హైకోర్టు స్పష్టం చేసింది. అటువంటి ఫత్వా కేవలం ఇస్లామిక్ గ్రంథాల ప్రకారం ఉన్న విధానాన్ని వివరిస్తుంది తప్ప, అదే స్వయంగా వివాహాన్ని రద్దు చేయదని కోర్టు పేర్కొంది. భోపాల్‌లోని 'దారుల్‌ఇఫ్తా మసాజిద్ కమిటీ' జారీ చేసిన ఫత్వా ఆధారంగా విడాకులు ప్రకటించాలని కోరుతూ భర్త ఫ్యామిలీ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను, ఒక మహిళ దాఖలు చేసిన సివిల్ రివిజన్ పిటిషన్‌ను అనుమతిస్తూ జస్టిస్ వివేక్ జైన్ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం కొట్టివేసింది. అక్టోబర్ 29, 2024 నాటి ఫత్వా ఆధారంగా తన వివాహం రద్దయిందని ప్రకటించాలని కోరుతూ భర్త ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. ఈ అభ్యర్థనను వ్యతిరేకిస్తూ, విడాకులు మంజూరు చేసే అధికారం ఆ మతపరమైన సంస్థకు లేదని, ఆ ఫత్వా కేవలం ఇస్లామిక్ చట్టం ప్రకారం విడాకులు కోరడానికి గల పరిస్థితులను మాత్రమే ప్రస్తావించిందని భార్య వాదించింది. భార్య వాదనతో ఏకీభవించిన మధ్యప్రదేశ్ హైకోర్టు, ఆ ఫత్వా వివాహాన్ని స్వయంగా రద్దు చేయదని పేర్కొంది. ఫత్వాకు స్వతంత్రంగా చట్టపరమైన గుర్తింపు లేదని, అది కోర్టు తీర్పునకు ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది. వివాహ రద్దు వంటి అంశాల్లో తుది నిర్ణయం తీసుకునే అధికారం కేవలం కోర్టులకే ఉం టుందని వెల్లడించింది. అయితే, విడాకులు కోరే వ్యక్తికి చట్టప్రకారం సంబం ధిత ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించి విడాకులు పొందే హక్కు ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది.

# నీట్ విద్యార్థిని కృష్ణా జిల్లా కానూరులో ఆత్మహత్య

### కుటుంబానికి దూరంగా ఉండలేక

### హాస్టల్ గదిలో ఉరి వేసుకున్న హైదరాబాద్ యువతి

**విజయవాడ, ఆగస్టు 6, ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లాకానూరులోని ఓ కళాశాలలో నీట్ శిక్షణ పొందుతున్న హైదరాబాద్‌లోని బేగంపేటకు చెందిన కంతేటి వైష్ణవి (19) చెందిన ఓ విద్యార్థిని కళాశాల వసతి గృహంలో ఆత్మహత్యకు పాల్పడిందిజ.ఇటీవల రెండు రోజుల పాటు ఇంటికి వెళ్లి తిరిగి హాస్టల్‌కు వచ్చిన వైష్ణవి.. కుటుంబానికి దూరంగా ఉండటం తన వల్ల కావడం లేదని, ఇంత దూరంలో ఉండి చదవడం కష్టంగా ఉందని పలుమార్లు తల్లిదండ్రులకు ఫోన్‌లో తన ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే ఆమె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు ధైర్యం చెబుతూ చదువుపై దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ నెల 4న ఆరోగ్యం బాగోలేదని చెప్పి వైష్ణవి తరగతులకు హాజరుకాకుండా హాస్టల్ గదిలోనే ఉండిపోయింది. రాత్రి సమయంలో గదిలో ఉన్న ఇతర విద్యార్థినులు తిరిగి వచ్చి తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో కళాశాల సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది కిటికీ నుంచి పరిశీలించగా వైష్ణవి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని మృతి వార్త అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన కానూరుకు చేరుకున్నారు. చదువు కోసం పంపించిన కుమార్తె విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వైష్ణవి మృతికి గల కారణాలు ఏమిటనే అంశంపై విచారణ కొనసాగుతోంది.

# సింగరేణి గనుల్లోకి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం

### అమెరికాలో మైనింగ్ యంత్రాల తయారీ కేంద్రాలను

### సందర్శించిన డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు6:** ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, జిమ్కో లిమిటెడ్ సీనియర్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి బృందం అమెరికాలో పర్యటిస్తోంది. ఈ పర్యటనలో భాగంగా గురువారం బృందం సభ్యులు టెక్సాస్, అరిజోనా రాష్ట్రాల్లో ఉన్న ప్రఖ్యాత మైనింగ్ యంత్రాల తయారీ కేంద్రాలను సందర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సింగరేణికి తీసుకురావడం, తద్వారా గనుల్లో భద్రతను మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఈ పర్యటనకు శ్రీకారం చుట్టాయి.ముందుగా అరిజోనా రాష్ట్రం టక్సన్‌లోని కేటర్పిల్లర్ డెమాన్‌స్ట్రేషన్ అండ్ లెర్నింగ్ సెంటర్‌ఖిను ఉప ముఖ్యమంత్రి బృందం సందర్శించింది. అక్కడ స్వయంచాలిత (అటానమస్), రిమోట్ కంట్రోల్ ద్వారా పనిచేసే భారీ మైనింగ్ యంత్రాల పనితీరును ప్రత్యక్షంగా వీక్షి ంచింది. ముఖ్యంగా ప్రమాదకరమైన ప్రాంతాల్లో మ్యాన్యువల్ వర్క్‌ను (మనుషులు నేరుగా పనిచేసే విధానం) తగ్గించేందుకు ఉపయోగపడే ఖిటెలిరిమోట్ ఆపరేషన్ టెక్నాలజీఖిపై ప్రతినిధి బృందం ప్రత్యేక దృష్టి సారించింది.

# సిఆర్‌పిఎఫ్ విభాగంలో పెరుగుతున్న ఆత్మహత్యల ఘటనలు

### గత యేడాది 59 మంది బలవన్మరణం

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** పారామిలటరీ బలగాల్లో అతిపెద్దదిగా వున్న కేంద్ర రిజర్వ్ పోలీసు ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) విభాగంలో ఆ త్మహత్యల ఘటనలు హోం శాఖను కలవర పరుస్తున్నా యి. గడచిన ఐదేళ్లతో పోలిస్తే 2025లో 59 మంది బలవన్మరణానికి పాల్పడినట్లు హో ం శాఖ గణాంకాలు చెబుతున్నాయి. మూడు రోజుల క్రితం అస్సాంలోని నాగావ్ జిల్లా కతిమరి బెటాలియన్ వద్ద ఓ ఏఎస్ఐ ఇన్సాస్ తుపాకి తో విచక్షణారహితంగా కాల్పులు జరపగా ఒక ఎస్ఐ మరో హెడ్ కానిస్టేబుల్ మరణించారు. అనంత రం కాల్పులకు దిగిన ఏఎస్ఐ తనను తా ను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకు ముందు మణి పూర్‌లో ఒక జవాన్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిఆర్‌పిఎఫ్‌లో వెలుగు చూస్తున్న ఆత్మహత్యల పరంపరపై హోం శాఖ ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించి వీటిని నిలువరించేందుకు ఆ విభాగం ఉన్నతాధి కారులతో ఓ కమిటీని నియమించి విచారణకు ఆదేశించారు.

# కెఆర్‌ఎంబి సమావేశం కోసం ఎపి డిమాండ్

**హైదరాబాద్,ఆగస్టు6,ప్రభాతవార్త:** కృష్ణానదీ యాజమాన్య బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో అందుబాటులో ఉన్న నీటిలో వాటాలు ఖరారు చేయాలని విన్నపాలు చేసింది. ఎపి, తెలంగాణకు నీటి వాటాల ఖరారు కోసం భేటీ ఏర్పాటు చేయాలంటూ కెఆర్‌ఎంబి ఛైర్మన్‌కు ఎపి జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేఖ రాశారు.

# శరవేగంగా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లు

### 105 నియోజకవర్గాల్లో ఆధునిక విద్యాప్రాంగణాలు

### వివిధ దశల్లో 86 పాఠశాలలు

### ఇప్పటికే రూ.1,144.85 కోట్ల నిధుల విడుదల

### సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు6:** కులమతాలకతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల (వైఐఐఆర్‌ఎస్) నిర్మాణం శరవేగంగా సాగుతోంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు వేర్వేరుగా వసతిగృహాలు, రెసిడెన్షియల్ స్కూళ్లు ఉండేవి. ఇవి విద్యార్థుల మనుస్సుల్లో చిన్నతనం నుంచే తామంతే వేర్వరనే భావన కల్పించేవి. ఈ హద్దులను చెరిపివేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులందరినీ ఒకే చోట చేర్చి వారికి నాణ్యమైన విద్యను అందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఈ పాఠశాలలకు రూపకల్పన చేశారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో బాలురు, బాలికలకు ఒక్కోటి చొప్పున ఈ స్కూళ్లను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి సంకల్పించారు. మొదటి విడతగా 105 నియోజకవర్గాల్లో ఒక్కో స్కూల్ చొప్పున నిర్మించనున్నారు. ఇందులో ఇప్పటికే 86 స్కూళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉండగా, 19 పాఠశాలలకు పరిపాలన పరమైన అనుమతుల ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది.

ప్రభుత్వం తొలి దశల్లో 86 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు పరిపాలన అనుమతులు మంజూరు చేసింది. వీటిలో 78 పాఠశాలల నిర్మాణ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. వీటి పనులు జోరుగా సాగుతున్నాయి. ఆదిలాబాద్, గజ్వేల్ నియోజకవర్గాల్లో టెండర్ల ప్రక్రియ పూర్తయి, పనుల ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ముధోల్, బోథ్, నిర్మల్ నియోజకవర్గాల్లో టెండర్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. సిర్పూర్, కామారెడ్డి, దుబ్బాక నియోజకవర్గాల్లో పాఠశాలల నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఇటీవలే కేటాయించగా, ప్రస్తుతం వాటికి సంబంధించిన వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్‌లు) సిద్ధమవుతున్నాయి. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని గుర్తించగా, చాంద్రాయణగుట్టలో స్థల ఖరారు ప్రక్రియ కొనసాగుతోంది. ఆధునిక తరగతి గదులు, డిజిటల్ బోధన- అభ్యసన సౌకర్యాలు, అత్యాధునిక ప్రయోగ శాలలు, గ్రంథాలయాలు, విశాలమైన డార్మెటరీలు, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన క్రీడా మైదానాలు, డైనింగ్ బ్లాక్‌లు, బోధన, బోధనేతర సిబ్బందికి నివాస గృహాలతో 25 నుంచి 30 ఎకరాల విస్తీర్ణం లో ఈ విద్యా ప్రాంగణాలు రూపుదిద్దు కుంటు న్నాయి. ఇంజినీరింగ్ డిజైన్లు, ప్రస్తుత షెడ్యూల్ ఆఫ్ రేట్స్‌ను ఆధారంగా చేసుకుని నిర్మాణ వ్యయ అంచనాలను పారదర్శకంగా రూపొం దించారు. ఒక్కో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో సుమారు 2,650 మంది విద్యా ర్థులకు వసతి కల్పించేలా రూపకల్పన చేశారు. మొత్తం నిర్మాణ విస్తీర్ణం సుమారు 5.36 లక్షల చదరపు అడుగులు ఉండేలా ప్రణాళిక రూపొందించారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1,144.85 కోట్ల నిధులు విడుదల చేసింది. నిధులు అందుబాటులో ఉండటంతో అనేక నియోజకవర్గాల్లో నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతు న్నాయి. పలు ప్రాంతాల్లో ఫౌండేషన్ పనులు పూర్తవగా, మరికొన్ని చోట్ల భవన నిర్మాణాలు శరవేగంగా



సాగుతున్నాయి. మొత్తం 105 నియోజకవర్గాల్లో ఇప్పటికే 86 పాఠశాలల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతుండగా, మిగిలిన 19 నియోజకవర్గాలకు సంబంధించిన ప్రక్రియ కూడా వేగంగా ముందుకు సాగుతోంది. కోరుట్ల, జనగామ, హుజూరాబాద్, కరీం నగర్, సిరిసిల్ల, అలంపూర్, సిద్దిపేట, నర్సాపూర్, సంగారెడ్డి, జహీరాబాద్, ఎల్.బి.నగర్, మహేశ్వరం, సూర్యాపేట, ఉప్పల్, బాల్కొండ, నిజామాబాద్, కూకట్ పల్లి, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్ నియోజక వర్గాల్లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి, పరిపాలన అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఈ అనుమతులు లభించిన వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది.

# రూ.9.5 లక్షల కోట్ల సుంకాల రిఫండ్

### సుప్రీం తీర్పుతో ట్రంప్ సర్కార్‌కు షాక్

**వాషింగ్టన్, ఆగస్టు 6:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమలు చేసిన అదనపు టారిఫ్‌లను యూఎస్ సుప్రీంకోర్టు కొట్టేసిన నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం ఆ మొత్తాన్ని రీఫండ్ చేస్తోంది. ఇప్పటికే 100 బిలియన్ డాలర్లు అంటే రూ.9.5 లక్షల కోట్లకు పైగా సొమ్మును తిరిగి ఇచ్చినట్లు ట్రంప్ ప్రభుత్వం తెలిపింది. ఇది అమెరికా చరిత్రలోనే అతిపెద్ద రీఫండ్‌గా తెలుస్తోంది. రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంతరం ట్రంప్, అంతర్జాతీయ ఆర్థిక అత్యవసర అధికారాల చట్టం కింద పలు దేశాలపై భారీ దిగుమతి సుంకాలు విధించారు. చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ సహా అనేక దేశాల నుంచి అమెరికాకు వచ్చే ఉత్పత్తులపై అదనపు టారిఫ్‌లు అమలు చేశారు.

ఈ సుంకాల ద్వారా అమెరికా ప్రభుత్వం మొత్తం 166 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సమీకరించింది. ట్రంప్ తన అధికార పరిధిని దాటి ఈ టారిఫ్‌లు విధించారని అమెరికా సుప్రీంకోర్టు ఈ ఏడాది ఫిబ్రవరిలో కీలక తీర్పు వెలువరించింది. 1977లో అమల్లోకి వచ్చిన ఐఇఇపిఏ చట్టం అధ్యక్షుడికి ఏకపక్షంగా దిగుమతి సుంకాలు విధించే అధికారం ఇవ్వదని స్పష్టం చేసింది.

తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం 63 మెజారిటీతో ఈ తీర్పును వెలువరించింది. ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ మెజారిటీ తీర్పును రచించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అదనపు సుంకాల రూపంలో వసూలు చేసిన మొత్తాన్ని దిగుమతిదారులకు తిరిగి చెల్లించే ప్రక్రియను అమెరికా ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇప్పటి వరకు 100 బిలియన్ డాలర్లకుపైగా డ్యూటీలు, వాటిపై వడ్డీతో కలిపి రీఫండ్ చేసినట్లు కోర్టు ఫైలింగ్‌లో పేర్కొంది.

# సైనిక సేవల్లో చేరిన డెన్మార్క్ యువరాణి ఇసెబెల్లా

**కొపెన్‌హ్యాగన్, ఆగస్టు 6:** డెన్మార్క్ రాజకుటుంబానికి చెందిన ప్రిన్సెస్ ఇసబెల్లా సైనిక సేవలో చేరి చరిత్ర సృష్టించారు. డెన్మార్క్ రాజకుటుంబం నుంచి పూర్తి స్థాయి తప్పనిసరి సైనిక శిక్షణలో చేరిన తొలి మహిళగా 19 ఏళ్ల ఇసబెల్లా గుర్తింపు పొందారు. కింగ్ ఫ్రెడరిక్ , క్వీన్ మేరీ దంపతుల పెద్ద కుమార్తె అయిన ఇసబెల్లా ఈనెల 3న స్లాగెల్సే లోని ఆంట్వోర్స్‌కోవ్ బ్యారక్స్‌లో 11 నెలల మిలటరీ సర్వీస్ ను ప్రారంభించారు. హైస్కూల్ చదువు పూర్తి చేసిన కొన్ని



వారాలకే ఇసబెల్లా సైనిక సేవలో చేరారు. వేసవి సెలవుల అనంతరం ఆమె ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా బ్యారక్స్‌కు చేరుకోవడం విశేషంగా మారింది. ఇసబెల్లా స్వయంగా నల్లటి ఎస్‌యువి కారును నడుపుకుంటూ బ్యారక్స్‌కు వచ్చారు. బ్యాగీ జీన్స్, స్వెడ్ జాకెట్ ధరించి, పెద్ద బ్యాక్‌ప్యాక్‌తో పాటు చిన్న హ్యాండ్‌బ్యాగ్‌ను తీసుకుని కనిపించారు. బ్యారక్స్ ప్రవేశద్వారం వద్ద విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డుకు తన గుర్తింపు కార్డును చూపించారు. అక్కడ కొంతమంది స్థానిక జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు ఇసబెల్లా ఫోటోలు తీసారు. తన అన్న క్రౌన్ ప్రిన్స్ క్రిస్టియన్ క్రిస్టియన్ కూడా ఇదే బ్యారక్స్‌లో సైనిక శిక్షణ పూర్తి చేశారు. ప్రస్తుతం ఆయన సెకండ్ లెఫ్టినెంట్‌గా శిక్షణ పొందుతున్నారు. డెన్మార్క్ రాజకుటుంబ సభ్యులు సైన్యంలో సేవ చేయడం కొత్త విషయం కాదు. రాజకుటుంబానికి చెందిన మహిళ పూర్తి స్థాయి సైనిక నియామక కార్యక్రమంలో భాగం కావడం ఇదే తొలిసారి.

# కాంగ్రెస్ పార్టీపై బిజెపి, బిఆర్‌ఎస్ అసత్య ప్రచారాలు

### పిసిసి మేధావుల విభాగం సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్,ఆగస్టు 6,ప్రభాతవార్త:** కేంద్రప్రభుత్వ వైఫల్యాలు, దేశ,అంతర్జాతీయ పరిణామాలలో అనుసరిస్తున్న ఉదాసీనత నీట్‌తో విద్యార్థులకు జరిగిన అన్యాయం ప్రజల్లోకి తీసుకొని వెళ్ళేందుకు మేధావులు కృషిచేయాలని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో టిపిసిసి మేధావుల విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం మేధావుల విభాగం రాష్ట్ర చైర్మన్ ఆనంతుల శ్యామ్ మోహన్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే ఆల్ ఇండియా కాంగ్రెస్ ఇంటెలెక్చువల్ సెల్ కమిటీ చైర్మన్ ప్రవీణ్ దావల్, వైస్ చైర్మన్ పుష్ప లక్ష్మణ్, పలువురు రాష్ట్ర నాయకులు, మేధావుల విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, మేధావుల విభాగం విస్తరణ, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ వైఖరి, ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే అంశాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా టిపిసిసి చీఫ్ మాట్లాడుతూ దేశంలో యువత ముఖ్యంగా జెన్‌జి అసంతృప్తితో ఉన్నారని మనం దేశంలో అధికారంలోకి వస్తే వారి ఆశ యాలకు అనుగుణంగా ఎలాంటి పాలన చేయాలో వాటిపై మేధావులు అధ్యయనం చేయాలని యుతరం అభిప్రాయాలు దేశాభివృద్ధికి ఎలా జోడించాలో వారితో మమేకమై గుర్తించాలని కోరారు.భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ గొప్ప భావజాల వారసత్వాన్ని వివరించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుంచే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ సూత్రాలు, అభ్యుదయ భావాలను బలోపేతం చేయడంలో విచార్ విభాగ్ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ పార్టీపై నిరంతరం అసత్య ప్రచారం చేస్తూ, రాజకీయ లబ్ది కోసం తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ కులం, మతం, వర్గం, ప్రాంతానికి అతీతంగా ప్రతి పౌరుడి సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. పేదలు, బలహీన వర్గాలు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, కార్మికులు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ నిలుస్తుందని పేర్కొన్నారు.

# బిఆర్‌ఎస్ నాయకురాలు రూపారెడ్డి అరెస్టు

**హైదరాబాద్ (నార్సింగి), ఆగస్టు 6, ప్రభాతవార్త :** పెట్టుబడుల పేరుతో పలువురి వద్ద డబ్బులు తీసుకొని మోసం చేసిన బిఆర్ఎస్ నాయకురాలు రూపారెడ్డిని గురువారం నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... అధిక లాభాలు వస్తాయని పలువురి నుంచి పెట్టుబడుల రూపంలో రూపారెడ్డి డబ్బులు వసూలు చేసిందని తమకు సమాచారం ఉందని తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొంత మంది బాధితులు ఉన్నట్లు దర్యాప్తులో తేలిందని, వారి వివరాలు గుర్తించి, మోసపోయిన మొత్తాలను నిర్ధారించడం, ఆర్థిక లావాదేవీలను విశ్లేసించడం, నిధుల జాడను గుర్తిం చడం, సంబంధిత డాక్యుమెంటరీ, డిజిటల్ ఆధారాలను సేకరించడం కోసం దర్యాప్తు కొనసాగుతుందని తెలిపారు. నిందితురాలు రూపారెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని నార్సింగి పోలీసులు వివరించారు.

# సిఎంతో టిఎస్‌ఎ జిఒసి మేజర్ జనరల్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు6:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా (టిఎస్ఎ) జనరల్ ఆఫీసర్ కమాండింగ్ (జిఒసి)మేజర్ జనరల్ జి. శ్రీనివాస్ గురువారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

# సియుసెట్, సిపిగెట్‌లో బిసి గురుకుల డిగ్రీ విద్యార్థులకు ర్యాంకులు

### సిపిగెట్‌లో ఇద్దరికి ఫస్ట్ ర్యాంక్, ఆరుగురికి పదిలోపు ర్యాంక్‌లు

### బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** సియు సెట్-2026, సీపీగెట్-2026లో బీసీ గురుకుల డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులను సాధించారు. సీపీగెట్‌లో ఇద్దరికి ఫస్ట్ ర్యాంక్‌లు రాగా, ఆరుగురికి పది లోపు ర్యాంక్‌లు వచ్చాయి. సియు సెట్‌లో 28 మందికి సీట్లు వచ్చాయి. ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. తెలంగాణ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీ సీపీజీఈటీ)-2026లో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ డిగ్రీ కళాశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో విశేష ప్రతిభ కనబరిచారని సంస్థ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్షలో బీసీ గురుకుల డిగ్రీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌లు సాధించారని గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో కామర్స్ విభాగంలో తోట రాహుల్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఎస్. శ్రావణి మొదటి ర్యాంక్ సాధించారని తెలిపారు. బోటనీ విభాగంలో ఎం. వినీల్, ఫిజిక్స్ విభాగంలో ఎం. ప్రశాంత్ రాష్ట్ర స్థాయిలో రెండోర్యాంక్, జువాలజీలో జి. అనూష మూడో ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. ఆరుగురు విద్యా ర్థులు టాప్ 10 ర్యాంకులను, 12 మంది విద్యార్థులు 20 లోపు, 18 మంది 50 లోపు రాష్ట్ర ర్యాంకులు సాధించారని వెల్లడించారు. 17 పోస్ట్ గ్రాడ్యుయేట్ విభాగాల్లో మొత్తం 32 మంది విద్యార్థులు 100 లోపు ర్యాంకులు సాధించారని సొసైటీ సెక్రటరీ తెలిపారు. ప్రభుత్వం బీసీ గురుకులాల్లో అందిస్తున్న నాణ్యమైన ఉన్నత విద్య, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, అధ్యాపకుల అంకితభావం, విద్యార్థుల కృషి ఫలితంగానే ఈ అద్భుత విజయాలు సాధ్యమయ్యాయన్నారు. ఇటీవల వెలువడిన సెంట్రల్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలోనూ బీసీ గురుకుల డిగ్రీ విద్యార్థులు 28మంది ఉత్తీర్ణత సాధించి దేశంలోని అత్యుత్తమ సెంట్రల్ వర్సిటీల్లో సీట్లు పొందారని పేర్కొన్నారు.



# పట్టభద్రుల ఓటర్ల నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకోండి

### 'సర్'పై అప్రమత్తంగా ఉండండి

### ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు6:**ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్పెషల్ ఇంటెన్సి వ్ రివిజన్(సర్)ను బూత్ స్థాయిలో పార్టీ పట్టును బలోపేతం చేసే కార్యక్రమంగా భావించి క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గురువారం రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లిలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆయన అధ్యక్షతన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల కీలక సమావేశం జరిగింది. రాబోయే హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్" పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాలు, సర్ ప్రక్రియ పురోగతిని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షించి క్యాడర్‌కు మంత్రి శ్రీధర్‌బాబు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. పాత, కొత్త నాయకులు సమన్వయంతో వ్యవహరించి ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా అందరూ ఐక్యంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ శ్రేణులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు.

# ఉదయ్‌కృష్ణారెడ్డి మొదటిరోజు కస్టడీ విచారణ పూర్తి

### డబ్ల్యుఎస్‌డబ్ల్యు డిసిపి ఆధ్వర్యంలో ఎనిమిది గంటలకుపైగా సాగిన విచారణ

### ట్రైనీ మహిళా అధికారితోపాటు మరో ఇద్దరు మహిళలను లైంగికంగా వేధించినట్లు ఆధారాలు లభ్యం?

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** సహచర మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టయి చంచల్ గూడ జైల్లో వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి మొదటి రోజు కస్టడీ విచారణ గురువారం సాయంత్రం ముగిసింది. మొదటి రోజు విచారణ మహిళా భద్రతా విభాగం (డబ్లుఎస్‌డబ్ల్యు) డిసిపి లావణ్యా జాదవ్ ఆధ్వర్యంలో ఎనిమిది గంటలకు పైగా జరిగింది. మొదటి రోజు వి చారణలో మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారితో పాటు మరో ఇద్దరు మహిళలను ఉదయ్ కృష్ణారెడ్డి లైంగికంగా వేధించినట్లు, వారిని బ్లాక్ మెయిల్ చేసినట్లు డబ్లుఎస్‌డబ్ల్యుకు ఆధారాలు లభించినట్లు తెలిసింది. శుక్రవారం సాయంత్రం వరకు ఇతన్ని విచారించిన తరువాత తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించనున్నారు. దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ట్రైనీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఇతన్ని కస్టడీలోకి తీసుకుని విచారిం చాలని భావించి కోర్టు నుంచి అనుమతి తీసుకున్న పోలీసులు బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో చంచల్‌గూడ జైలు నుంచి తమ అదుపులోకి తీసుకున్నారు. ఉప్పర్‌పల్లి కోర్టు బుధవారం సాయంత్రం ఉదయ్ కృష్ణారెడ్డిని రెండు రోజుల పోలీసు కస్టడీకి అనుమతించడం తెలి సిందే. కోర్టు ఆదేశాలు తీసుకున్న తరువాత అత్తాపూర్ పోలీసులు నేరుగా చంచల్‌గూడ జైలుకు వెళ్లి కోర్టు ఉత్తర్వులను అక్కడి అధికారులకు అ ందజేసి ఉదయ్ కృష్ణారెడ్డిని కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించి అతని ఆరోగ్యం బాగుందని వైద్యులు చెప్పాక అర్థరాత్రి సమయంలో అత్తాపూర్ పోలీసు స్టేషన్‌కు తరలించి లాకప్‌లో వుంచారు. దీని తరువాత గురువారం ఉ దయం పది గంటల సమయంలో డబ్ల్యుఎస్‌డబ్ల్యు డిసిపి లావణ్యా జాదవ్ ఆధ్వర్యంలో మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జ్యోత్స్న విచారణ చేబట్టారు. సాయంత్రం ఆరు గంటల దాటే వరకు ఈ విచారణ జరిగిందని సమాచారం.

ఉదయ్ కృష్ణారెడ్డి వద్ద వున్న లాప్‌టాప్, సెల్‌ఫోన్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపడం తెలిసిందే. దీనికి సంబంధించి అక్కడి నుంచి పోలీసులకు ఎలాంటి నివేదిక అందలేదని తెలిసింది. అయితే ఉదయ్ కృష్ణారెడ్డికి చెందిన మరో సెల్‌ఫోన్ ఇప్పటి వరకు పట్టుబడలేదు. దీనికోసం పోలీసులు విచారణ చేబట్టారు. ఈ ఫోన్‌లో కీలక సమాచారం వు ందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఫోన్ గురించి ఉదయ్ కృష్ణారెడ్డి పెద్దగా సమాచారం ఇవ్వలేదని తెలిసింది. మొదటి రోజు విచారణలో ఉ దయ్ కృష్ణారెడ్డి పోలీసుల విచారణలో పెద్దగా సహకరించలేదని సమాచారం. అయితే తాను ట్రైనీ ఐపిఎస్ అధికారిణితో పాటు మరో ఇద్దరు మహిళలను తాను వేధించినట్లు అతను అంగీకరించాడని తెలిసింది. అశోక్‌నగర్‌లో తన గదిలో లభించిన లేఖలు, ఇతర ఆధారలన్నీ దీనికి సం బంధించినవేనని అతను వెల్లడించినట్లు సమాచారం. ఉదయ్ కృష్ణారెడ్డి కస్టడీ విచారణను పోలీసులు అంతా వీడియో తీసినట్లు సమాచారం. కాగా ఉదయ్ కృష్ణారెడ్డి కస్టడీ విచారణను పోలీసు కమిషనర్ సజ్జన్నర్ స్వయంగా పర్య వేక్షించారు. దీనిపై ఆయన ఎప్పటికప్పుడు సమాచారం సేకరించినట్లు తెలిసింది. శుక్ర వారం సాయంత్రం విచారణ తరువాత అతన్ని తిరిగి జైలుకు తరలించనున్నారు.

## జోసెఫ్ రావణ్ కస్టడీ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ ప్రస్తుతం జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు.ఆయనపై కస్టడీ పిటిషన్‌పై విచారణను గన్నవరం కోర్టు వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. రావణ్‌ను విచారించేందుకు తమ కస్టడీకి ఇవ్వాలంటూ గన్నవరం పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై నేడు ప్రాసిక్యూషన్ వాదనలు పూర్తయ్యాయి.వాదనలు విన్న న్యాయస్థానం. ప్రాసిక్యూషన్ వినిపించిన వాదనలపై ప్రతివాదుల అభ్యంతరాలను వినేందుకు వీలుగా విచారణను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. గత నెల 28న నిందితుడి తరఫున ప్రముఖ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి తన వాదనలను కోర్టుకు వినిపించారు.కీలక నేతలతో పాటు హిందూ మతం, ఆచారాలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో రావణ్‌పై ఏపీలోని పలు ప్రాంతాల్లో వరుస కేసులు నమోదైన సంగతి తెలిసిందే. వీటి ఆధారంగా పోలీసులు అతడిని అరెస్ట్ చేయగా, న్యాయస్థానం జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ క్రమంలో కేసులోని వాస్తవాలను సమగ్ర విచారణ జరిపేందుకు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరుతుండగా, కోర్టు సోమవారం తుది నిర్ణయం తీసుకోనున్నది పైల్లైఫ్: ఘంటా విజయకుమార్

## అనకాపల్లి గనుల శాఖ సర్వేయర్‌కు ఏసీబీ వల..

### రూ.5 లక్షల లంచం తీసుకుంటూ పట్టివేత

**అనకాపల్లి, ప్రభాతవార్త:** అనకాపల్లి గనులు మరియు భూగర్భ శాఖ (మైన్స్ అండ్ జియాలజీ) కార్యాలయంలో మైనింగ్ సర్వేయర్ అంబేద్కర్ మురళిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం రూ.5 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ క్వారీకి సంబంధించిన సర్వే నివేదిక మంజూరు చేసేందుకు రూ.15 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగా అడ్వాన్స్‌గా రూ.5 లక్షలు స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ఉచ్చువేసి అదుపులోకి తీసుకున్నారు. కాగా, అంబేద్కర్ మురళిపై గతంలో కూడా అవినీతి ఆరోపణలు ఉన్నాయి. 2018లో విశాఖపట్నంలో రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ కేసు నమోదు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం నమోదైన కేసుతో ఇది ఆయనపై రెండో ఏసీబీ కేసుగా నిలుస్తోంది. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి, కార్యాలయంలో తనిఖీలు నిర్వహిస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

## అరుణాచల్‌ప్రదేశ్‌లో స్వల్ప భూప్రకంపనలు

**ఇటానగర్, ఆగస్టు 6:** అరుణాచల్‌ప్రదేశ్‌లోని అప్పర్ సియాంగ్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున భూమి కంపించింది. ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.1 గా నమోదైంది. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ (ఎన్‌సీఎస్) ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ భూకంపంవల్ల ఎలాంటి ప్రాణనష్టంగానీ, ఆస్తి నష్టంగానీ జరగలేదు. నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ అధికారులు విడుదల చేసిన వివరాల ప్రకారం.. ఉదయం 5.45 గంటలకు అప్పర్ సియాంగ్ జిల్లాలోని పాంగిన్‌కు సుమారు 116 కిలోమీటర్ల దూరంలో, భూమికి 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలి



ధర్నాలో నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

**ధర్నాచౌక్, ఆగస్ట్ 8, ప్రభాతవార్త:** గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హలో విద్యార్థి ఛలో హైదరాబాద్ పేరుతో మహాధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రజనీకాంత్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంను ఉపాధ్యక్షులు డి.కిరణ్, మాజీ కార్యదర్శి టి.సాగర్‌లు ప్రారంభించారు. అనంతరం సాగర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 14 లక్షల మంది పేద విద్యార్థులు ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 4వేల కోట్లు బకాయిలు ఉండగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 6,400కోట్లకు పెరిగిందని గుర్తు చేశారు. పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేసి, విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ ప్రజాపాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను రోడ్లపైకి తీసుకువచ్చిందని విమర్శించారు. రజనీకాంత్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం విద్యార్థుల ఖాతాల్లో నేరుగా ఫీజురీయంబర్స్‌మెంట్ నిధులు జమ చేసే విధానాన్ని దెబ్బతీసేలా ప్రభుత్వం జీవో నెంబర్ 9ను తీసుకొచ్చిందని ఆరోపించారు. ఆ జీవోను తక్షణమే రద్దు చేసి, పెండింగ్ ఫీజులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షులు డి.కిరణ్, ఎం.మమత, కే.అశోక్‌రెడ్డి, కె.శంకర్, సహాయకార్యదర్శులు రంజిత్‌రెడ్డి, మందా శ్రీకాంత్, భరత్, సుమ తదితరులు పాల్గొని మాట్లాడుతూ ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా మంత్రులు, ప్రజా ప్రతినిధులను ఘోరావ్ చేస్తామని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పికొడదాం

### జనసేన విద్యార్థి విభాగం, తెలంగాణ రాష్ట్ర కమిటీ నేతలు



ధర్నాలో నినాదాలు చేస్తున్న జనసేన విద్యార్థి విభాగం నేతలు

**ధర్నాచౌక్, ఆగస్ట్ 8, ప్రభాతవార్త:** ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను నిర్వీర్యం చేసే ప్రభుత్వ కుట్రలను తిప్పికొడదామని తెలంగాణ జనసేన విద్యార్థి విభాగం నేతలు పిలుపునిచ్చారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో జనసేన విద్యార్థి విభాగం, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ఫీజు బకాయిలపై విద్యార్థి పోరు దీక్ష పేరుతో ధర్నా నిర్వహించారు. జనసేన తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి శంకర్‌గౌడ్, తెలంగాణ జనసేన విద్యార్థి విభాగం నాయకులు మిర్యాల రామకృష్ణ, వినోద్ నాయక్‌లు మాట్లాడుతూ తెలంగాణలో ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు పేద విద్యార్థులకు విద్యను దూరం చేయటమే లక్ష్యంగా రాష్ట్రంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తోందని ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, నిరుద్యోగులు, విద్యార్థుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి అన్ని విధాలుగా అన్ని వర్గాల వారిని మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, రైతులకు నీళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించాలని, లేనిపక్షం సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అగ్రివర్సిటీకి రూ.1500 కోట్లు అవసరం

### వైస్‌ఛాన్సలర్ అల్దాస్ జానయ్య..

### వర్సిటీ దేశంలోనే మొదటిర్యాంక్‌లో నిలవాలి: జి. చిన్నారెడ్డి



పిజెటిఎయూలో జరిగిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతిలో పాల్గొన్న చిన్నారెడ్డి ,ఎంపీ ఈటల రాజేందర్ , ఉపకులపతి అల్దాస్ జానయ్య..

**అత్తాపూర్ఆగస్టు6,ప్రభాతవార్త:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి ఉత్సవాలని పిజెటిఎయూ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి,ఎంపి ఈటల రాజేందర్, పిఎల్ విశ్వేశ్వరరావు హాజరై జయశంకర్‌కు ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ..తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యసాధనలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషించనుందని ఆయనన్నారు. ఈ రంగ అభివృద్ధిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పాత్రకీలకమైందని పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 నాటికి మానవ రహిత వ్యవసాయం సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఇతర పరిశోధనలను చేపట్టాలంటే కృత్రిమ మేదస్సు వినియోగానికి అవసరమైన మానవ వనరులు మరియు మౌలిక వసతుల కల్పనకు విశ్వవిద్యాలయం ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. ఈ ప్రణాళికల అమలుకి సుమారు 1500 కోట్ల రూపాయల నిధులు అవసరమని జానయ్య అభిప్రాయపడ్డారు. ఈ నిధుల సమీకరణ కోసం నాబార్డ్ ద్వారా 850 కోట్ల రూపాయల ప్రత్యేక నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశామన్నారు. ఈ ప్రతిపాదనల ప్రతిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డికి ఉపకులపతి అందించి సహకరించవలసిందిగా కోరారు.రాష్ట్రప్రణాళికసంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణసాధన కోసం జయశంకర్ చేసిన కృషి అసమానమన్నారు. ఆయన ఆశయాలు అయిన నీళ్లు, నిధులు, నియామకాల సాధన కోసం మనమందరం కృషి చేయాలన్నారు. పూర్వ విద్యార్థిగా ఈ విశ్వవిద్యాలయ అభివృద్ధికి నిరంతరం సాయం చేస్తానని హామీ ఇచ్చారు.ప్రస్తుతం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 70 శాతం అమ్మాయిలు విద్యనుఅభ్యసించడం ఆహ్వానించదగినదన్నారు. విద్యా ప్రమాణాలు ఇంకా మెరుగుపరుచుకొని, ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం దేశంలోని ప్రథమ స్థానంలో నిలవాలని చిన్నారెడ్డి ఆకాంక్షించారు. మూడు తరాల ఉద్యమాల్లో కీలక పాత్ర నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీలు, వంగడాలని సన్న,చిన్న కారు, మధ్యతరగతి రైతాంగానికి అందుబాటులోకి తీసుకురావడానికి విశ్వవిద్యాలయం పనిచేయాలనిపిఎల్‌విశ్వేశ్వరరావు సూచించారు.ఈ సందర్భంగా బోధన, బోధనేతరసిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులుగత రెండేళ్లుగా ఉపకులపతి చేపట్టినసంస్కరణలని వివరించారు. విశ్వ విద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల అంశాలను పరిష్కరించడానికి సహకరించవలసిందిగా అతిథుల్ని కోరారు. అనంతరం అతిధుల్ని విశ్వ విద్యాలయ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు సత్కరించారు.

# చెల్లింపులు సవరణల బిల్లుకు లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ, ఆగస్టు 6: యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు విధించే బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం తెలిపింది. పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007, సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోద ముద్ర వేసింది. ఎలాంటి చర్చ లేకుండానే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్స్ ఛార్జీలు విధించేందుకు ఈ చట్టం అవకాశం కల్పిస్తుంది. దీని ద్వారా ఇప్పటివరకు యూపీఐ, ఇతర ఎలక్ట్రానిక్ పేమెంట్లపై వ్యాపారులకు బ్యాంకులు అందిస్తున్న మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) రద్దవుతుంది. ఇంతకుముందు ఆర్టీజీఎస్, నెఫ్ట్ లావాదేవీలపైనే ఛార్జీలు ఉండేవి. యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు లేవు. కానీ, ఇకపై యూపీఐ ట్రాన్సాక్షన్స్‌పై కూడా ఛార్జీలు విధిస్తారు. టాక్సేషన్ అండ్ అదర్ లాస్ (అమెండ్‌మెంట్) బిల్, 2026 పేరిట రూపొందిన ఈ బిల్లును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు కోసం పేమెంట్స్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007 బిల్లు, ద ఇన్‌కం ట్యాక్స్ యాక్ట్ 2025 బిల్లు, ద ఫైనాన్స్ యాక్ట్, 2026 బిల్లులకు సవరణలు చేశారు. దీని ద్వారా భవిష్యత్‌లో ఎలక్ట్రానిక్ పేమెంట్లపై ఛార్జీలు వసూలు చేస్తారు. ఏ తరహా పేమెంట్‌పై ఎంత ఛార్జీ అనేది నోటిఫికేషన్ ద్వారా ప్రకటిస్తారు. బ్యాంకులకు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్స్‌కు, పేమెంట్స్ విధానాన్ని నిర్వహించే సంస్థలకు స్థిరమైన ఆదాయం అందాలనే ఉద్దేశంతో ఈ చట్టం తీసుకొచ్చినట్లు కేంద్రం తెలిపింది. ప్రస్తుతం క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డుల ద్వారా చేసే చెల్లింపులకు మాత్రమే వ్యాపార సంస్థలు పరిమిత ఫీజు చెల్లిస్తున్నాయి. యూపీఐ లావాదేవీలపై వ్యాపార సంస్థలు ఎలాంటి ఛార్జీలు లేవు. కానీ, కొత్త చట్టం ద్వారా యూపీఐ లావాదేవీలపై కూడా వ్యాపారులు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ కొత్త చట్టం ఇప్పటికిప్పుడు అమలులోకి రాకపోవచ్చు. దీనికి సంబంధించిన నిబంధనలపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం జరుగుతున్న ప్రచారం ప్రకారం ఈ ఛార్జీలు వినియోగదారులు చెల్లించాల్సిన అవసరం లేదు. వ్యాపారులే చెల్లించాలి. అది కూడా వార్షిక టర్నోవర్ రూ.1.5 కోట్లు దాటిన వ్యాపారాలు మాత్రమే స్వల్ప మొత్తం చెల్లించాల్సి ఉంటుంది. ఇక, ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందాలి. తర్వాత రాష్ట్రపతి అంగీకారం తెలపాలి. ఆ తర్వాత ఈ బిల్లు చట్టంగా అమలులోకి వస్తుంది. దీనికి మరికొంత సమయం పడుతుంది.

# కేంద్ర ఖజానాకు రూ.10.49 లక్షల కోట్ల రాబడి

### మొత్తం వ్యయం రూ.13.57 లక్షల కోట్లు

### కేంద్ర ఆర్థిక శాఖ తొలి క్వార్టర్ నివేదిక వెల్లడి

**హైదరాబాద్, అగస్టు 6, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరుతోంది. ఇందులో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్‌లో రూ.10,49,243 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఈ మేరకు దీనికి సంబంధించి ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలోని ఏప్రియల్ నుండి జూన్ వరకూ కలిగిన తొలి క్వార్టర్‌కు సంబంధించిన ఆర్థిక పరిస్థితులపై తాజా నివేదికను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు రూపొందించారు. ఇందుకు గాను జూన్ నెల వరకు భారత ప్రభుత్వ నెలవారీ ఖాతాలను క్రోడీకరించి నివేదికలను విడుదల చేయడం జరిగిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నివేదికలోని ముఖ్యాంశాలను చూస్తే ఏప్రిల్ నుండి జూన్ నెలాఖరు వరకు కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ.10,49,243 కోట్లు సమకూరినట్లు వెల్లడించింది. 2026-27 కేంద్ర వార్షిక అంచనా బడ్జెట్‌లో పేర్కొన్న మొత్తం రాబడులలో ఇది 28.7 శాతంగా నమోదైంది. ఈ మొత్తం ఆదాయంలో రూ.6,36,576 కోట్లు పన్నుల రాబడి ద్వారా నికరంగా సమకూరింది. అలాగే పన్నేతర ఆదాయం రూ.3,77,664 కోట్లు కాగా, రూ.35,003 కోట్లు రుణేతర మూలధన రాబడులు ఉన్నాయి. రాబడి వ్యయంలో, వడ్డీ చెల్లింపులు రూ. 3,46,414 కోట్లుగా ఉండి, అతిపెద్ద భాగంగా ఉన్నాయి. కాగా, ప్రధాన సబ్సిడీల వాటా రూ. 1,14,812 కోట్లుగా ఉంది. కాగా ఇదే కాలంలో (ఆర్థిక సంవత్సరం తొలి క్వార్టర్‌లో) కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటా వికేంద్రీకరణ కింద రాష్ట్ర ప్రభుత్వాలకు మొత్తంగా రూ.2,63,336 కోట్లు బదిలీ చేసింది. ఇది గత సంవత్సరం ఇదే సమయానికి చెల్లించిన నిధుల కంటే రూ.63,605 కోట్లు తక్కువ. ఇక కేంద్ర ప్రభుత్వం ఈ మొదటి త్రైమాసికంలో చేసిన మొత్తం వ్యయం రూ.13,57,076 కోట్లుగా నమోదైంది. ఈ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక అంచనా బడ్జెట్‌లో ఇది 25.4 శాతంగా ఉంది. మొత్తం వ్యయంలో, రూ.10,16,818 కోట్లను రెవెన్యూ ఖాతా కింద ఖర్చు చేయగా, మరో రూ.3,40,258 కోట్లను మూలధన వ్యయం కింద వినియోగించింది.

## వ్యాపారం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

### పిడిఎస్ యు విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** విద్యను వ్యాపార సరుకుగా మార్చే జనరల్ అగ్రిమెంట్ ఆన్‌ట్రేడ్ ఇన్ సర్వీసెస్ గాడ్స్ ఒప్పందం నుండి భారత్ బయటకు రావాలని పిడిఎస్ యు రాష్ట్ర విద్యా ,వైజ్ఞానిక శిక్షణా తరగతుల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి ఇ.విజయ్ కన్నా డిమాండ్ చేశారు. పిడిఎస్యు రాష్ట్ర స్థాయి విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతుల్లో భాగంగా రెండవ కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రాం భవన్ లో విజయ్ కన్నా హాజరై విద్యారంగ ప్రస్తుత పరిస్థితులు- విద్యార్థుల కర్తవ్యాలు అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రెండున్నర ఏళ్లుగా విద్యార్థులకు , నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. రెండున్నర లక్షల జాబ్ క్యాలెండర్ ఊసే లేదని, విద్యా భరోసా కార్డు హామీ ఇంకా నెరవేర్చలేదని దాదాపు 11 వేల కోట్ల ఫీజుల రియంబర్స్మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు విద్యారంగ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చివేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విధానాన్ని ప్రశ్నించినందుకు విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం పోలీస్ కేసులు పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. భాస్కర్, పిఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఎం. సరళ ,సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఇ.విజయ్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఉగ్రవాద నిలయంగా మారుతున్న బంగ్లాదేశ్..

### మాజీ ప్రధాని హసీనా కుమారుడు నజీబ్ వాజెద్ జాయ్ ధ్వజం



నసీబ్ వాజెద్ జాయ్ హసీనా

**న్యూఢిల్లీ,ఆగస్టు 6:** బంగ్లాదేశ్ పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా కుమారుడు , అవామీ లీగ్ సీనియర్ నాయకుడు అయిన సజీబ్ వాజెద్ జాయ్, అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోకపోతే బంగ్లాదేశ్ ఒక విఫల రాజ్యంగా దిగజారి, ప్రాంతీయ ఉగ్రవాదానికి నిలయంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. న్యూఢిల్లీలోని ఫారిన్ కరస్పాండెంట్స్ క్లబ్‌లో అమెరికాలోని మేరీల్యాండ్ నుండి వర్చువల్‌గా ప్రసంగిస్తూ, విదేశీ గూఢచార సంస్థలు, ముఖ్యంగా పాకిస్తాన్ ఇంటర్‌సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ), ఇప్పుడు దేశంలో నిర్భీతిగా పనిచేస్తున్నాయని జాయ్ పేర్కొన్నారు. అవామీ లీగ్ ప్రభుత్వ హయాంలో గతంలో అరెస్టు చేయబడి, జైలులో పెట్టబడిన వందలాది మంది దోషులుగా తేలిన ఉగ్రవాదులు అప్పటి నుండి జైలు నుండి విడుదలయ్యారని ఆయన ఆరోపించారు. హిజ్బ్ ఉత్‌తహ్రీర్ వంటి నిషేధిత సంస్థలు ఇప్పుడు బహిరంగంగా కవాతు చేస్తున్నాయని, అల్‌ఖైదాతో సంబంధం ఉన్న వ్యక్తులు బహిరంగ సభలలో ప్రసంగించారని ఆయన ఇంకా పేర్కొన్నారు. భారతదేశానికి అత్యంత ఆందోళన కలిగించాల్సిన విషయం ఏమిటంటే, బంగ్లాదేశ్ భారతదేశానికి తూర్పున మరో పాకిస్థాన్‌గా మారింది. ఈ రోజు మీ తూర్పు సరిహద్దులో మరో పాకిస్థాన్ ఉంది అల్‌ఖైదా కార్యకర్తలు బహిరంగ సభల్లో మాట్లాడుతున్నారు. బంగ్లాదేశ్‌లో ఇదే జరుగుతోంది, ఇది భారతదేశానికి గానీ, ప్రపంచానికి గానీ ఏమాత్రం మంచి సంకేతం కాదని ఆయన అన్నారు. ఈ వ్యవస్థను అడ్డుకోక పోతే భవిష్యత్తులో ప్రపంచ ఉగ్రవాదులు బంగ్లాదేశ్ నుంచే వస్తారని ఆయన అన్నారు. మహమ్మద్ యూనస్ మధ్యంతర ప్రభుత్వం ముగిసిన తర్వాత, తారిక్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) నిర్ణయాత్మక మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బంగ్లాదేశ్ పార్లమెంటరీ ఎన్నికల జరిగిన సుమారు ఆరు నెలల తర్వాత జాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. యూనస్ తాత్కాలిక ప్రభుత్వం రాజకీయ కార్యకలాపాల నుండి నిషేధించి, ఎన్నికలలో పోటీ చేయకుండా నిరోధించిన అవామీ లీగ్, రాజకీయ ప్రక్రియ నుండి దూరంగానే ఉంది ఈ ఓటును పూర్తి ప్రాతినిధ్యంగా పరిగణించలేమని వాదించడానికి జాయ్ ఈ విషయాన్ని పదేపదే ప్రస్తావించారు. భద్రతా హెచ్చరికతో పాటు, జాయ్ అనేక ఇతర ఫిర్యాదులను కూడా లేవనెత్తారు. ఐక్యరాజ్యసమితి అంచనాలకు సుమారు 1,400గా ఉంటే ప్రభుత్వ లెక్కలు సుమారు 800గా ఉందని ఆయన వెల్లడించారు. అవామీ లీగ్‌కు సానుభూతిపరులుగా భావించబడుతున్న పాత్రికేయులు, సంపాదకులు, మీడియా యజమానులు రెండేళ్లకు పైగా జైలులోనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ, కొనసాగుతున్న దుర్వినియోగం కారణంగా "పూర్తిగా కుప్పకూలే" ప్రమాదంలో ఉందని జాయ్ హెచ్చరించారు. భవిష్యత్ ఎన్నికలతో సహా దేశ రాజకీయ గమనం అధికార పార్టీకి అనుకూలంగానే ఉంటుందని ఆయన అంచనా వేశారు.

# సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణకు మొదటి స్థానం

### ప్రధాని కార్యాలయం నిర్వహించిన జాతీయస్థాయి సమావేశంలో హోం శాఖ నిర్ధారణ

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** సైబర్ నేరాల నియంత్రణతో పాటు బాధితులకు చేయూతనందించడంలో తెలంగాణ పోలీసు విభాగం మరోసారి జాతీయస్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. ప్రధాని కార్యాలయం నిర్వహించిన జాతీయస్థాయి ప్రగతి సమీక్షా సమావేశంలో తొ మ్మిది ప్రామాణికాలను పరిశీలించిన తరువాత కేంద్ర హోం శాఖ ఈ నిర్ధారణకు వచ్చింది. కేంద్రం పరిశీలించిన తొమ్మిది ప్రామాణికాలలో మొదటిది సైబర్ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు కాగా రెండవది జీరో ఎఫ్ఐఆర్‌ల అమలు, మూడవది గ్రీవెన్స్ రెడ్రెసెల్ మాడ్యూల్, నాలుగవది రీఫ ండ్ కోసం మనీ రెస్టోరేషన్ మాడ్యూల్ అమలు చేయడం. ఐదవది చట్టవిరుద్ధ కంటెంట్ల తొలగింపు కోసం సహయోగ్ పోర్టల్ పక్కాగా అమలు చేయడం, ఆరవది సమన్వయ పోర్టల్ వినియోగ గణాంకాలు నిర్వహించడం, ఏడవది సైబర్ క్రైం హాట్ స్పాట్స్‌లను గుర్తించి వాటి నివారణకు చర్యలు తీసుకోవడం, ఎనిమిదవది చట్ట అమలు అధికారుల సామర్థ్యాన్ని పెంచడం, తొమ్మిదవది అన్ని విభాగాలతో సమన్వయం చేసుకోవడం. ఈ తొమ్మిది ప్రామాణికాలలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచింది. సైబర్ నేరాల నియంత్రణలో ఆయా రాష్ట్రాలు అమలు చేస్తున్న విధానాలు, వాటి పనితీరును హోం శాఖ పరిధిలోని సైబర్ నేరాల పమన్వయ విభాగం రూపొందించిన నివేదికను అంచనా వేసేందుకు ప్రధాని కార్యాల య ం ప్రగతి సమీక్ష సమావేశం బుధవారం ఢిల్లీలో జరిగింది. ఈ సమీక్షలో దేశంలోనే మొదటి ఎస్ 4సిను ఏర్పాటు చేశారు. ఎస్4సి విభా గంలో తెలంగాణ పోలీసు విభాగం అగ్రభాగాన నిలిచింది. ఇక తెలంగాణలో ఈ ఏడాది ఆగస్టు రెండవ తేదీ నాటికి 2368 ఫిర్యాదులు అంద గా 2086పై చర్యలు తీసుకున్నా రు. మొత్తం మీద 88 శాతం ఫలితాలు సాధించారు. మనీ రెస్టోరేషన్‌కు సంబంధించి ఆగస్టు రెండవ తేదీ నాటికి 34524 కేసులను పునరుద్ధరించగా వాటిలో 1643 కోట్ల రూపాయల విషయంలో బాధితులకు న్యాయం జరగగా విచారణ స్థాయిలో వున్న కేసుల సంఖ్య 28097గా వుంది. దీని ఫలితాలు 81.38గా వుంది. సైబర్ నేరాల నివారణలో సమిష్టి కృషితోనే తెలంగాణ పోలీసు వి భాగం అగ్రభాగాన నిలిచిందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరక్టర్ శిఖా గోయల్ వెల్లడించారు.

# ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలుశిక్ష

### - రూ. 3లక్షల జరిమానా

**తిరుపతిక్రైమ్, ఆగస్టు6,ప్రభాతవార్త:** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పునిచ్చారు. శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బరాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పి పీ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదై, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఈ ముద్దాయి కరకంబాడీ ఫారెస్ట్ బీటు, కృష్ణాపురం ఫారెస్ట్ సెక్షన్ పరిధిలోని ఎర్రచందనం దుంగలతో అశోక్ కుమార్ అనే వ్యక్తి అరెస్టయ్యాడు. ఈ వ్యక్తి తమిళనాడు, తిరువన్నామలై జిల్లా చెంగం తాలూకాకు చెందిన వాడు. ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 3లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించారు. శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించ బడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ తెలిపారు.



# నరేంద్రమోడీకి కూడా హిట్లర్ గతే

### సిపిఐ నేత ఇ.టి.నర్సింహ్మా విమర్శ




పాదయాత్ర నిర్వహిస్తున్న సిపిఐ కార్యకర్తలు. చిత్రంలో ఇ.టి.నర్సింహ్మా, ఎం.నర్సింహ్మా, బి.వెంకటేశం, స్టాలిన్ తదితరులు

**సైఫాబాద్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** కేం ద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నగరంలో అనేక మంది సిపిఐ కార్యకర్తలు పాదయాత్ర ర్యాలీ నిర్వహించారు. సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు గురువారం దేశవ్యాప్తంగా జరుగుతున్న పాదయాత్రలో భాగంగా సిపిఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర ర్యాలీ బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ప్రారంభమై ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ పాదయాత్ర ర్యాలీని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ్మా ప్రారంభించారు. పాదయాత్రలో కార్యకర్తలు రెడ్ వస్త్రాలను ధరించి, ప్రజా నాట్యమండలి కళాకారుల డప్పుల చప్పుడులతో కథం తొక్కుతూ పదం పాడుతూ, బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలను పంపిణి చేస్తూ కొనసాగించారు. అనంతరం ఇ.టి.నర్సింహ్మా మాట్లాడుతూ గత పుష్కరకాలంగా తమకు వ్యతిరేకం లేదని ప్రజా వ్యతిరేక పాలన కొనసాగించిన కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజల విశ్వసనీయతను కోల్పోయిందని చెప్పారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, దళితులు, ఆదివాసీలు, కార్మికులు ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధాలపై సంవత్సరాలు తరబడి ఆందోళనలు, ఉద్యమాలు, నిరసనలు ఉధృతంగా కొనసాగించారని ఆయన గుర్తు చేశారు. మోదీ రాజ్యాంగబద్ధమైన సంస్థలను దెబ్బతీస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం తమకు అనుకూలంగా మార్చుకోవడం జరిగిందని, ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తున్న ఉద్యమకారులు, విద్యార్థులు, జర్నలిస్టులపై అత్యంత క్రూరమైన కఠినమైన చట్టాలను ప్రయోగించి జైళ్లలో నిర్బంధించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలల్లో నియంత పాలన కొనసాగించిన హిట్లర్ ముసోలినికి పట్టిన గతే భారతదేశంలో నరేంద్రమోదీకి పడుతుందని ఆయన దుయ్యాబట్టారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, నాయకులు కమతం యాదగిరి, పల్లె నర్సింహ్మా, ఎం.నర్సింహ్మా, బి.వెంకటేశం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# పొదుపుతోపాటు దాతృత్వం..



పిల్లలకిచ్చే మొత్తం పాకెట్ మనీని సొంతంగా ఖర్చు పెట్టుకుంటున్నారా. అయితే ఈ కిడ్డీబ్యాంకులు కొనివ్వండి. ఇవైతే పొదుపుతోపాటు నలుగురికీ సాయపడటాన్నీ నేరిస్తాయి. బాల్యం నుంచే పొదుపు చేయడం నేర్పిస్తే భవిష్యత్తులో వారికి ఆర్థిక ప్రణాళిక అలవడుతుంది. చేతిలో ఉన్నదంతా ఖర్చు పెట్టకుండా, కొంతైనా పొదుపు చేయడంవల్ల అత్యవసరానికి ఉపయోగపడుతుందని అర్థమవుతుంది. అలాగే తమవద్ద ఉన్నదాంట్లో కొంతైనా పేద పిల్లలకు, అనాథలకు అందించడం చిన్నప్పటి నుంచి పిల్లలకు అలవాటు చేస్తే వాళ్లలో దయాగుణం పెరుగుతుంది. ఈ లక్షణాలు పిల్లలకు రావాలంటే ప్రత్యేకంగా వస్తున్న ఈ కిడ్డీ బ్యాంకులను అందించండి. వీటిని రకరకాల రంగుల్లో జంతువుల ఆకారాల్లో పిల్లలను ఆకర్షించేలా తయారుచేస్తున్నారు. వీటిలో విడివిడిగా ఉన్న అరలపై పొదుపు, దానం, ఖర్చు అంటూ ప్రింట్ చేసి ఉంటుంది. వీటన్నింటిలోనూ తమ వద్ద ఉన్న నగదును సమానంగా వేయడం నేర్పితే చాలు. చిన్నారులకు క్రమేపీ ఇదొక అలవాటుగా మారుతుంది.

**ఖాళీ సీసాలతో..** ఇంట్లోనే... మార్కెట్‌లో దొరుకుతున్నవే కొనాలనేం లేదు. వీటిని ఇంట్లోనూ తయారుచేసి పిల్లలకు అందించొచ్చు. ఒకే ఆకారం, పరిమాణంలో ఉన్న మూడు ఖాళీ సీసాలు తీసుకొని సేవింగ్స్, టాయ్స్, డొనేషన్ అని రాసి వాటికి అంటించాలి. హోం మేడ్ కిడ్డీ బ్యాంకులు సిద్ధమవుతాయి. ఖాళీ పౌడర్, కూల్‌డ్రింక్ డబ్బాలకు స్టిక్కర్లు అంటించినా చాలు. వీటిని పిల్లలతోనూ సరదాగా సెలవురోజుల్లో తయారు చేయించొచ్చు. మరింకెందుకు ఆలస్యం? మీ బుజ్జాయిలకూ పొదుపు అలవాటు చేయండి. □

# జుట్టుకి ముల్తానీ మాస్క్!

**తక్కువ ఖర్చుతో** తొందరగా తాజా మెరుపుని పొందాలంటే మనందరి మొదటి ఎంపిక ముల్తానీ మట్టే. దీన్ని ఎక్కువగా ముఖానికి మాస్క్ వేసుకునేందుకు వాడతారనే తెలుసు. కానీ ఇది జుట్టుకీ బోలెడన్ని ప్రయోజనాలు ఇస్తుందట.



ముల్తానీ మట్టి జుట్టుకి ఉన్న మురికినీ, చుండ్రునీ వదలిస్తుంది. మాడుపై అదనంగా విడుదలయ్యే నూనెల్ని నియంత్రిస్తుంది. కండిషనర్‌గా పనిచేసి కురులను మృదువుగా, మెరిసేలా చేస్తుంది. ఇందుకు ముల్తానీ మట్టి, బియ్యప్పిండి సమాన భాగాలుగా తీసుకుని కప్పు పెరుగు, ఓ గుడ్డులోని తెల్లసొన కలిపి మెత్తని పేస్టులా చేయాలి. దీన్ని మాడు నుంచి చివర్లకు పట్టించాలి. అరగంటాగి గాఢత లేని షాంపూతో తలస్నానం చేస్తే సరి. నాలుగుచెంచాల మల్తానీ మట్టికి రెండుచెంచాల నిమ్మరసం, చెంచా పెరుగు చేర్చి పేస్ట్‌లా చేయాలి. దీన్ని కుదుళ్ల నుంచి చివర్ల వరకు పట్టించాలి. అరగంటాగి రసాయనాలు లేని షాంపూతో తలస్నానం చేస్తే సరి. కురులు నిగనిగలాడతాయి. ఇందులోని యాంటీబ్యాక్టీరియల్, యాంటీ మైక్రోబయాల్ లక్షణాలు చుండ్రుని తగ్గిస్తాయి. □

# చినుకుల్లో మెరుపులీనుతూ..



సీజన్ ఏదైనా.. ముఖం అందంగా మెరవాలనుకుంటాం. అయితే ఈ వర్షాకాలంలో తడిసినప్పుడు మేకప్ కరుగుతుంది. ముఖమంతా ప్యాచ్‌లుగా కనిపించడంతో ఇబ్బందిగా అనిపిస్తుంది. అలాకాకుండా ఉండాలంటే మేకప్‌లో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలు. చర్మాన్ని ఈ సీజన్‌లో పొడారనివ్వకుండా జాగ్రత్తపడాలి. వాతావరణం చల్లగా ఉందంటూ నీటిని తీసుకోకుండా ఉండకూడదు. శరీరానికి కావాల్సినంత నీటిని అందించాలి. అప్పుడే చర్మం ఆరోగ్యంగా తేమగా ఉంటుంది. ఇక మాయిశ్చరైజర్ విషయానికొస్తే మిగతా కాలాల్లో వాడే దానికి ప్రాధాన్యం ఇవ్వకూడదు. ఇది ముఖాన్ని జిడ్డుగా మారుస్తుంది. ఆ తరవాత ముఖంపై వేసే మేకప్‌నూ ప్రభావితం చేస్తుంది. బదులుగా నాణ్యమైన, నీటి ఆధారిత మాయిశ్చరైజర్‌ను ఎంచుకుంటే సరి. ఇది మేకప్‌కు మంచి బేస్ అవుతుంది. చినుకులు పడినప్పుడు కూడా ముఖంపై ప్యాచెస్‌లా కనిపించనివ్వదు. మస్కారా కూడా వాటర్‌ప్రూఫ్ అయితేనే మేలు. కళ్లకు పెట్టిన వెంటనే త్వరగా ఆరుతుంది. తడికి కరగకుండానూ ఉంటుంది. మేకప్ తీసేయాలనుకున్నప్పుడు గులాబీనీళ్ల లోనో కొబ్బరినూనెలోనో ముంచిన దూదితో తేలికగా శుభ్రం చేయొచ్చు.

**పౌడర్ ఆధారితంగా...** ముఖ చర్మం మృదువుగా మెరిసేలా కనిపించడానికి ముందుగా వేసే ప్రైమర్ విషయంలో మ్యాట్ ఫినిష్ ఇచ్చేదాన్ని ఎంచుకోవాలి. మేకప్ చెరిగిపోకుండా ఇది నిలపగలుగుతుంది. అలాగే మేకప్‌లో క్రీమ్స్ వినియోగంకన్నా పౌడర్ వాడితే మంచిది. ఈ సీజన్‌లో లైట్ వెయిట్ లిక్విడ్ ఫౌండేషన్‌లో ముందుగా కొంచెం వదులుగా ఉండే పౌడర్ కలుపుకోవాలి. మందపాటి ఫౌండేషన్ బ్రష్‌తో తేలికపాటిలేయర్స్‌గా అప్లై చేయాలి. ఈ విధానంలో ముఖం తడిసినా ప్యాచెస్‌లా కనిపించదు.

**తక్కువగా....** లిప్‌స్టిక్ గ్లాసీగా కనిపించేది కాకుండా మ్యాట్ లుక్ ఇచ్చేది తీసుకోవాలి. అనుకోకుండా చినుకుల్లో తడిసినప్పుడు ఇది చెరగకుండా, పెదవులకు న్యూట్రల్ టింట్ ఇస్తుంది. ఎక్కువ సమయ తాజాగా కనిపించేలానూ చేస్తుంది. అంతేకాదు, వర్షాకాలంలో ఎంత తక్కువ మేకప్ వేస్తే అంత మంచిది. చెక్కిళ్లు, గడ్డం, ముక్కు చివర, కనుబొమల మధ్య మాత్రం వాటర్‌ప్రూఫ్ కన్సీలర్‌ను బ్రష్‌తో కాస్తంత హైలైట్ చేయగలిగితే చాలు. చివరగా మేకప్ సెట్టింగ్ స్ప్రే తప్పనిసరి. ఇది మేకప్ కరగకుండా కాపాడుతుంది. చినుకుల్లోనూ మెరిసే మోము సొంతమవుతుంది. □

# లక్ష్మీదేవి అనుగ్రహం

**అన్ని సమస్యల్లోకి** ఆర్థికపరమైన సమస్య పెద్దదిగా కనిపిస్తుంది. మానసికంగాను .. శారీరకంగాను కుంగదీస్తుంది. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు నిస్సహాయుడిని చేసి వేదనకి గురిచేస్తుంది. అందువలన ప్రతి ఒక్కరూ కూడా ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురు కాకుండా చూడమనే దైవాన్ని వేడుకుంటారు. ఆర్థికపరమైన ఇబ్బందులు దరిచేరకుండా ఉండాలంటే లక్ష్మీదేవి అనుగ్రహం వుండాలని ఆధ్యాత్మిక గ్రంధాలు చెబుతున్నాయి. లక్ష్మీదేవి ప్రీతి చెందితే ఆ తల్లి అనుగ్రహం లభిస్తుంది. అలా లక్ష్మీదేవి అనుగ్రహం లభించేలా చేసేదిగా 'ఆశ్వయుజ పౌర్ణమి' కనిపిస్తుంది. ఈ రోజున లక్ష్మీదేవికి ఎంతో ప్రీతికరమైన 'కోజాగరీ వ్రతం' ఆచరించాలనేది మహర్షుల మాట. ఈ రోజున ఈ వ్రతాన్ని ఆచరించి .. మిగిలిన సమయమంతా కూడా భక్తి శ్రద్ధలతో అమ్మవారిని స్మరిస్తూ .. సేవిస్తూ ఉండాలి. ఆ తల్లిని కీర్తిస్తూనే జాగరణ చేయాలి. ఈ రోజున రాత్రివేళలో ఆకాశ మార్గాన ప్రయాణించే అమ్మవారు, జాగరణ చేసేవారిని అనుగ్రహిస్తుందని చెబుతారు. అందువలన లక్ష్మీదేవి అనుగ్రహాన్ని పొందాలనుకునే వారు ఈ వ్రతాన్ని ఆచరించడం మరిచిపోవద్దు. □



# పూల రబ్బరు బ్యాండు !



**పూలంటే ఇష్టపడని** మగువలుంటారా చెప్పండి! కానీ, తీరిక లేకో, కార్పొరేట్ వస్త్రధారణకు నప్పకో పూలు పెట్టుకోవడం తగ్గించేశారు చాలామంది యువత. కానీ, సంప్రదాయంగా చీరకట్టో, లంగా ఓణీ ధరించాక పూలు పెట్టకుండా జుట్టుని వదిలేస్తే ఎబ్బెట్టుగా ఉండదూ! అలాంటి సందర్భాలలో చక్కగా జడ అల్లి ఓ చిన్న పువ్వు అయినా తలలో తురిమి.. మరిసిపోయిన అమ్మ గుర్తొచ్చేస్తుంది. అలాగని మనమే కొనుక్కుందామంటే పొద్దున్నే అంత తీరికెక్కడిది? పైగా ప్రయాణాలు, మీటింగ్‌లూ.. ఇలా మనం తిరిగే హడావుడికి ఇట్టే వాడిపోతాయి. ఇక, మీకా బెంగ అక్కర్లేదు. ఇలాంటి వారికోసమే రబ్బరు బ్యాండ్ల రూపంలో ఆర్టిఫిషియల్ పూల మాలలు వచ్చేశాయి. జడ అల్లుకున్నా, పోనీ వేసుకున్నా, కొప్పు పెట్టుకున్నా.. దీంతో బిగించేయండి రాలిపోతాయనో, వాడిపోతాయనో భయమూ అక్కర్లేదు. చాలా బాగుంది □

# బిసిబేళ పులిబాత్

**కావలసిన పదార్థాలు:** ఓట్స్: రెండు కప్పులు, కందిపప్పు: ఒక కప్పు ఉల్లిగడ్డలు: రెండు , క్యారెట్లు: రెండుఆలుగడ్డలు: రెండు , బీన్స్: గుప్పెడు నూనె: టేబుల్ స్పూన్, జీలకర్ర: అర స్పూను ఆవాలు: స్పూను ,దాల్చిన చెక్క: చిన్న ముక్క సాంబార్ పొడి: ఒక స్పూను చింతపండు: నిమ్మకాయ సైజులోకరివేపాకు: రెండు రెబ్బల ఉప్పు: తగినంత



**తయారీ :** ముందుగా ఉల్లిపాయలు సన్నగా తరిగి పక్కన పెట్టుకోవాలి. తర్వాత ఆలుగడ్డలు, క్యారెట్, బీన్స్‌లను శుభ్రంగా కడిగి అంగుళం ముక్కలుగా కట్ చేసి ఉడికించి పక్కన పెట్టుకోవాలి. ఓట్స్, కందిపప్పులను విడివిడిగా ఉడికించుకోవాలి. చింతపండు కడిగి రసం తీసి పెట్టుకోవాలి. పొయ్యి మీద బాణలి పెట్టి నూనె వేసి జీలకర్ర, ఆవాలు, దాల్చిన చెక్క వేసి వేయించుకోవాలి. అందులో సన్నగా తరిగిన ఉల్లిపాయలను కూడా వేయాలి. కాస్త వేగాక ఇందాక ఉడికించుకున్న ముక్కలను కలపాలి. ఇందులోనే ఉడికించిన పప్పు, ఓట్స్‌లను కూడా వేయాలి. ముందుగా తీసి పెట్టుకున్న చింతపండు రసం, తగినంత ఉప్పు, సాంబార్ పొడి, కరివేపాకులను కూడా జోడించాలి. అన్నింటినీ బాగా కలిపి బాణలి మీద మూత పెట్టి ఈ మొత్తం మిశ్రమాన్ని బాగా ఉడికించుకుంటే బిసిబేళ పులి బాత్ రెడీ! □

# 'అనకాపల్లి' ప్రి రిలీజ్ ఈవెంట్‌లో సోనూసూద్



అనకాపల్లి చిత్రం యువత తో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది.. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో లగడపాటి శ్రీధర్.. భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మించిన రా అండ్ రస్టిక్ చిత్రం అనకాపల్లి. ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్యా వశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించారు. కాండ్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీకి కథ, స్క్రీన్ ప్లేని అందించడమే కాకుండా త్రినాథరావు నక్కిన ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. సోనూ సూద్ మాట్లాడుతూ.. .. అనకాపల్లి సినిమా ఈవెంట్ కోసం ఇక్కడకు రావడం ఆనందంగా ఉంది. విక్రమ్, తారక్, సంధ్య అద్భుతంగా నటించినట్టు కనిపిస్తోంది. ఖగేష్ ఈ చిత్రాన్ని గొప్పగా తీసినట్టు అనిపిస్తోంది. అనకాపల్లి సినిమాని అనకాపల్లి ప్రజలు సపోర్ట్ చేయాలి...లగడపాటి శ్రీధర్ మాట్లాడుతూ.. .. అనకాపల్లి ఈవెంట్‌కు వచ్చిన సోనూ సూద్ గారికి థాంక్స్. ఆయన ఎంతో మందికి దేవుడు. నేను ఈ మూవీని ఆల్రెడీ చూశాను. అద్భుతంగా వచ్చింది. అనకాపల్లిలోనే ప్రేక్షకులతో పాటుగా మళ్లీ సినిమాని చూస్తాను. విక్రమ్ సహిదేవ్ మాట్లాడుతూ.. .. అనకాపల్లి కోసం వచ్చిన సోనూ సూద్ కి థాంక్స్. ఖగేష్ మా అందరి కంటే ఎక్కువగా కష్టపడ్డాడు. అతను పడిన కష్టానికి తగిన ప్రతిఫలం రావాలని కోరుకుంటున్నాను.

## తెర

### 'చెన్నై లవ్ స్టోరీ' రూ. 50 కోట్ల గ్రాసర్‌గా నిలిచింది



స్టోరీ రైటర్, ప్రొడ్యూసర్ సాయి రాజేష్‌కొబ్బరిమట్ట, హృదయకాలేయం, కలర్ ఫోటో, బేబి వంటి చిత్రాలతో స్టోరీ రైటర్‌గా, డైరెక్టర్‌గా, ప్రొడ్యూసర్ గా తనకంటూ ఓ ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్నారు సాయి రాజేష్. ఆయన కథను అందించి ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ తో కలిసి నిర్మించిన తాజా చిత్రం "చెన్నై లవ్ స్టోరీ" ప్రేక్షకాదరణతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద 50 కోట్ల రూపాయల వసూళ్లను దాటి రెండో వారంలోనూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు జరిగిన ఇంటర్వ్యూలో "చెన్నై లవ్ స్టోరీ" సినిమా విజయం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు సాయి రాజేష్. హృదయ కాలేయం , కొబ్బరిమట్ట సినిమాల సమయంలో డైరెక్టర్ గా నా పేరు స్టీవెన్ శంకర్ అని పెట్టుకున్నా. స్టీవెన్ స్పీల్ బర్గ్ లోని స్టీవెన్, శంకర్ లోని శంకర్ తీసుకున్నదే స్టీవెన్ శంకర్. దర్శకుడిగా ప్రచార కార్యక్రమాల్లో నేను బయటకు వచ్చి మాట్లాడాల్సిన అవసరం ఎంతైనా ఉండేది. అమ్మా నాన్నలు పెట్టుకున్న పేరుతోనే మన కెరీర్ కొనసాగించాలి అని అనుకుని కలర్ ఫోటో టైమ్‌లో సాయి రాజేష్‌గా క్రెడిట్స్ లో పేరు వేసుకున్నాను. ప్రేక్షకులు స్టీవెన్ శంకర్ అనే పేరును మర్చి పోయారా అనుకునే టైమ్‌లో మా చెన్నై లవ్ స్టోరీ సినిమాలో హీరో కిరణ్ క్యారెక్టర్ కు స్టీవెన్ శంకర్ అని పెట్టుకోవడం కలిసొచ్చింది. దీంతో ఇంకొంతకాలం ప్రేక్షకులు స్టీవెన్ శంకర్ పేరు గుర్తుపెట్టుకుంటారు. చెన్నై లవ్ స్టోరీ సినిమాకు నేను దర్శకత్వం వహించాలనే ఉద్దేశం లేదు. ఎందుకంటే నేను డైరెక్టర్‌గా బేబి సినిమా హిందీ రీమేక్ వర్క్స్‌లో ఉన్నాను. దాదాపు రెండేళ్ల ఒక సినిమాకు కష్టపడతాను కాబట్టి ఏదైనా రిజల్ట్ తేడాగావస్తే వెంటనే తీసుకోలేను.

# 'కొరియన్ కనకరాజు' ప్రేక్షకులందరినీ అలరిస్తుంది: వరుణ్ తేజ్



**కొరియన్ కనకరాజు కథ విన్నప్పుడు మిమ్మల్ని ఆకట్టుకున్న అంశాలు ఏమిటి?**

ముఖ్యంగా ఇందులో ఉన్న ఎంటర్‌టైన్‌మెంట్ నాకు చాలా నచ్చింది. గాంధీ ఈ కథ చెప్పినప్పటి నుంచి నేను నవ్వుతూనే ఉన్నాను. నేను ఏ కథ విన్నా, థియేటర్‌లో కూర్చొని సినిమా చూస్తున్న ప్రేక్షకుడిలాగే వింటాను.

**మీ కటౌట్‌కి సరిపోయే అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఇందులో ఉన్నాయనిపిస్తోంది కదా?**

నిజానికి ఒక నటుడు అన్ని రకాల పాత్రలు చేయాలి. నేను అన్ని రకాల పాత్రలు చేస్తాను. పొడవుగా ఉండే హీరోలు కామెడీ చేయకూడదనే ఒక అభిప్రాయం ఉంది. అది సరైనది కాదు. పాత్రను సరిగ్గా రాస్తే కామెడీ కుదురుతుంది.

**ప్రమోషన్స్ కూడా చాలా కొత్తగా చేశారు కదా?** అవునండి. ఈ రోజుల్లో సినిమాను జనాల్లోకి తీసుకెళ్లాలంటే ప్రమోషన్స్ కూడా కొత్తగా ఉండాలి. అంతేకాదు, అవి సినిమా కంటెంట్‌కు కనెక్ట్ అయ్యేలా ఉండాలి.

**సత్యతో మీ కాంబినేషన్ గురించి?**

సత్యతో నాకు చాలా మంచి బాండింగ్ ఉంది. మా ఇద్దరం కలిసి చేస్తున్న మూడో సినిమా ఇది. సత్యను కేవలం కమెడియన్‌గా మాత్రమే చూడకూడదు. తనలో మంచి నటుడు కూడా ఉన్నాడు.

**కొరియన్ భాష నేర్చుకోవడం ఎలా అనిపించింది?**

నాకు కొత్త విషయాలు నేర్చుకోవడం చాలా ఇష్టం. అందుకే నటుడిని అయ్యాను.

**రెండు విభిన్న పాత్రలు చేయడం ఎలా అనిపించింది?**

ఒక నటుడిగా ఇది నాకు చాలా ఛాలెంజింగ్ రోల్. రెండు విభిన్నమైన బాడీ లాంగ్వేజ్‌లు, రెండు భిన్నమైన మనస్తత్వాలు చూపించే అవకాశం రావడం చాలా సంతోషంగా అనిపించింది.నటుడిగా చాలా తృప్తిని ఇచ్చింది.

**మీకు ఫేవరెట్ జానర్ ఏది?**

హ్యూమర్, యాక్షన్ సినిమాలు చూడడం చాలా ఇష్టం.

**ట్రైలర్‌కు ఓజితో పోలికలు వచ్చాయి కదా?**

కళ్యాణ్ బాబాయ్ ఫ్యాన్స్ కి చాలా ఇంపాక్ట్ క్రియేట్ చేసిన సినిమా ఓజీ. అందులో జపనీస్ టచ్ ఉంది. అందుకే కొంతమందికి అలాంటి పోలిక అనిపించి ఉండొచ్చు.

**కొరియన్ గెటప్ కోసం ఎలాంటి హోమ్‌వర్క్ చేశారు?**

క్యారెక్టర్ డిజైన్ విషయంలో చాలా ప్లాన్ చేశాం. హెయిర్‌స్టైల్ పూర్తిగా కొరియన్ లుక్‌లో ఉండాలని నిర్ణయించుకున్నాం. కొరియన్లకు స్ట్రైట్, సిల్కీ హెయిర్ ఉంటుంది.

# 'సర్దార్ సర్వాయి పాపన్న' సినిమా పోస్టర్ లాంచ్



డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా వచ్చే వారం గ్రాండ్ థియేట్రికల్ కు రాబోతున్న యానివే ్షన్ మూవీ బహుజన చక్రవర్తిగా కీర్తి పొందిన చారిత్రక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి రూపొందించిన యానిమేషన్ మూవీ "సర్దార్ సర్వాయి పాపన్న. ఈ సినిమాను వి.జి. మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. దీపక్ న్యాతి నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు వహిస్తున్నారు. ఈ యానిమేషన్ మూవీ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా వచ్చేవారం గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్ర పోస్టర్ లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలో డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఈ రోజు "సర్దార్ సర్వాయి పాపన్న" సినిమా పోస్టర్ లాంఛ్ చేసుకోవడం సంతోషంగా ఉంది. దాదాపు 360 ఏళ్ల క్రితం బహుజన చక్రవర్తిగా వెలుగొందిన సర్దార్ సర్వాయి పాపన్న జీవిత కథతో వెంకటేష్ గౌడ్ దర్శక నిర్మాతగా ఈ చిత్రాన్ని రూపొందించారు. మా ఆర్కే ఫిలింస్ ద్వారా వచ్చే వారం ఈ సినిమాను రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఈ సినిమాను నేను చూశాను. మా వెంకటేష్ అద్భుతంగా రూపొందించాడు. సర్దార్ పాపన్న గొప్పతనం ఎక్కడా తగ్గించకుండా, ఆయన ఎన్ని పోరాటాలు చేశాడు, దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి మాట్లాడుతూ మా వి.జి. మూవీ మేకర్స్ బ్యానర్ పై "సర్దార్ సర్వాయి పాపన్న" సినిమాను నిర్మించాం. మాకున్న వనరులకు ఇది భారీ బడ్జెట్ మూవీ అనే చెప్పాలి. అయినా సినిమా కంప్లీట్ చేసి సెన్సార్ పూర్తి చేసి రిలీజ్ కు తీసుకొస్తున్నాం. ఈ నెల 14, లేదా 21న రిలీజ్ అనేది ప్లాన్ చేస్తున్నాం. సర్దార్ పాపన్న 376వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మా "సర్దార్ సర్వాయి పాపన్న" సినిమాను రిలీజ్ చేయాలని భావిస్తున్నాం.

# 'బంగారం' సాంగ్ లాంచ్



సోషల్ మీడియాలో వైరల్ మారిన డెమాన్ పవన్, రీతూ చౌదరి 'బంగారం' సాంగ్ బిగ్‌బాస్ ఫేమ్ డెమాన్ పవన్, రీతూ చౌదరి జంటగా నటించిన 'బంగారం' ఆల్బమ్ సాంగ్ విడుదలై సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ అందుకుంటోంది. మెలోడీ, విజువల్స్, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుండటంతో ఈ పాట ట్రెండింగ్‌లో కొనసాగుతోంది. ఈ పాటకు అఫ్రోజ్ అలీ సాహిత్యం అందించడంతో పాటు స్వరపరిచి, స్వయంగా ఆలపించారు. సమీరా భరద్వాజ్ వోకల్స్ పాటకు మరింత అందం తీసుకొచ్చారు. ముఖ్యంగా రణ్జిత్ రెడ్డి అందించిన మ్యూజిక్ ఈ పాటకు పెద్ద ప్లస్‌గా నిలిచింది. సాంగ్ లాంచ్ ఈవెంట్ లో డెమన్ పవన్ మాట్లాడుతూ: బిగ్‌బాస్ ద్వారా నాకు ఎంతో ప్రేమ, ఆదరణ లభించింది. ఆ ప్రేమతోనే ఈ పాటను నిర్మించాను. ఇదంతా మీ అందరి సపోర్ట్ వల్లే సాధ్యమైంది. ఈ వేడుకకు వచ్చిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. మా లిరిసిస్ట్, కంపోజర్ అఫ్రోజ్ అలీకి, సింగర్ సమీరా భరద్వాజ్‌కి థ్యాంక్యూ. చాలా బ్యూటిఫుల్ సాంగ్ ఇచ్చారు. రీతూ చౌదరి మాట్లాడుతూ: ఈ సాంగ్‌కు ఇంత మంచి రెస్పాన్స్ ఇచ్చిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ పాటలో భాగం కావడం నాకు చాలా ఆనందంగా ఉంది. ముఖ్యంగా డెమన్ పవన్ కోసం ఈ సాంగ్ చేశాను. పవన్ ఎంతో ప్యాషన్‌తో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. షూటింగ్ మొత్తం చాలా సరదాగా జరిగింది. సమీరా భరద్వాజ్ మాట్లాడుతూ: పవన్, రీతూ కలిసి చాలా మంచి పాట చేశారు. ఇది నిజంగా బ్యూటిఫుల్ సాంగ్. ఈ పాట మీద నమ్మకంతో వాళ్లు నిర్మించారు. లిరిసిస్ట్, కంపోజర్, సింగర్ అఫ్రోజ్ అలీ మాట్లాడుతూ: ఈ పాట మీ అందరికీ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. చాలా క్రేజీగా ఈ పాటను రాశాను.

# 'హుషార్ పిట్టలు' అందరి హృదయాలకు హత్తుకుంటుంది: బెక్కెం వేణుగోపాల్



అన్ను, వాసవి గణేషన్ జంటగా రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్ టైనర్ చిత్రం 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ మా సినిమా ఆగస్టు 15న విడుదల చేస్తున్నాం కానీ. బుక్ మై షోలో ఇప్పటి నుంచే టిక్కెట్స్ సేల్ చేస్తున్నాం. బుక్‌మై షో బుకింగ్ యాప్‌లో నా ఫోటో చూసుకోవాలని ఎప్పటి నుంచో కలలు కన్నాను. ఈ రోజు ఇది నెరవేరింది. ఈ సినిమా చూసి అందరూ మరొకరికి రికమెండ్ చేస్తారు. దర్శకుడు కావాలన్న నా డ్రీమ్ నెరవేరింది. ఈ సినిమా ట్రైలర్ ఈ నెల 10న విడుదల చేస్తున్నాం. ట్రైలర్ చూసిన తరువాత సినిమా మీద అందరి ఓపినియన్ మారి పోతుంది. బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ సినిమా నచ్చి సపోర్ట్ చేస్తున్నాను. తప్పకుండా ఈ సినిమా హిట్ కాబోతుందనే ఆత్మవిశ్వాసం అందరిలో కనిపిస్తుంది. సినిమా చూడగానే నాకు కూడా ఈ సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం కలిగింది. నిర్మాత సురేష్ బాబు చూసి నచ్చి ఈ సినిమాను విడుదల చేస్తున్నారు. చాలా పెద్ద సినిమాల మధ్యలో వస్తుంది. సినిమా మీద నమ్మకంతోనే విడుదల చేస్తున్నారు. ఈ సినిమా పతాక సన్నివేశాలు అందరి హృదయాలను హత్తుకుంటాయి. అన్ని వర్గాలకు నచ్చే సినిమా ఇది.


సెమ్వాల్ కాంస్యం

# స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో సూరజ్‌కు తొలి స్వర్ణం



**న్యూఢిల్లీ:** ప్రపంచ విశ్వవిద్యాలయ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో సూరజ్ చంద్ భారతదేశానికి తొలి స్వర్ణాన్ని తీసుకొచ్చాడు. గురువారం ముంబైలో జరిగిన ప్రపంచ విశ్వవిద్యాలయ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత సూరజ్ కుమార్ చంద్ భారతదేశానికి మొట్టమొదటి స్వర్ణ పతక విజేతగా నిలిచాడు. స్వదేశీ ప్రేక్షకుల ముందు పోటీపడిన సూరజ్, గంటా ఐదు నిమిషాల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్‌లో హంగేరికి చెందిన బెనెడెక్ టకాక్స్‌ను 5-11, 11-8, 11-5, 6-11, 11-4 స్కోరుతో ఓడించాడు. సూరజ్ తొలి గేమ్‌ను కోల్పోయి తడబడి ఆరంభం చేసినప్పటికీ, తదుపరి కోలుకుని తర్వాతి రెండు గేమ్‌లను గెలుచుకుని ఆధిక్యం సాధించాడు. ఆ తర్వాత హంగేరి ప్రత్యర్థి నాలుగో గేమ్‌ను 11-6 తేడాతో కైవసం చేసుకుని నిర్ణయాత్మక గేమ్‌కు దారితీశాడు. ఒత్తిడిలోనూ సంయమనం పాటిస్తూ, ఫైనల్ గేమ్‌లో 11-4 తేడాతో ఆధిపత్యం చెలాయించి టైటిల్‌ను కైవసం చేసుకున్న సూరజ్, గత ఎడిషన్‌లో సాధించిన పతకాన్ని మరింత మెరుగుపరుచుకున్నాడు. అలాగే సెమీఫైనల్స్‌లో బెనెడెక్ చేతిలో ఓడిపోయిన ఓం సెమ్వాల్ కాంస్యం కైవసం చేసుకోవడంతో, పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ డబుల్ పోడియంను దక్కించుకుంది. అయితే, మహిళల సింగిల్స్‌లో ఏ భారత క్రీడాకారిణి కూడా రౌండ్ ఆఫ్ 16 దాటి ముందుకు వెళ్లలేదు. నిరుపమ దుబే, షమీనా రియాజ్ మరియు పూజా ఆర్తి రఘు ముగ్గురూ రౌండ్ ఆఫ్ 16 వద్దే నిష్క్రమించారు.

# డబ్ల్యూటిటి ఛాంపియన్స్‌లో శ్రీజ తొలి విజయం




**న్యూఢిల్లీ:** 2026 డబ్ల్యూటిటి ఛాంపియన్స్‌లో శ్రీజ ఆకుల తొలి విజయాన్ని కైవసం చేసుకుంది. అయితే మణికా బాత్రా, మానవ్ థక్కర్, మనుష్ షా ముగ్గురూ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించడంతో, శ్రీజ ఒక్కతే భారత క్రీడాకారిణిగా ఈ టోర్నీలో నిలిచింది. జపాన్‌లోని యోకోహామాలో జరుగుతున్న మొదటి రౌండ్‌లో ఆస్ట్రేలియాకు చెందిన సోఫియా పోల్కనోవాను 3-2 తేడాతో ఓడించి, శ్రీజ ఛాంపియన్స్ ఈవెంట్‌లో తన కెరీర్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. భారత ప్యాడ్లర్ తన తొలి గేమ్‌ను 911 తేడాతో కోల్పోయినప్పటికీ, పుంజుకుని తర్వాతి మూడు గేమ్‌లను 11-8, 11-6, 12-10 తేడాతో గెలుచుకుని, కేవలం 32 నిమిషాల వ్యవధిలోనే వెనుకబడిన స్థితి నుండి విజయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత, వైల్డ్‌కార్డ్ ద్వారా ప్రవేశించిన బాత్రా, చైనాకు చెందిన రెండో సీడెడ్ కువాయ్ మాన్‌తో ఏమాత్రం పోరాడకుండా 1-11, 7-11, 7-11 తేడాతో ఓడిపోయాడు. పురుషుల సింగిల్స్‌లో కూడా షా, ఠక్కర్‌లకు ఇలాంటి ఫలితమే ఎదురైంది. స్లోవేకియాకు చెందిన దార్కో జోర్గిచ్‌తో హోరాహోరీ పోరులో ఠక్కర్ 2-3 తేడాతో ఓడిపోగా, ఫ్రాన్స్‌కు చెందిన ఆరో సీడ్ అలెక్సిస్ లెబ్రన్ చేతిలో షా 3-0 తేడాతో చిత్తుగా ఓడిపోవడంతో, ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో శ్రీజ ఒక్కరే మిగిలిన భారత ఆటగాడిగా నిలిచింది.


# కొరియా మాస్టర్స్‌లో క్వార్టర్స్‌కు తన్వి

**న్యూఢిల్లీ:** భారత్ టీనేజ్ షట్లర్ తన్వి శర్మ కొరియా మాస్టర్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లగా, హోరాహోరీ పోరు తర్వాత మరో భారత్ షట్లర్ అన్మోల్ ఖర్బ్ టోర్నీ నుండి నిష్క్రమించింది. కొరియా మాస్టర్స్‌లో మహిళల సింగిల్స్‌లో గురువారం తన్వి శర్మ, అష్మిత చలిహా, రక్షిత రామ్‌రాజ్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోవడంతో ఊపు లభించింది. అయితే అన్మోల్ ఖర్బ్, మరో ఇద్దరు భారత షట్లర్లు అద్భుతమైన ప్రదర్శనల తర్వాత నిష్క్రమించారు. తన్వి శర్మ తోటి భారత క్రీడాకారిణి శ్రియాంశి వలిశెట్టిపై 21-16, 17-21, 21-13 తేడాతో విజయం సాధించి తన ఫామ్‌ను కొనసాగించింది. ఆరంభంలో వెనుకబడిన తన్వి పుంజుకుని తొలి గేమ్‌ను కైవసం చేసుకోగా, శ్రీయాంశి రెండో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. చివరి గేమ్‌లో, విరామం తర్వాత తన్వి పట్టు సాధించి 57 నిమిషాల్లోనే మ్యాచ్‌ను సునాయాసంగా ముగించింది. అలాగే కొరియాకు చెందిన కిమ్ మిన్‌జిపై 21-17, 21-6 తేడాతో ఆధిపత్య విజయం సాధించి అష్మిత చలిహా కూడా ముందంజ వేయగా, జపాన్‌కు చెందిన మనామి సుయిజును 22-20, 21-10 తేడాతో ఓడించిన రక్షిత రామ్‌రాజ్ క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించింది.




అయితే, ఐదవ సీడ్ ఇషారాణి బరువా, మాన్సీ సింగ్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు. కొరియాకు చెందిన కిమ్ మిన్ సన్‌తో జరిగిన హోరాహోరీ పోరులో ఇషారాణి 21-17, 18-21, 19-21 తేడాతో ఓడిపోగా, చైనాకు చెందిన నాల్గవ సీడ్ హాన్ క్వియాన్సీ చేతిలో మాన్సీ 12-21, 21-14, 17-21 తేడాతో పరాజయం పాలైంది. వియత్నాం ఒలింపియన్ వు థి ట్రాంగ్‌తో హోరాహోరీగా జరిగిన పోరులో 21-23, 21-15, 18-21 తేడాతో ఓటమి పాలవడంతో ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లోనే అన్మోల్ ఖర్బ్ ప్రస్థానం ముగిసింది.

# వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు అమానత్, ఆశిష్



**న్యూఢిల్లీ:** ఈ సీజన్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత క్రీడాకారిణి అమానత్ కంబోజ్, ప్రపంచ అథ్లెటిక్స్ అండర్20 ఛాంపియన్‌షిప్‌లోని మహిళల డిస్కస్ త్రో ఫైనల్‌లో స్థానం దక్కించుకుంది. పురుషుల జావెలిన్ క్వాలిఫికేషన్‌లో ఆశిష్ సైతం ఫైనల్‌కు చేరుకున్నాడు. గురువారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో యువ భారత్ ప్లేయర్ కంబోజ్ 52.58 మీటర్ల అత్యుత్తమ త్రోను నమోదు చేసింది. క్వాలిఫికేషన్ స్టాండింగ్స్‌లో ఓవరాల్‌గా ఆరో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. పురుషుల జావెలిన్‌లో ఆశిష్ 69.87 మీటర్ల త్రోతో తన క్వాలిఫికేషన్ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకున్నాడు. ఓవరాల్‌గా రెండో స్థానంలో నిలవగా, ధరణిధరన్ 68.07 మీటర్ల ప్రదర్శనతో క్వాలిఫై అయ్యాడు. ఓవరాల్‌గా 12వ స్థానంలో అర్హత సాధించాడు. దక్షిణాఫ్రికా అండర్20 ఛాంపియన్ జాన్‌హెండ్రిక్ హేమన్స్ 76.02 మీటర్ల త్రోతో పురుషుల జావెలిన్ క్వాలిఫికేషన్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. అలాగే పోలాండ్‌కు చెందిన అలెక్సాండర్ వోజ్నా, చైనాకు చెందిన యాంగ్ జావోయి కూడా 69 మీటర్ల మార్కును దాటడంతో, ఫైనల్ హోరాహోరీగా సాగనుంది. మరోవైపు, పురుషుల 800 మీటర్ల పరుగులో, మొగలి వెంకట్రామ్ తన హీట్‌లో 1:52.81 సమయంతో మూడవ స్థానంలో నిలిచి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాడు. అయితే, ఉవిన్ ఆనంద్ 1:52.37 వేగవంతమైన సమయాన్ని నమోదు చేసినప్పటికీ, మరింత వేగవంతమైన క్వాలిఫైయింగ్ హీట్‌లో పోటీపడటం వల్ల సెమీఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయాడు.





# శ్రీలంక సిరీస్‌లో బెంచ్‌కే యంగ్ ప్లేయర్లు

## ఒక్క మ్యాచ్‌లోనూ నో ఛాన్స్

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో జరగబోయే కీలక టెస్టు సిరీస్‌లో భారత తుది జట్టు కూర్పుపై స్పష్టత ఇచ్చింది. ఘనమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ, జట్టులోని అనుభవజ్ఞుల పోటీ తట్టుకోలేక నలుగురు యంగ్ క్రికెటర్లు బెంచ్‌కే పరిమితం కానున్నారు. కనీసం ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం కూడా లభించక, డ్రెస్సింగ్ రూమ్‌తోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. శ్రీలంక పర్యటనలో మొదటి టెస్టు కోసం బిసిసిఐ అత్యంత బలమైన ప్లేయింగ్ ఎలెవన్‌ను సిద్ధం చేసింది. అక్కడి స్పిన్ పిచ్‌లు, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పక్కా వ్యూహంతో వెళుతోంది. జట్టు కలయికను సమతుల్యంగా ఉంచాలనే ఉద్దేశంతో అనుభవజ్ఞులైన ఆటగాళ్లకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో జట్టులోకి ఎంపికైన కొందరు యువ ఆటగాళ్లకు నిరాశ తప్పడం లేదు. సీనియర్లు ఫామ్‌లో ఉండటం, ఏ ఒక్కరికీ గాయాలు కాకపోవడంతో తుది జట్టులోకి కొత్తవారికి ప్రవేశం లభించడం దాదాపు అసాధ్యంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ మార్పులు లేకపోతే ఈ సిరీస్ పొడవునా నలుగురు ఆటగాళ్లు కేవలం వాటర్ బాయ్ పాత్రకే పరిమితం కావాల్సి వస్తుంది. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన స్పిన్ బౌలింగ్‌తో ఆకట్టుకున్న మానవ్ సుథార్‌ను బ్యాకప్ స్పిన్నర్‌గా జట్టులోకి తీసుకున్నారు. లంక పిచ్‌లపై భారత ప్రధాన స్పిన్ దళం అనుభవం ముందు అతనికి చోటు దక్కడ దాదాపు అసాధ్యం. తొలి టెస్టులోనే కాకుండా సిరీస్ అంతటా అతనికి బెంచ్ తప్పేలా లేదు. మరోకవైపు అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో రాణిస్తూ ఆల్ రౌండర్ ప్రతిభను చూపించిన సారాంశ్ జైన్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. జట్టులో ఇప్పటికే తుది కూర్పు కుదిరిపోవడంతో ఈ ఇద్దరు స్పిన్నర్లు తమ వంతు అవకాశం వచ్చే వరకు నిరీక్షించక తప్పడం లేదు. ఇక యంగ్ స్పీడ్‌స్టర్ గుర్‌నూర్ బ్రార్ తన వేగంతో సెలక్టర్లను ఆకట్టుకుని జట్టులో చోటు దక్కించుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లు జట్టులో ఉండటంతో గుర్‌నూర్‌కు అవకాశం లభించడం కష్టంగా మారింది. పేస్ విభాగంలో గట్టి పోటీ ఉండటంతో అతను మైదానంలోకి దిగే సూచనలు కనిపిస్తుండవు. టాప్ ఆర్డర్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ పరిస్థితి కూడా భిన్నంగా ఏమీ లేదు. ఓపెనింగ్, మిడిల్ ఆర్డర్‌లో ఇప్పటికే స్టార్ బ్యాటర్లు స్థానాలు ఖాయం చేసుకోవడంతో పడిక్కల్ రిజర్వ్ బెంచ్‌పైనే కూర్చోవాల్సి వస్తుంది. ఎవరైనా ఆటగాడు గాయపడితే తప్ప అతనికి ఆడే ఛాన్స్ రాదు.

# ఎల్ఐసి జూన్ త్రైమాసికంలో 23% లాభాల వృద్ధి

## కొత్తవ్యాపారంలో మెరుగైన లాభదాయకత




**ముంబయి, ఆగస్టు 6:** దేశీయ అతిపెద్ద జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. నికర లాభం వార్షిక ప్రాతిపదికన రూ.10,987 కోట్లనుంచి 23 శాతం పెరిగి రూ.13,492 కోట్లకు చేరింది. త్రైమాసికంలో నికర ప్రీమియం ఆదాయం 7 శాతం పెరిగి రూ.1.27 లక్షల కోట్లకు చేరగా, ఇతర ఆదాయం రూ.130 కోట్ల నుంచి రూ.635 కోట్లకు పెరిగింది. పెట్టుబడి ఆదాయం పెరగడం, ప్రీమియం వృద్ధి, కొత్త వ్యాపారంలో మెరుగైన లాభదాయకత సంస్థ పనితీరుకు ప్రధాన బలంగా నిలిచాయి.ఈ త్రైమాసికంలో వాల్యూ ఆఫ్ న్యూ బిజినెస్ వీఎన్‌బీ 61 శాతం పెరిగి రూ.3,136 కోట్లకు చేరింది. అలాగే వీఎన్‌బి మార్జిన్ 15.4 శాతం నుంచి 22.9 శాతానికి పెరగడం కొత్త పాలసీల లాభదాయకత మెరుగైనట్లు సూచిస్తోంది.మొదటి సంవత్సరం ప్రీమియం ఆదాయం కూడా 22 శాతం పెరిగి రూ.9,217 కోట్లకు చేరడం కొత్త పాలసీల విక్రయాలు బలంగా ఉన్నాయని వెల్లడించింది.సంస్థ ఆర్థిక స్థితి మరింత బలపడగా, సాల్వెన్సీ రేషియో గత ఏడాది 2.17 నుంచి 2.42కు మెరుగుపడి నియంత్రణ సంస్థ నిర్దేశించిన కనీస స్థాయికంటే ఎంతో ఎక్కువగా కొనసాగింది. పాలసీ కొనసాగింపు పరంగా పర్సిస్టెన్సీ రేషియో స్వల్పంగా 70.9 శాతం నుంచి 70.4 శాతానికి తగ్గింది. దీర్ఘకాలికంగా 61వ నెల పర్సిస్టెన్సీ రేషియో 58.3 శాతం నుంచి 61.3 శాతానికి పెరగడం పాలసీదారుల నిలకడ మెరుగుపడినట్లు సూచిస్తోంది. గురువారం ఎల్ఐసీ షేరు 1.39 శాతం తగ్గి రూ.387.55 వద్ద ముగిసింది. గత వారం రోజుల్లో 8.35 శాతం, నెల రోజుల్లో 9.68 శాతం, ఈ ఏడాది ఆరంభం నుంచి 9.11 శాతం, గత ఏడాది కాలంలో 13.18 శాతం మేర షేరు విలువ క్షీణించింది.

# లాభాల్లో ముగిసిన మార్కెట్లు

**ముంబయి, ఆగస్టు 6:** మధ్యప్రాచ్య ఉద్రిక్తతలకు దౌత్యపరమైన ఆశలు, జూన్ త్రైమాసిక కార్పొరేట్ ఫలితాలు అంచనాలకు మించి రావడంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు గురువారం వరుసగా రెండో రోజు లాభాల్లో ముగిశాయి. రోజంతా ఒడిదుడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో ప్రభుత్వ రంగ బ్యాంకులు , ఆయిల్ గ్యాస్ షేర్లలో బలమైన కొనుగోళ్లు సూచీలకు మద్దతునిచ్చాయి. మెటల్, ఆటో, ఐటీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి లాభాలను పరిమితం చేసింది.రిలయన్స్ ఇండస్ట్రీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లలో నమోదైన ర్యాలీతో నిఫ్టీ 24,600 మార్కును అధిగమించి ముగిసింది. బీఎస్ఈ సెన్సెక్స్ 373.76 పాయింట్లు పెరిగి 78,954.76 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 11.35 పాయింట్లు లాభపడి 24,636 వద్ద స్థిరపడింది. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.33 శాతం, నిఫ్టీ 1.29 శాతం మేర పెరిగాయి.నిఫ్టీకి రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.52 శాతం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.84 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.51 శాతం లాభాలతో మద్దతు ఇచ్చాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.01 శాతం పెరగగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.25 శాతం లాభపడింది. బీఎస్ఈలో మొత్తం 2,100 షేర్లు లాభాల్లో ముగియగా, 2,191 షేర్లు నష్టపోయాయి. మరో 209 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. కమోడిటీ మార్కెట్‌లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ చమురు ధర బ్యారెల్‌కు 64 సెంట్లు పెరిగి 80.09 డాలర్లకు చేరుకుంది. విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. పాక్షికంగా మార్పిడి చేయగల రూపాయి విలువ డాలర్‌కు 95.2450 వద్ద ట్రేడవగా, గత సెషన్ ముగింపు 95.0850గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో డిసెంబర్ 4, 2026 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 0.80 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,50,980కు చేరుకుంది. న్యూలాండ్ ల్యాబొరేటరీస్ షేరు 8.24 శాతం ఎగిసింది.నవీన్



ఫ్లోరిన్ ఇంటర్నేషనల్ 13.27 శాతం భారీ లాభం నమోదు చేసింది.కమ్మిన్స్ ఇండియా 0.70 శాతం క్షీణించింది.జీఎంఎం ఫాఫ్లర్ 14.57 శాతం జంప్ చేసింది.బయోకాన్ 2.68 శాతం పెరిగింది.కోల్టేపాటిల్ డెవలపర్స్ 10.10 శాతం ఎగిసింది.గార్వేర్ టెక్నికల్ ఫైబర్స్ 5.16 శాతం లాభపడింది.సయాజీ హోటల్స్ 0.96 శాతం తగ్గింది.వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా 2.07 శాతం పెరిగింది.భారతి హెక్సాకామ్ 2.43 శాతం నష్టపోయింది.



# బ్రిటానియా నికర లాభం రూ.591 కోట్లు

**ముంబయి, ఆగస్టు 6:** ఎఫ్ఎంసీజీ దిగ్గజం బ్రిటానియా ఇండస్ట్రీస్ తొలి త్రైమాసికంలో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 13.4 శాతం పెరిగి 521కోట్లనుంచి రూ.591 కోట్లకు చేరుకుంది. మార్కెట్ విశ్లేషకులు అంచనా వేసిన రూ.606 కోట్లతో పోలిస్తే కంపెనీ లాభం తగ్గింది. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 8.2 శాతం పెరిగి రూ.ఐదువేలకోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.4,622 కోట్లు ఉండగా, విశ్లేషకుల అంచనా రూ.4,999 కోట్లుగా ఉంది. దీంతో ఆదాయం దాదాపు అంచనాలకు అనుగుణంగానే నమోదైంది. కంపెనీ నిర్వహణ లాభం 11 శాతం పెరిగి 757.2 కోట్లనుంచి రూ.840.4 కోట్లకు చేరుకుంది. మార్కెట్ అంచనా రూ.871 కోట్లుగా ఉంది. దీంతో నిర్వహణ లాభం కూడా అంచనాలను అందుకోలేకపోయింది.ఇక ఎబిడిటా మార్జిన్ 16.4 శాతం నుంచి 16.8 శాతానికి పెరిగింది. అంటే 40 బేసిస్ పాయింట్లు మెరుగుపడింది.

# హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ నాలుగో క్లౌడ్ రీజియన్ ప్రారంభం

## భారత్‌లో రూ.20.5 బిలియన్ పెట్టుబడులకు ఊతం

**హైదరాబాద్, ఆగస్టు 6:** భారత్‌లో క్లౌడ్, కృత్రిమ మేధస్సు మౌలిక వసతుల విస్తరణలో భాగంగా మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో తన నాలుగో క్లౌడ్ రీజియ న్‌ను ప్రారంభించింది. దేశంలో క్లౌడ్, ఏఐ రంగాల అభివృద్ధికి ప్రకటించిన 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలో ఇది కీలక ముందడుగని కంపెనీ వెల్లడించింది.హైదరాబాద్ క్లౌడ్ రీజియన్‌ను మూడు అందుబాటు జోన్లతో నిర్మించారు. ఏఐ, క్లౌడ్ వర్క్‌లోడ్స్‌కు అత్యంత విశ్వసనీయత, నిరంతర సేవలు అందించే సామర్థం ఏర్పడుతుందని మైక్రోసాఫ్ట్ తెలిపింది. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ హైదరాబాద్ డేటా సెంటర్‌లో జీరోవాటర్ కూలింగ్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. హైదరాబాద్ రీజియన్ ప్రారంభంతో ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ పుణే, చెన్నై, ముంబై, హైదరాబాద్ నగరాల్లో క్లౌడ్ రీజియన్లను నిర్వహిస్తోంది. దీంతో భారత్‌లో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ నెట్‌వర్క్ తమదేనని కంపెనీ పేర్కొంది. జియో భాగస్వామ్యంతో మరో రెండు డేటా సెంటర్లను కూడా నిర్వహిస్తూ దేశీయ క్లౌడ్ సామర్థ్యాన్ని మరింత విస్తరించింది. కొత్త క్లౌడ్ రీజియన్ ద్వారా డేటా ఉత్పత్తి, ప్రాసెసింగ్ జరిగే ప్రాంతాలకు సమీపంలోనే అత్యంత వేగంగా సేవలుఅందించడం సాధ్యమవుతుందని మైక్రోసాఫ్ట్ తెలి మైక్రోసాఫ్ట్ ఇండియా అండ్ సౌత్ ఏషియా అధ్యక్షుడు పునీత్ చందోక్ మాట్లాడుతూ, భారీ స్థాయి క్లౌడ్ మౌలిక వసతులు, భద్రత, నైపుణ్యాభివృద్ధి, సార్వభౌమ క్లౌడ్ సామర్థ్యాలను కలిపి భారత్‌లో ఏఐ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడమే ఈ పెట్టుబడి లక్ష్యమని తెలిపారు.









Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.